1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 7
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in





## బెంగళూరుమహానగర నిర్మాత కెంపేగౌడ



సుందర బెంగళూరు మహానగర నిర్మాత కెంపేగౌడ మాతృభాష తెలుగు. అతను తెలుగులో చాలా కవితలు వ్రాశాడు. అలాగే 'గంగా గౌరి విలాసం' అనే యక్షగానమును రచించి, బెంగళూరులోని అలసూరులో తను నిర్మించిన సోమేశ్వరాలయంలోని సోమేశ్వరస్వామికి అంకితం చేశాడు కూడా. పెద్దకెంపేరాయుడు (గౌడ) దగ్గర నుండి రెండవ కెంపేరాయుడు వరకు గల వంశీయులు తెలుగువారు అనడానికి కొన్ని శాసనాధారాలు బెంగళూరు నగరంలోని బళ్ళాపురపేట రంగనాథస్వామి దేవస్థానమందు చూడవచ్చు.

అధికారభాషా సంఘం రసాభాస అయింది సరే... జరగాల్సింది ఏమిటి?

## తాపీ ధర్మారావు పురస్కారం-2022, 'అమ్మనుడిని అటకెక్కిస్తారా!'-సరసి కార్టూన్లు పుస్తకం విడుదల



# ఆహ్వానము

తెలుగు రాష్ట్రాలలో భాషాసంక్షోభంపై
వందలాది వ్యంగ్యచిత్రాలను సృష్టించిన
ఏకైక కార్టూనిస్టు

**సరస్వతుల రామనరసింహం(సరసి) గారికి**

**తాపీ ధర్మారావు పురస్కారం-2022**



**తెలుగు భాషోద్యమ కార్టూనిస్టు**

## 'సరసి'

వివిధ సామాజిక సమస్యలపై వేలాది కార్టూన్లతో
ప్రజల్లో చైతన్యం కలిగించిన చిత్రకారుడు.
పాలనా బోధనా రంగాలలో తెలుగుకు జరుగుతున్న
అన్యాయాలను ఎత్తిచూపుతూ తన కార్టూన్లతో
ప్రభుత్వాల్లో, ప్రజల్లో కదలిక తెచ్చిన
అనుపమాన వ్యంగ్యచిత్రకారుడు

సమయం: 2022 నవంబరు 5వ తేదీ శనివారం సాయంత్రం గం॥5.30 లకు

వేదిక : ఒకటవ అంతస్తు, హోటల్ ఐలాపురం, గాంధీనగర్, విజయవాడ

ముఖ్య అతిథి, పురస్కారం అందజేయువారు : గౌ॥ జస్టిస్ ఎ.వి.శేషసాయి,ఆం.ప్ర హైకోర్టు న్యాయమూర్తి

విశిష్ట అతిథి, పుస్తక ఆవిష్కర్త : డా॥ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర మాజీ ఉపసభాపతి

ఆత్మీయ అతిథి : శ్రీ నగ్నముని, ప్రముఖ కవి,

ఆత్మీయ అతిథి : ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు

సభాధ్యక్షుడు : డా॥ సామల రమేష్‌బాబు

స్వాగతం : శ్రీ తమ్మా శ్రీనివాసరెడ్డి,

తాము సకాలమునకు విచ్చేసి
సభను విజయవంతం చేయగోరుతున్నాం.

తెలుగుజాతి (ట్రస్టు)

నిర్వాహకులు
వెన్నిసెట్టి సింగారావు
సామల లక్ష్మణబాబు,
'తెలుగుజాతి'(ట్రస్టు)




## తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు


డా॥నాగసూరివేణుగోపాల్2009


డా॥కె.శ్రీనివాస్-2011


శ్రీ టంకశాల అశోక్-2013


శ్రీ జి.శ్రీరామమూర్తి-2014


శ్రీ ఎ.కృష్ణారావు-2015


శ్రీ ఆర్ఎం.ఉమామహేశ్వరరావు-2016


శ్రీసతీష్‌చందర్-2017


డా॥ ఏటుకూరి ప్రసాద్
జీవనసాఫల్య పురస్కారం-2018


శ్రీ వై.ముకుందరామారావు-2020


శ్రీమతి డి.పి.అనురాధ-2021

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





అక్టోబరు 2022


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4.** <u>హామీపత్రం తప్పనిసరి:</u> **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.**దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల **15**వ **తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20**వ **తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు.** వ్యాసాలను **ప్రచురించడానికి కనీసం 1–2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **ఇవీ సంగతులు** | | | **05** |
| **సంపాదక హృదయం:** | అధికారభాషా సంఘం రసాభాస అయింది సరే... | | **07** |
| **గిడుగు:** | గిడుగు జీవితం నుంచి... | **నందివెలుగు ముక్తేశ్వరరావు** | **09** |
| **తెలుగు:** | తెలంగాణ తెలుగు: మారుతున్న వైఖరి | **పి. ప్రకాశ్** | **13** |
| **గిడుగు:** | ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం | **వెలమల సిమ్మన్న** | **17** |
| **జైన వాఙ్మయం:** | జైన వాఙ్మయం–శిల్ప విశేషాలు | **ఆర్. కుసుమ కుమారి** | **21** |
| **కవిత్వం:** | కాస్మిక్ జాతి కోసం దిగంబర కవిత్వం | **సుంకర గోపాలయ్య** | **23** |
| **పొరుగు తెలుగు:** | బెంగళూరు నగర నిర్మాత... | **కోటిపల్లి సుబ్బారావు** | **25** |
| **వైద్యవిద్య :** | ప్రాంతీయ భాషలో వైద్యవిద్య... | **కరణం కళ్యాణకృష్ణకుమార్** | **29** |
| **స్పందన:** | భారతీయ లిపి | **అల్లంసెట్టి చంద్రశేఖరరావు** | **31** |
| **సాహిత్యరంగం:** | కా.రా. గారి కథాతత్వం | **వావిలాల సుబ్బారావు** | **33** |
| **భక్తి కవిత్వం:** | భక్తి కవిత్వం–సామాజిక నేపథ్యం | **వై.ముకుందరామారావు** | **36** |
| **వారసత్వ సంపద:** | 'సదసద్వివేకం'లోపించిన 'చతురత' | **పి.శివరామకృష్ణ 'శక్తి'** | **41** |
| **ధారావాహిక:** | పడమటి గాలితో నివురు తొలగిన.. | **గుజ్జర్లమూడి కృపాచారి** | **46** |
| | మన చదువుల కథలు | **సి.వి.క్రిష్ణయ్య** | **48** |
| **కవిత:** | ఓ కవీ | **తాపీ ధర్మారావు** | **06** |
| | పూలతేరు...! | **గన్నోజు శ్రీనివాసాచారి** | **30** |



| ముఖచిత్రంఫోటో | రేఖాచిత్రాలు | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|---|
| **అనుమల్ల గంగాధర్** | **చిదంబరేశ్వరరావు** | **సరసి** | **బండారు రఘురాం** |

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు


**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

**చందా వివరాలు: జీవిత చందా: రూ.5000**

**4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300**

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

### ● బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు ●

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **91402002038788 0**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

### ● చందాదారులకు సూచనలు ●

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

### ● ప్రోత్సాహకులుగా చేరండి ●

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ

# ఇవీ సంగతులు...

**ఆం.ప్ర. అధికారభాషాసంఘానికీ, ప్రాధికార సంస్థకూ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాజీనామా**

**విశాఖపట్నం/సిరిపురం, సెప్టెంబరు 21:** ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు తొలగించి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టడం చాలా బాధాకరమని, దీనికి తీవ్రంగా దుఃఖిస్తూ తన మూడు పదవులకు రాజీనామా చేస్తున్నానని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రకటించారు. జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆత్మకూడా అంగీకరించదని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని హిందీ విభాగంలో బుధవారం ఉదయం అత్యవసర సమావేశం నిర్వహించి... ఆయన తన నిర్ణయాన్ని ప్రకటించారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ఎంతో కృషిచేసిన ఎన్టీఆర్ పేరును తొలగించడం అత్యంత బాధాకరమన్నారు. ఆ బాధతోనే అధికారభాషా సంఘం, తెలుగు భాష ప్రాధికార సంస్థ, హిందీ ఆకాడమీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పదవులకు రాజీనామా చేసినా తెలుగు భాష అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు.

**తిరుమల, సెప్టెంబరు 25:** నాకు ఎన్టీఆర్ అంటే అమితమైన భక్తి. తెలుగు వ్యక్తిత్వానికి, తెలుగుజాతికి నిలువెత్తు నిదర్శనమైన ఎన్టీఆర్ అంటే నాకు అత్యంత గౌరవం అని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఇకపై రాజకీయాలు మాట్లాడను అని శ్రీవారి సన్నిధిలో సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. తాను రాజకీయ నాయకుడు కాకపోయినా అనేక రాజకీయాలు చేశానని... ఇకపై వాటికి స్వస్తి పలుకుతానని చెప్పారు. వాణిజ్య, పారిశ్రామిక సంఘాలను, ఉద్యోగ సంఘాలను, అధ్యాపక, అధ్యాపకేతర, లయన్స్, రోటరీ క్లబ్‌ల వారిని, రాజకీయ పార్టీల్లో బాధ్యత కలిగిన పదవుల్లో లేనివారిని అందరినీ కలుపుకొని.. రాష్ట్రంలో పాలనా భాషగా తెలుగును అమలు చేయించడమే తన జీవితానికి ఉన్న ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాల్లో అధికారులను, కలెక్టర్లను, ఎస్పీలను, కమిషనర్లను కలిసి 2018లో ఇచ్చిన జీవో ప్రకారం పాలనలో తెలుగు భాషను అమలు చేయాలని కోరతామని తెలిపారు.

మరల 27వ తేదీన విజయవాడలో పత్రికలవారితో మాట్లాడుతూ- రాజీనామాను తాను వెనక్కి తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు.

*- దినపత్రికల వార్తల ఆధారంగా...*

**సంస్కృత భాషను భారతదేశ రాష్ట్రభాష (జాతీయభాష) గా ప్రకటించాలన్న వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టేసింది.**

సంస్కృత భాషను దేశ జాతీయ భాషగా ప్రకటించాలని ఉన్నత న్యాయస్థానం ముందుకు ఒక పిటిషన్ వచ్చింది. పిటిషన్ తరపు న్యాయవాది దేశభాషలన్నిటికీ సంస్కృత భాష మాతృక అని, విలియం జోన్స్ పరిశోధనను ఉటంకించాడు. వాదనలను విన్న సుప్రీం కోర్టు ద్విసభ్య బెంచ్ ఈ వ్యాజ్యాన్ని కేవలం ప్రచారం కోసం వేసినదిగా పరిగణిస్తున్నామని, సంస్కృతం రాష్ట్రభాష అయ్యే పరిస్థితి లేదని వ్యాజ్యాన్ని తిరస్కరించారు.

**కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు యునెస్కో గుర్తింపు**

ఒడిశాలోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సంస్థకు యునెస్కో సంస్థ అందించే కింగ్ సెజాంగ్ పురస్కారం 2022 సంవత్సరానికి అక్షరాస్యత విభాగంలో లభించింది. దక్షిణ కొరియా సమర్పించే ఈ పురస్కారం మాతృభాష ఆధారిత విద్యలో కృషి చేసే సంస్థలకు ఇస్తారు. 20 వేల డాలర్ల బహుమతితో పాటు ప్రశంసా పత్రం, పతకం కూడా ఇస్తారు. సంస్థలో రూపొందించిన బహుభాషా విద్య-మాతృభాషా విద్య భాషా ప్రయోగశాలల పనితనాన్ని గమనించి ఈ పురస్కారం అందచేసారు.

**కన్నడ భాష పెరిమను పెంచేలా కర్ణాటక చట్టాలు రాబోతున్నాయి**


కర్నాటక ప్రభుత్వ కేబినెట్ కన్నడ భాష సమగ్రాభివృద్ధి బిల్లును రూపొందిస్తోంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతారు. కన్నడ భాషీయులకు ఉద్యోగాలివ్వని సంస్థలకు పన్ను మినహాయింపులు, ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు ఉండబోవని చట్టం రానున్నది. కన్నడేతర భాషీయులకు కన్నడ భాషను నేర్పించే వనరుల నిర్మాణంపై ఈ బిల్లులో విశేషంగా ప్రస్తావన ఉంది. కన్నడ మాధ్యమంలో చదవని ప్రభుత్వోద్యోగులు కన్నడ ప్రాథమిక భాష అవగాహన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాల్సి ఉంటుంది.

**ఇండిగో విమానంలో తెలుగుకు అవమానం**

16 సెప్టెంబరున విజయవాడ నుంచి హైదరాబాదుకు వస్తున్న విమానంలో విమాన సిబ్బందికి అందరికీ కేవలం హిందీ-ఇంగ్లీష్ రావటం వలన, ఒక ప్రయాణీకురాలికి తెలుగు మాత్రమే రావటం వలన, విమాన భద్రతకు సంబంధించి కీలకమైన సీటులో భద్రతా సూచనలు కేవలం ఆంగ్లంలో, హిందీలో ఉండటం వలన ఆ ప్రయాణీకురాలిని వేరే సీటులో కూర్చోవలసిందిగా ఇండిగో విమాన సిబ్బంది చెప్పారు. తెలుగు రాష్ట్రాల మధ్య నడిచే విమానంలో తెలుగులో మాట్లాడగలిగే సిబ్బంది లేకపోవటానికి ఈ ఘటన నిదర్శనం. దీంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నిరసనలు వినబడ్డాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇద్దరూ కూడా ఈ ఘటనను ఖండించారు. విమానాలలో ప్రకటనలు, సూచనలు అన్నీ ప్రాంతీయ భాషల్లో కూడా అందించాలని విమానయాన సంస్థలను కోరారు.

**ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల రద్దు తీర్పుపై స్టే విధించిన హైకోర్ట్ బెంచ్**

అక్టోబర్ 2021లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించి నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీ ఎంపిక పరీక్షలో ప్రశ్నాపత్రాలు తెలుగు మాధ్యమంలో లేవన్న కారణంతో ఇంతకు ముందు సింగిల్ జడ్జి ఇచ్చిన పరీక్ష రద్దు తీర్పును తాజాగా హైకోర్ట్ బెంచ్ తోసిపుచ్చింది. ఈ తీర్పును ఆధారం చేసుకొని ముమ్ముందు జరిగే పరీక్షల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తీసివేసే ప్రమాదం ఉంది. ఇది తెలుగులో పరీక్ష రాయాలనుకునే ఉద్యోగార్థులకు నష్టం కలిగిస్తుంది



# ఓ కవీ...


**అం**దమగు మేఘాల
సందులో, నొక చిన్ని
గొందిలో దూరి, యానందమునకై పాడు...
కుందామనే చింత కూడ దది, కూడ దది
పుట్టుగ్రుడ్డిగ పోకురా
ఓకవీ
వట్టిమ్రోడువు కాకురా!
“ఏకతార్” పాటలను
ఇంక చాలించరా;
కాకతో జగ మెుక్క కమ్మచ్చునే తీసి,
లోకతంత్రుల గొంతులోన పల్కించరా
పాతరోజులు పోయెరా
ఓ కవీ
రోత పాటలు మానరా!
దిక్కులను చూచినా,
చుక్కలను కాంచినా,
ఒక్కరీతిని రక్త మోడికలు కదుతుంది
బక్కవారిని పోరు చక్కాడిపోకుండ
నిలిచి శాసించవేరా
ఓ కవీ
పలికి పురికొల్పవేరా?

గొంతులో ఒక యగ్ని
కొత్తగా రగిలింది.
తంత్రులన్నీ ఒక్క పుంతలోబడ్డాయి
ఇంతింత అనరాని వింత బల మెుచ్చింది.
స్వార్థగానము మానరా
ఓ కవీ
సార్థకానికి పూనరా!
క్రూరులై కల్పించు
ఘోర యుద్ధాలలో
కోట్లకొద్దీ జనులు కూడు గుడ్డకు లేక
పాట్లుపడి వచ్చారు పరికించలేదేమొ
తిండియొక్కటె కాదురా
ఓ కవీ
గుండె ధైర్యము నూదరా!
నీటిలో గాలిలో
నేలమీదను “చావు”
కోటికోరలు చాచి వేటాడుచున్న; దా
ధాటికోరవలేక దద్దరిలుచున్నారు.
మెత్తదనమును వీడరా
ఓ కవీ
కత్తిసామును పాడరా!
అధిక బాధలతోడ
అలమటించే జనుల
కష్టాల కొలిమిలో కాగి మండినగుండె
కత్తివాదరనైన మెత్తననిపించగా
మాటాడ నుంకించరా
ఓ కవీ
మానసము నురికించరా!
తూర్పు పడమరలనక
దొర్లుకొని వచ్చేటి
దుఃఖవాహిని నాపి, దొడ్డశక్తిగ మార్చి

దుష్టరాక్షసి నొక్క త్రుటిలోన పరిమార్చ
కంకణమ్మును కట్టరా
ఓ కవీ
జంకెల్ల పోగొట్టరా!
పూలవర్షము కురియు
పాలమబ్బుల నుంచి
రాలుచుండే అగ్నిగోళాల మంటలో
కాలకుండా ప్రజల కాపాడి రక్షించ
జాతి కాయుధ మీవెరా
ఓ కవీ
నీ తేజమును చూపరా!
మండు టాకలిలోను
ఎండు నాల్కలలోను
మొండిబారిన పేద బండగుండెలలోను
గాండ్రించు భావాల నిండించి నీ గొంతు
సింహనాదము చేయరా
ఓ కవి
స్థిరమైన పేర్మ్రోయరా !
చిదిగి శిధిలాలైన
హృదయాలు పెనవేసి
అదురుబెదురులగుండె లన్ని యొక్కటిచేసి,
పదును నాలుకతోడ పలికి సాధించాలి
వెనుకాడగా కాదురా
ఓ కవీ
వెనుక తరుణము రాదురా!
ప్రజల కవివై గొంతు
రగిలించి పాడితే
బక్కడొక్కలు రేగి ప్రళయమారుతమట్లు
తక్కువెక్కువలెల్ల ఒక్క దెబ్బను కూల్చి
లోకాల నూగింపవా
ఓ కవీ
శోకాల తొలగింపవా! ❖

కొత్తపాళీలో ‘భావసూత్రానికి’ అనుగుణంగా ఉంటుందన్న నమ్మకంతో ‘ఓ కవీ’, అని నేను వ్రాసిన ఈ పద్యాలు యిస్తున్నాను. శ్రీ హరీంద్రనాథ చటోపాధ్యాయ ఇంగ్లీషున వ్రాసిన ఒక ఖండకావ్యాన్ని ఆధారంగా చేసుకొని దీనిని వ్రాశాను.

**–తాపీధర్మారావు**
**25-7-1955**



సంపుటి : 8 సంచిక : 7
**అమ్మనుడి**
అక్టోబరు 2022

సంపాదక హృదయం

## అధికారభాషా సంఘం రసాభాస అయింది సరే... జరగాల్సింది ఏమిటి?

**యా**ర్లగడ్డ లక్ష్మీప్రసాద్ అస్త్రసన్యాసం చేశారు. ఏరికోరి తెచ్చుకొన్న 'అధికారభాషా సంఘం' అధ్యక్ష పదవినీ, దానికి కోరల్ని తగిలించేందుకు పనికొస్తుందనుకొన్న ప్రాధికార సంస్థ అధ్యక్షపీఠాన్నీ రెండింటినీ ఆయన తనంతట తానే వదులుకున్నారు.ఆయన తీవ్ర అనారోగ్యంనుండి కోలుకొని వచ్చిన వెంటనే ఈ పరిణామం చోటుచేసుకొంది.

గతంలో చాలాసార్లు పలు సందర్భాల్లో మనం ప్రస్తావించుకొన్నట్లు– అధికార భాషా సంఘం అనేది చట్టరీత్యా 1966లో ఏర్పాటైనదే అయినా, దానికి ఇంతవరకూ ఎటువంటి నిరంతర వ్యవస్థను గాని, అధికారాలనుగాని ఏర్పరచలేదు. దానినొక ఉత్సవ విగ్రహంగా, ప్రభుత్వాల పట్టనితనానికి ఒక ముసుగుగా ఉపయోగించుకోవడం అలవాటై పోయింది. దానితో, అదొక సలహా సంఘంగానే మిగిలిపోయింది. ఈ పరిస్థితిని మార్చడానికి పలువురు అధ్యక్షులు ప్రయత్నించినా ప్రభుత్వ నేతలు పట్టించుకోలేదు. ఎన్టీరామారావు గారి హయాంలో 1988లో ఈ పరిస్థితిని మార్చడానికి జరిగిన గట్టి ప్రయత్నం పురిట్లోనే కన్నుమూసిన బిడ్డచందం అయిపోయింది. అప్పటి అధికార భాషాసంఘమే ప్రచురించిన 'అధికారభాష తీరుతెన్నులు' అనే చిన్న పుస్తకంలో దీనికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు. దీన్ని 'నడుస్తున్న చరిత్ర' పత్రిక 2003లో మళ్లీ ప్రచురించింది. అధికారభాషాసంఘానికి అధ్యక్షులుగా వచ్చేందుకు ఉత్సాహపడినవారు ఇదంతా తెలుసుకోవాలి. అంతేకాదు, నాటినుంచి నేటివరకు జరుగుతున్నదేమిటో అధ్యయనం చేయకుండా, ప్రభుత్వ నేతలు తెలుగుపట్ల అనుసరిస్తున్న విధానాల లోతుపాతుల్ని తెలుసుకోకుండా వారు ముందడుగు వెయ్యలేరు. పేరుపెట్టి ఎవరి చిత్తశుద్ధినీ శంకించడంలేదుగాని, ప్రభుత్వాల అవకాశవాదానికి తగ్గట్లే, అధ్యక్ష పదవిని ఆశించి వచ్చిన వారిలో చాలామందికి లక్ష్యసిద్ధికై కావలసిన సంకల్పబలం లేదనే చెప్పాలి. అధికార భాషాసంఘం ఒక సలహా సంఘంగానే మిగిలిపోవడంతో, అధ్యక్షులు చిత్తశుద్ధితో పనిచేసినా, ప్రభుత్వ అధికారుల సహాయ నిరాకరణ, నేతల పట్టనితనం వల్ల ఎక్కడి గొంగళి అక్కడే ఉండిపోయినట్లవుతున్నది. ఇటువంటి అకర్మణ్యతకు నిదర్శనంగా నిలచిన ప్రభుత్వాలకు చివరి ఉదాహరణగా తెలుగుపట్ల, తెలుగుజాతి పట్ల ప్రేమ, పట్టుదల ఉన్నాయని చెప్పుకొనే ప్రభుత్వాలలో చివరిది చంద్రబాబుగారిది. ఆ తర్వాత ఏర్పడిన జగన్మోహనరెడ్డి గారి ప్రభుత్వం భాషాజాతి అన్నా, భాషారాష్ట్రం అన్నా ఎటువంటి లోతైన అవగాహనగానీ, పట్టుదలగాని లేని తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది. తెలుగు అస్తిత్వ భూమికకు దూరంగా జరిగి, అభివృద్ధి పేరుతోనో, సామాజిక న్యాయం అనో ఓట్లు దండుకొని, అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఉన్న రాజకీయాలతో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ, పోటాపోటీగా ముందుకు సాగుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో– అధికారభాషగా ప్రజల భాష తెలుగును ఎంతవరకు అమలు చేస్తున్నారో నిగ్గుతేల్చేందుకు ప్రజాస్వామ్యస్ఫూర్తీ, పట్టుదలా కలిగిన ఒక యువవైద్యుడు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఎదుర్కోవలసిన పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది. ఇంతవరకు అధికారభాషను అమలు చెయ్యడానికి తాము చేసిందేమీ లేకపోవడంతో, చంద్రబాబు ప్రభుత్వం చివరి రోజుల్లో ఇచ్చిన 'ప్రాధికార సంస్థ జి.ఒ.' ప్రభుత్వ అధికారులకు గుర్తుకొచ్చింది. తెలుగుభాషోద్యమ సమాఖ్య పోరాట ఫలితంగా ఆ జి.ఒ. వెలువడిందన్న నిజాన్ని ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి. వెంటనే దాన్ని అడ్డం పెట్టుకొని, కోర్టులో కొంత కాలవ్యవధిని సాధించారు అధికారులు. లక్ష్మీప్రసాద్ గారికి తెలిసే జరిగిందో, తర్వాత తెలిసిందో గాని, ఆయనను ప్రాధికార

సంస్థకు కూడా అధ్యక్షుణ్ణి చేసేశారు. ప్రాధికార సంస్థ జి.ఒ.లో 7వ భాగాన్ని చూచి, అధికారుల్నీ, వ్యాపారవర్గాల్నీ దారిలో పెట్టుకొని అధికారభాషగా తెలుగును అమలులోకి తెచ్చుకోగలమనే ధైర్యంతో ఆయన కార్యరంగంలోకి దిగినట్లున్నారు. సహజమైన ఆవేశంతో ప్రకటనలు గుప్పించారు. అభినందించాల్సిందే కాని, ప్రభుత్వనేతల, అధికారుల ఇష్టం లేకుండా ఏమీ జరగబోదన్న సందేహం రాలేదేమో!

1988లో నందమూరి తారకరామారావు గారి సంకల్ప బలంతో, ఆదేశాలతో సీనియర్ ఆఫీసర్లతో సహా అందరూ దిగివచ్చారుగాని, ఆయన వలె ఆదర్శంగాని, సంకల్ప బలంగాని లేని నేటి ముఖ్యమంత్రి పాలనలో అలాంటి స్పందనను అధికారులనుండి ఎలా ఆశించగలం! వారి మద్దతు లేకుండా అ.భా.సం అధ్యక్షుడి వల్ల అయ్యేపనేనా ఇది!!

ఇప్పుడు 'ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ'ని వై.ఎస్.ఆర్. హెల్త్ యూనివర్సిటీగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయించేసరికి, లక్ష్మీప్రసాద్‌గారి మనసు క్షోభించింది. విలవిలలాడింది. ప్రభుత్వం నుండి తనకు లభించిన మూడు పదవులకూ రాజీనామా చేసేశారు. అంతలోనే తెలుగు పట్ల తనకున్న ప్రేమ, తాను చేసిన భీష్మ ప్రతిజ్ఞలు గుర్తుకు వచ్చి ఉంటాయి. తన సహజమైన ఆవేశంతో పత్రికలవారి ముందు తన బాధను వెళ్లగ్రక్కారు. మీడియా వారు వాళ్లకు తోచినట్లు వ్రాసేశారు. లక్ష్మీప్రసాద్ తన రాజీనామాను వెనక్కి తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఈయన చెప్పినదాన్లో వాళ్లకు అర్థమైంది అదీ! ఆ తరువాత మళ్లీ పత్రికల వారిని పిలిచి, పరిస్థితిని వివరించారు. నికరంగా తేలిందేమిటంటే ఆయన మడమతిప్పలేదు. అధికారభాషా సంఘ అధ్యక్షపదవినీ, తక్కిన రెండు పదవులనూ ఆయన వదిలేశారు. అంతే. పదవులను వదిలేసినప్పటికీ తెలుగుకోసం తానెప్పుడూ అంకితమయ్యే ఉన్నాననీ, అధికార అనధికారులందరినీ వ్యక్తిగతంగా కలిసి వారి సహకారాన్ని పొంది, అధికార భాషగా తెలుగు అమలు కోసం పూర్తిగా ప్రయత్నిస్తూనే ఉంటాననీ ప్రకటించారు.

ప్రభుత్వ ప్రమేయం, చొరవ లేకుండానే ఈ పని సాధ్యం అవుతుందని లక్ష్మీప్రసాద్ అనుకొంటున్నారా? పైన మేము ప్రస్తావించిన చరిత్రను మళ్లీ తరచిచూడాలి. తాను ఆరాధ్య దైవంగా భావించే ఎన్టీరామారావు గారి హయాంలో ఈ విషయంలో జరిగిన కృషినీ, ఆ తర్వాత నేటివరకు నడుస్తున్న చరిత్రనూ పరిశీలించాలి. లక్ష్యాన్ని సాధించడానికి ఎలాంటి కార్యక్రమాన్ని చేపట్టాలో యోచన చేయాలి. హితైషులతో సంప్రదించాలి. ఒక కార్యప్రణాళికను రూపొందించుకోవాలి. ఇదేమీ లేకుండా ఆవేశంగా ప్రకటనలను చేస్తే, మరింత గందరగోళంలోకి వెళ్లిపోవడంతప్ప, ఫలితాన్ని సాధించలేమని విద్యాధికుడూ వివేకవంతుడూ అయిన లక్ష్మీప్రసాద్ గారికి ఎవరూ చెప్పవలసిన అవసరం లేదు గదా!

సరే... జరిగిందేమో జరిగింది. అయనే అన్నట్లు రాజకీయాల్లో ఉన్నవారంతా చెడ్డవారని అనుకోలేము. మంచీ చెడూ అన్నిటికీ రాజకీయాలు ముడి పడి ఉంటాయి. పైగా, నిర్ణయాధికారం చివరగా పాలకుల అధీనంలో అంటే రాజకీయ నేతల చేతుల్లోనే ఉంటుంది. ప్రభుత్వ పాలనా రంగం చేతుల్లో ఉంటుంది. దీన్ని దారిలో పెట్టుకోగలిగేది ప్రజాచైతన్యంతోనే... వారి భాగస్వామ్యంతో కూడిన ఉద్యమాలతోనే.

కనుక ఆయన ఆ పార్టీతోనే ఉంటూ పాలనాభాషగా తెలుగును పటిష్టం చేసేందుకు ఎంతైనా కృషిచేయవచ్చు. పాలకపార్టీలు బోధనాభాష విషయంలో అనుసరించే విధానానికి– ఓట్ల రాజకీయాలతో బంధం ఉన్నది కనుక, దాని సంగతి పక్కనపెట్టండి. అలాంటి విషయాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల విద్యావిధానానికి వదిలి, అధికారభాషగా దానిని పూర్తిస్థాయిలో అమలులోకి తేవడానికి పాలకపార్టీకి అడ్డువచ్చేవారు ఎవరున్నారు?! లక్ష్మీప్రసాద్‌గారు ఆ లక్ష్యాన్ని ఎంచుకొన్నారు గనుక, ఆ దిశగా తాను ప్రభుత్వాన్ని ఎట్లా ప్రభావితం చెయ్యగలరో ఆచరణలో చూపాలని భాషోద్యమకారులు కోరుతున్నారు. వారి తరఫున తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుతున్నది.

29-09-2022

సామల రమేష్‌బాబు

నందివెలుగు ముక్తేశ్వరరావు
94914 28078

# గిడుగు జీవితం నుంచి నేర్చుకోవలసిన పాఠాలు



ఇవాళ దేశమంతటా ఉద్యమాలు వస్తున్నాయి.

వచ్చినవి వచ్చినట్టే పోతున్నాయి. చాలా ఉద్యమాలు నిలబడటం లేదు.

కొన్ని ఉద్యమాలు గుప్పెడు నినాదాలతో, కొన్ని కేకలతో, రభసతో ముగుస్తున్నాయి.

ఒక సత్యం కోసం, ఒక పరమార్ధం కోసం, ఒక జాతి హితం కోసం నిలబడే ఉద్యమాలు దాదాపు కనుమరుగైపోతున్న చారిత్రక సన్నివేశాన్ని మనం చూస్తున్నాం. చాలా సందర్భాల్లో ఉద్యమాలు బలాల, బలగాల ప్రదర్శనగా, నినాద ప్రాయంగా మిగిలిపోతున్నాయి.

కొన్నిసార్లు తప్పనిసరి క్రతువుగా కొనసాగుతున్నాయి.

చరిత్ర గతిని మార్చి తెలుగువాళ్ళ విజ్ఞాన ప్రపంచాన్ని మరింత విస్తృతం చేసిన ఒక మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు గారు. వారి జయంతి సందర్భంగా ఆయన జరిపిన ఉద్యమంలో మనం నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమిటి? అన్నదానిని పరామర్శించుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నం ఈ వ్యాసం.

**ఉద్యమం వేరు! వ్యక్తిత్వం వేరా!**

ఆయన విజయవంతం కావడానికి కారణం ఆయన వ్యక్తిత్వం.

ఆయన సత్యదృష్టి.

ఆయన వాస్తవిక పరిశోధనాదృష్టి. ఆయన జీవన ఆదర్శం ప్రతి అంశంలో కూడా కనిపిస్తూ ఉంటుంది.

వాటిలో కొన్నిటిని మనం ఇప్పుడు చూద్దాం.

ఒక ఉద్యమకారుడు ఆరంభించిన ఉద్యమాన్ని కడదాకా కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఉద్యమం పెద్దది అవుతున్నకొద్దీ దానికి వ్యతిరేకంగా పనిచేసే ప్రతిఘటన శక్తులు కూడా బలోపేతం అవుతూ ఉంటాయి.

అయినప్పటికీ మొత్తం ప్రపంచం అంతా తాను నమ్మిన పరమార్ధాన్ని దర్శిస్తూ నిత్యం తనను తాను జాగృతం చేసుకుంటూ రగులుకుంటూ ముందుకు సాగుతాడు ఉత్తముడైన ఉద్యమకర్త.

మనం సాధారణంగా వింటుంటాం. ఒకప్పుడు ప్రముఖ గణితవేత్త రామానుజం గారు ఆఖరికి కారు నెంబర్లు, వాహనాల నెంబర్లు ఏమి చూసినా ఆయనకు గొప్పగా ప్రేరణ కలిగించేవి.

వాటిమధ్య ఉన్న సంబంధాన్ని సాన్నిహిత్యాన్ని సాదృశ్యాన్ని అనేక కోణాలలో పరిశీలించి ఆయన అప్పటికప్పుడు చెప్పగలిగేవాడు. గిడుగు రామ్మూర్తి పంతులు గారు కూడా తానే ఒక ఉద్యమంగా మారిన పరిస్థితి మనం చూస్తాం. దీనికి రెండు ఉదాహరణలు మనవి చేస్తాను.

ఒకసారి ఉద్యమం జరుగుతున్న సమయంలోనే విజయవాడ నుంచి తెనాలికి ప్రయాణం చేస్తున్న సందర్భంలో ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారిని గిడుగువారు కలిశారు.

ఆయన ఆ సందర్భంలో ఉన్నవ వారిని పలకరిస్తూ...

“అయ్యా మీ మాలపల్లి నవల రెండవ పేజీలో తుమ్మ పీకలు ఎక్కి వస్తున్నవి అని ప్రయోగం ఒకటి ఉంది.

ఎక్కిరావడం అన్న పదం పెరుగుతున్నవి అనే అర్థంలో రాశారు.

ఇది వ్యవహారంలో ఉందా! ఎక్కడన్నా గ్రంథంలో చూసి రాశారా” అని అడిగారుట.

**ఏ ఉద్యమానికైనా భాషే ముఖ్యం**

తాను చేస్తున్న ఉద్యమమే కాకుండా ప్రజాహితమైన ఏ ఉద్యమమైనా ప్రజలకు అర్థమయ్యే ఉండాలి అన్న అభిప్రాయాన్ని గిడుగువారు ఉన్నవ వారి ముందర ఉంచారు. ఆయన మాటలు యథాతథంగా...

“మీ స్వరాజ్య ఉద్యమంలోకి ప్రజలు అందరూ రావాలంటే ముందుగా ప్రజలందరూ మీ ఉద్యమాన్ని అర్థం చేసుకోవాలి.

మీరు ప్రతి గ్రామము పోయి ప్రచారం చేయలేరు.

అట్లా చేయడానికి అంతరాయం కూడా వస్తుంది.

మీ ఉద్యమం అంతా వ్రాతతో, కరపత్రాలు ప్రకటించడంతో సాగాలి. మీరిప్పుడు రెండు కోట్ల 70 లక్షల ఆంధ్రులను విద్యావంతులను చేయడానికి నా మతము అంగీకరించినట్లయితే ఒక మాసం రోజుల్లో సాధ్యమవుతుంది. ముందుగా వ్యావహారిక భాషలో మీ కరపత్రాలు అన్నింటిని అచ్చొత్తించండి.

ఆ తరువాత తెలుగు అక్షరాలు గుణింతం ప్రతివారికి నేర్పడానికి గ్రామానికి ఒక ప్రచారకుడిని ఇవ్వండి.

మామూలు తెలివితేటలు కలవాడు అక్షరాలు గుణింతాలు

నేర్చుకోవడానికి వారం పది రోజుల కన్నా ఎక్కువ పట్టదు."

అని చెప్పారు.

అంటే ఉద్యమ నిర్మాణంలో భాష ఎంత ప్రభావశీలమైనది అవుతుంది అనడానికి వారికి స్పష్టమైన అవగాహన ఉన్నది అన్న విషయం ఇక్కడ స్పష్టమవుతోంది.

అలాగే భాష మీద వారికున్న అవగాహన గురించి ప్రస్తావించాలి. వారి వాఙ్మయ మిత్రులు టేకుమళ్ళ కామేశ్వరరావు గారు 1933 లో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. వ్యావహారిక భాషా రచనకు కొన్ని నియమాలు అన్న వ్యాసాన్ని పుస్తకరూపంలో ప్రచురించారు. దానికి పీఠిక రాయమని అడిగితే గిడుగువారి స్పందన చాలా ఉదాత్తంగా, శాస్త్రీయంగా, వాస్తవికంగా మనకు వినబడుతుంది.

ఈ దృక్కోణాన్ని ఇప్పటి ఉద్యమకారులు అలవర్చుకోవల్సిన అవసరం ఉంది.

ఆయన ఏమన్నారంటే

"వ్యావహారిక భాషకు నియమాలు అక్కరలేదని.

ప్రమాణ భాష అనేది లేదు అని రాస్తాను" అని చెప్పారు.

అలాగే ప్రజలకు సన్నిహితంగా ఉండే భాష రాయకపోవడం వల్ల భాష ప్రజలకు ఎలా దూరం అవుతుందో చెబుతూ "ఇంగ్లీషువారు ఇంగ్లీషు వార్తాపత్రికలు చదివినట్లు ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక మొదలైన వాటిలోని సంపాదకీయ వ్యాసాలు గ్రాంథిక ఆంధ్రమున వెలువడిన ఇతర వ్యాసములు జాబులును తెలుగువారు చదవలేరు.

ఈ విషయము అనేకసార్లు పరీక్షించి చూచినాను.

ఇంగ్లీషు నేర్చిన తెలుగువారైనా ఇంగ్లీష్ వార్తాపత్రికలు చదివినట్లు తెలుగు వార్తా పత్రికలు చదవలేరు. ఇందుకు కారణం తెలుగు అక్షరములు చదవడం వారికి అలవాటు కాకపోవడం కాదు. గ్రాంథిక ఆంధ్రము సుపరిచితం కాకపోవడమే!

అంటే గ్రాంథిక ఆంధ్రము వాడటం వల్ల ఎలా దూరం అవుతున్నది అన్నది గమనించారు.

సమస్యకు ఉన్న మూలకారణాన్ని గుర్తించారు.

స్పష్టమైన అవగాహనతో పోరాడారు.

స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం ఉద్యమకారుడికి ఉండవలసిన ఒక మంచి లక్షణం. ఆయన జీవన ఆదర్శాన్ని గురించి చెప్పేటప్పుడు ఎలా ఆలోచిస్తారు? ఎంత ఉదాత్తంగా ఆలోచిస్తారు? ముఖ్యంగా ఉద్యమాల్లో ఉన్నవాళ్లు ఎంత ఉదాత్తంగా విశాల హృదయంతో ఉండాలి? అన్నదానిని ఈ సంఘటన తెలియజేస్తుంది.

**పేరులో ఏముంది?**

ఒకానొక శాస్త్రి గారు గిడుగువారు తాను నోట్స్‌గా వ్రాసుకున్న ఒక వ్యాకరణ గ్రంథాన్ని తాను ప్రచురిస్తానని చెప్పి తీసుకొని వెళ్లి తన పేరు మీద ప్రచురించుకున్నాడు.

దాంట్లో దీనికి మూలకారణమైన కృషిచేసిన గిడుగు వారిని ప్రస్తావన మాత్రంగా కూడా పేర్కొనలేదు. అప్పుడు దానిమీద భావరాజు కృష్ణారావు గారు, ప్రస్తావన తీసుకొచ్చి మీ పేరు కూడా వేసుకోలేదు అని చాలా బాధ పడితే ఆయన ఏమంటారంటే ....

నా పేరు ఎందుకు?

నాకు పేరు అక్కర్లేదు.

నా వాదాన్ని ఆ శాస్త్రి గారు లోకంలో పార వేసినారు.

నాకు అదే తృప్తి అన్నారు. అంతటితో ఆగకుండా అక్షరాలు కనిపెట్టిన వారి పేరు తెలుసా? అట్లాగే నా పేరు లోకానికి తెలిస్తే ఏం? తెలియకపోతే నేం?

అని మందలించారు.

ఇది- ముఖ్యంగా ఉదాత్తులైన ఉద్యమం నడుపుతున్న వారికి ఉండవలసిన ధీరోదాత్త లక్షణం. పంతులుగారిలో ఈ వ్యక్తిత్వం స్పష్టంగా గోచరిస్తుంది.

**ఎక్కడ ఎక్కడ వ్యావహారిక భాష వాడాలి?**

గిడుగువారి ప్రస్తావన వచ్చినప్పుడల్లా వారి యొక్క భాషా విషయక మైన ఆదర్శం ఏమిటి అన్నది చర్చకు వస్తుంది.

వారు రచించిన మెమోరాండంలో దీనిమీద విస్తృతమైన ఉటంకింపు ఉన్నది.

మెమోరాండంలో ప్రారంభంలోనే ఆయన చెప్తారు

"మాతృభాషలో బోధించవలసిఉన్న బడి పిల్లల పుస్తకాలలోనే కాకుండా ప్రభుత్వం గానీ ప్రభుత్వ అధికారులు గానీ తెలుగు ప్రజలకు రాసే ఉత్తరాలలో,

పంపే వర్తమానంలో ,

ప్రచురించే పుస్తకాలలో కరపత్రాలలో

వ్యవసాయం, వాణిజ్యం, పారిశుద్ధ్యం మొదలైన విషయాలు జనసామాన్యానికి తెలియజేయడానికి ప్రచురించేవాటి అన్నింటిలోనూ వాడుక భాషను అనుమతించాలి అని చెప్పారు.

అంటే ఆయన భాషను గురించి ప్రభుత్వానికి తెలియజేసేటప్పుడు సహచరులకు తెలియజేసేటప్పుడు లేదా తనతో ఢీకొన్నటువంటి పండితులకు తెలియజేసేటప్పుడు ఎప్పుడైనా సరే ఆయనకు తడబాటు లేదు.

ఉండవలసినది వాడుక భాష.

అంటే అది జనసామాన్యానికి అందరికీ బోధపడాలి అని ఆయన ఉద్దేశం.

**ఎవరికోసం ఈ ఉద్యమం?**

గిడుగు వారి భాషోద్యమం నుంచి నేర్చుకోవాల్సిన మరొక అద్భుతమైన విషయం మనం చేస్తున్న ఉద్యమం ఎవరి హితం కోసం ఎవరి మేలుకోసం అన్న స్పష్టతని మనం వారి రచనల్లో ప్రకటనలలో చూస్తాం.

1919 లో తెలుగు అనే మాసపత్రికను ప్రారంభిస్తూ, ఆయన ఉపోద్ఘాతంలో చెప్పిన మాటలు ఒకసారి గుర్తుచేసుకుందాం.

"ప్రజానీకం వృద్ధిలోకి రావడం మీద మాకు నమ్మకం ఉంది.

పేద వాళ్లకు, అవకాశాల కోసం ఎదురు చూసే వాళ్లకు వెలుగు నింపడంలో ఈ భాషా సంస్కరణ తప్పకుండా ఉపయోగపడుతుంది అనుకోవడం నిజం కదా!

మన సజీవమైన భాష చెప్పాలనుకున్న దానికి ఎంతగానో ఉపయోగిస్తుంది.

మన పసి వాళ్లకు మంచి సాహిత్యం అందడం లేదు.

మన ఆడవాళ్లకు మంచి ఊహాశక్తి గల రచనలు దొరకడం లేదు."

అని ఆయన చెప్పారు.

అలాగే ప్రజామిత్ర కార్యాలయంలో 1940 జనవరి15 వ తారీకున మాట్లాడుతూ

"సంఘంలో వ్యక్తులు నిరక్షరకుక్షులుగా ఉన్నంతకాలం సంఘం అభివృద్ధిలోకి రాదు.

సౌఖ్యం అన్నది సంఘంలోని భాగ్యవంతులు,పెద్దలు సామాన్య ప్రజలతో పాటు, సమాంసులుగా అనుభవించాల్సిందే కానీ,

తాము ఒక్కరే అనుభవించవలసింది కాదు. ప్రజలలో విద్య వ్యాపిస్తే కానీ సంఘం వృద్ధిలోనికి రాదు." అన్నారు.

అంటే తాను ఏ ప్రజల కోసం ఈ ఉద్యమాన్ని నడుపుతున్నాను అన్న స్పష్టమైన అవగాహన ఉండటం అనేది ఆ ఉద్యమం విజయవంతం కావడానికి కారణం అవుతుంది అన్నది మనకి వీరినుంచి తెలుస్తుంది.

**అమలోదాత్త వ్యక్తిత్వం**

గిడుగు వారి కాలంలో జరిగిన ఒక సంస్కరణకి సంబంధించిన ఒక ఉదంతం వారిది ఎంత అమలోదాత్త వ్యక్తిత్వమో మనకి తెలియజేస్తుంది.

ఆ రోజుల్లో శ్రీకాకుళం ప్రాంతంలో

"బంకు మల్లయ్య శాస్త్రి " గారని మంచి వేద పండితులు ఉండేవారు. అకాలంలో ఆయన కుమార్తెకి వైధవ్యం ప్రాప్తిస్తుంది.

దాంతో ఏం చేయాలి అన్న దాని మీద మల్లయ్య శాస్త్రి గారు

శాస్త్ర గ్రంథాలు అన్నిటిని కూడా తిరగేసి వితంతు వివాహం నిషేధం ఏమైనా ఉన్నదా

దాని మీద శాస్త్రం ఏమి చెబుతున్నది అన్నది

చాలా నిష్పక్షపాతంగా పరిశీలించి పునర్వివాహం చేయాలని సంకల్పించినప్పుడు

ఆ సమయానికి మల్లయ్య శాస్త్రిగారు భార్య లేకపోవడం వల్ల పీటలమీద కూర్చోలేక పోతాడు.

అదే పీటలమీద గిడుగువారు భార్యాసమేతంగా కూర్చొని కన్య ధారపోసి కళ్యాణం జరిపిస్తారు.

ఈ కారణంగా ఆయన పడరానిపాట్లు ఇబ్బందులు పడతారు

కానీ శాస్త్రము, సంప్రదాయం పట్ల అత్యంత గౌరవ ఆదరాభిమానాలు ఉన్నప్పటికీ కూడా వాటిలో ఉన్న మూఢత్వాన్ని, వాటిలో ఉన్నటువంటి అశాస్త్రీయతని ప్రశ్నించే తత్వాన్ని

ఆయన ఒక ఉద్యమకారుడిగా

ఒక సంస్కర్తగా ఎప్పుడూ కోల్పోలేదు

అని మనకు ఈ సంఘటన తెలియజేస్తుంది.

**భాష మీద ఎవరి పెత్తనమూ చెల్లదు**

చివరిగా ఆయన జీవితం కొద్దిరోజుల్లో ముగుస్తుందనగా చెన్నపట్నం చికిత్సకోసం సీతాపతి గారి ఇంటికి వెళతారు,

అక్కడ ఎక్కడైనా ఒక సభ ఏర్పాటు చేస్తావా ఉపన్యాసం ఇస్తాను అని అడుగుతారు.

వీరి యొక్క ఆరోగ్యం బాగా లేనందున - వద్దు - అని అనుకొని కూడా మొత్తం మీద సభ జరుపుతామని చెప్పి నిర్ణయించుకొని ప్రజామిత్ర ఆఫీసు వద్ద ఒక పత్రికా సంపాదకుల రచయితల సమావేశాన్ని 1940లో ఏర్పాటు చేశారు. ఆ సందేశంలో ఆయన చెప్పినటువంటి ప్రతి ఒక్క మాట ఆయన జీవన వేదాంతాన్ని తన ఉద్యమ వేదాంతాన్ని, జీవన ఆదర్శాన్ని సమాజంపట్ల, భాష పట్ల ఉన్నటువంటి అపూర్వమైన అవగాహనని సమాజానికి జీవితానికి భాషకి ఉన్న చక్కనైన గాఢమైన అనుబంధాన్ని వ్యక్తం చేస్తూ మాట్లాడారు.

ఆయన మాట్లాడిన మాటల్ని యథాతథంగా చెప్తేనే బావుంటుంది *(ఆ ఉపన్యాసాన్ని పూర్తిగా అమ్మనుడి ఆగస్టు 2022 సంచికలో చూడవచ్చును).*

అంతకన్నా ఎవరూ చెప్పలేమని కూడా అనిపిస్తుంది.

"జీవంతో ఉన్న ప్రతి వస్తువు మారుతూ ఉండడం సహజం. అన్ని భాషలు మారుతూ వస్తున్నవే. మన తెలుగు భాష కూడా జీవ భాష కనుక మారుతున్నది. నన్నయ్య నాటి తెలుగు భాషే నేటికినీ ఏ మార్పు లేకుండా ఉన్నది అన్నది అబద్ధం,

ఉండాలి అనుకోవడం అవివేకం. నన్నయ్య నాటి గోదావరే ఈనాటికీ ప్రవహిస్తూనే ఉంది

కానీ ఆనాటి జలం ఈనాటి జలం ఒకటి కాదు.

"అందుచేతనే నిత్యా ప్రవాహినీ దేశ్యా" అన్నారు.

భాషలో ఎప్పటికి ఏ రూపాలు వాడుకలో పోయినవో అవి విడిచి ఏవి వాడుకలోకి వచ్చినవో అవి ప్రయోగిస్తూ గ్రంథాలు రచించటం సత్సంప్రదాయం.

అందుచేతనే వేదకాలం నాటి వైదిక రూపాలు భాషలో ఆర్షములని వాటిని సంస్కృత భాషా గ్రంథాలలో ప్రయోగించరాదని నిషేధించారు. చివరలో ఆయన ఆశావహ దృక్పథం ప్రపంచానికి తాను చెప్పిన సందేశం ఎలా వెళ్ళింది అనేదానిమీద ఆయనే ఒక మదింపు చేసుకున్నారు.

చాలా అద్భుతమైన భాషలో తమ యొక్క మూల్యాంకనాన్ని తానే చెప్పుకున్న మాటలివి.

"నా శ్రమ వృథా కాలేదు.

మొదట నలుగురైదుగురు మాత్రమే ఆమోదించిన నా వాదము వేలకొలది విద్యాధికులు విద్యార్థులు కవులు రచయితలు ఆమోదించారు.

ఏవో ఒకటి రెండు తప్ప పత్రికలన్నీ తమ సంపాదకీయాలు, తక్కిన వ్యాసాలు వ్యావహారిక భాషలోనే ప్రకటిస్తున్నాయి.

ఇంతవరకు నేను కృతార్థుడను."

ఇది ఆయన ఆఖరి సందేశం.

ఈ ఆఖరి సందేశంలో ఆయన

" నిత్య ప్రవాహ రూపంలో ఉండే భాషను కృత్రిమమైన కట్టుబాట్లతో బిగించడం..భాష మీద పెత్తనం చేయాలనుకోవడం తప్పు"

అని..ప్రజలకు అందే భాష ప్రజలను చైతన్య పరిచే భాషగా ఉండాలి అని ప్రకటించడం దీంట్లో మనం చూస్తాం.

**పండితులు కూడా ఆమోదించారు**

చివరిగా ఆ కాలంలో మహాకవిగా ఆధునిక ఆంధ్ర కవి ప్రపంచ నిర్మాతగా లబ్ధప్రతిష్టులైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు గిడుగువారి పాండిత్యం మీద వారి భాషావరివస్య మీద చెప్పినటువంటి మాటలతో దీన్ని మనం ముగించుకుందాం!

"వీరికి ఉన్న విమర్శనాజ్ఞానం ఇంతా అంతా అని చెప్పడానికి నా

తరం కాదు.

ఈయన ఇంగ్లీషులో బి.ఏ. తెలుగులో ఏ పండితులును ఈయనకు చాలరు.

సంస్కృతంలో ఈయన వ్రాసే విషయం చూస్తే దానిలో ఎంత పాండిత్యం ఉందో తెలుసుకోవడానికి శక్యం కాదు. ఇంకా ఆయా భాషలతో సంబంధం ఉన్నవి లేనివి కూడా ఈయనకు హృత్కవిలి.

అట్టి ఈ సర్వజ్ఞునకు వ్యావహారిక భాషలోనే గ్రంథాలు కవులు రచించాలి గాని ..

గ్రాంథిక భాషలో రచించడం పనికి రాదనే పట్టుదల పూర్తిగా ఉంది. అది నెగ్గుతుందో నెగ్గదో చెప్పలేను గానీ ఆయనకు మాత్రం కొన్నాళ్లలో తన సంకల్పం నెరవేరుతుందనే నమ్మకం మాత్రం పూర్తిగా ఉంది.

ఆ సంకల్పం నుంచి ఆయనను మాత్రం బ్రహ్మదేవుడు కూడా తిప్పనేలేడు.

ఆయనకు వయస్సు ఇప్పుడు ఎనభయ్యో పడిలో నడుస్తూ ఉంది. ఇప్పుడున్నూ ఆయన చేసే కృషి దానికోసమే!

జీవితమంతా ఆ మహనీయుడు ఆ ఈ కృషికే ధార పోయడం లోకమెరిగిందే!

నన్నయభట్టు మొదలుకొని నేటి వరకున్నూ బయలుదేరిన భాషానుశాసకులలో ఎవరికి గాని గిడుగు పంతులుగారికి తెలిసినన్ని మహాకవి ప్రయోగ విశేషాలు తెలియవని ఏ ప్రమాణం పడితే ఆ ప్రమాణం చేయడానికి జంకను.అన్నారు."

ఇవి చెళ్ళపిళ్ళ వంటి విద్వత్కవివరేణ్యులు ఆనాటి సాహిత్య ప్రపంచాన్ని ఉర్రూతలూగించినటువంటి కవితల్లజుడు అయిన చెళ్ళపిళ్ళ వారి వాక్కులు.

వీటిలో మనకు బోధపడేది ఏమిటి అంటే ..వారు పండితులను, పామరులను, దీటుగా ఎదుర్కొంటూ కూడా పండితుల పట్ల ఏ మాత్రము వైమనస్యం లేకుండా వారికి నచ్చ చెప్పడానికి తనకున్న ప్రతి క్షణాన్ని తనకు ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని లక్షలాది భాషా ప్రయోగాలని చూసి తను నేర్చుకున్న దానిని యథాతథంగా లోకానికి చెప్పడానికి గిడుగువారు ప్రయత్నం చేశారు.

ఈనాడు కూడా భాషోద్యమంలో భాషకి ముఖ్యంగా ప్రభుత్వం నుంచి, అలాగే పాఠ్యపుస్తకాలు, పాలనా రంగం ఇలాంటి అనేక వ్యవస్థలను నుంచి ఎదురవుతున్నటువంటి, అనేక సవాళ్లలో ప్రతి ఒక్కరికి నచ్చ చెప్పాల్సిన అవసరం వారిలో సౌమనస్యాన్ని తట్టిలేపాల్సిన అవసరాన్ని మనకి గిడుగు వారు జ్ఞాపకం చేస్తున్నారు.

చెళ్ళపిళ్ళ వారి మాటల్లోనే మనం వారి సౌమనస్యాన్ని గురించి విందాం.

"అట్టి సౌమనస్యాన్ని ఎంత ఉండాలో అంతా పంతులు వారియందు మూర్తీభవించి ఉందని కానీ, సౌమనస్యం ఈ స్వరూపంగా అవతరించిందని కానీ నేను విశ్వసిస్తూ ఉన్నాను.

ఇట్టి మహనీయుణ్ని గ్రామ్య భాషావాది అయినంత మాత్రంచేత కానీ, వారివారి గ్రంథాల్లో నిజమైన తప్పు చూపించటం అనే హేతువుచేత కానీ, నిరసించడం కన్నా పామరత్వం మరొకటి లేదు. అవసరాన్ని బట్టి నేటి కవులు అనే కాదు, ప్రాచీన కవులు అనే కాదు, ఈయన ఒక ఊపు ఊపిన మాట నిజం.

ఆయన పెట్టిన వాతలు శాశ్వతంగా నిలిచిపోయేవే కానీ, ఏవో వెక్కిరింపు మాటలతో అంతరించేవి కావు.

పంతులు గారి విమర్శనానికి పంతులుగారి విమర్శనమే సాటి.రామరావణయోర్యుద్ధం రామరావణయోర్యివ.

మొత్తం మీద గిడుగు రామ్మూర్తి పంతులు గారి జీవితం నుంచి ఇప్పటికీ ఎప్పటికీ నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమిటంటే..

ఆయన వ్యక్తిగత జీవితము, ఉద్యమ జీవితము వేరు వేరుగా లేవు.

ఆయన జీవితమే ఒక ఉద్యమంగా గడిపారు.

ఉద్యమ ఆదర్శాలకు అనుగుణంగా జీవితాన్ని గడపాలి అన్నది ఆయన మనకు నేర్పిన పాఠం.

అలాంటి వాళ్ళు ఇప్పుడు ఉద్యమాల్లో లేకపోవడం ప్రధానమైన లోపం.

ఇప్పుడు ఉద్యమాలలో కనిపించేవారు రెండు రకాలు.

ఉత్తర కుమారులు.

నిరుత్తర కుమారులు.

మొదటి వారికి ప్రగల్భాలతో జీవితం గడిచిపోతుంది.

రెండవ రకం వారు తెలిసీ మౌనం పాటిస్తారు.

రెండూ ప్రమాదకరమైనవే!

వర్తమాన సమాజం ఈ స్తబ్దతలో నుంచి

ఈ నిజాయితీ లేమి నుంచి బయటపడడానికి ఉపకరిస్తుందనే నమ్మకంతో

గిడుగువారి జీవితం గురించి, ఉద్యమం గురించి

స్థాలీపులాక న్యాయంగా ఈ వ్యాసంలో ప్రస్తావించాను.

ఉద్యమాల్లో ఉండేవాళ్ళు పెద్ద మనుషులుగా ఉండటం, చలామణి కావడం ముఖ్యం కాదు.

పెద్ద మనసుతో ఉండాలి. గిడుగు వారి జీవితం అందుకు నిత్య ప్రేరణ దీపంగా పనికొస్తుంది.

---

వ్యాసకర్త సంయుక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో భాష, సాంస్కృతికశాఖ కార్యదర్శిగా, నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు

### ప్రాచీన తెలుగు విశిష్ఠ అధ్యయన కేంద్రం నెలకొల్పటానికి ప్రభుత్వం భూమిని కేటాయించింది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు దగ్గర వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ఠ అధ్యయన కేంద్రం నెలకొల్పటానికి 5.05 ఎకరాల భూమిని కేటాయించింది. సెప్టెంబరు 17న జరిగిన ఒక కార్యక్రమంలో భారతీయ భాషల అధ్యయన కేంద్రం అధ్యక్షుడు డా.శైలేంద్ర మోహన్‌కు వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ భూమి తాలూకు పత్రాలను అందచేశారు.

పి. ప్రకాశ్
94918 40574

# తెలంగాణ తెలుగు - మారుతున్న వైఖరి

ఒకప్పుడు కొన్ని రాజకీయ, ప్రాంతీయ విభేదాల కారణంగా తెలంగాణ తెలుగు పై కొంత వ్యతిరేకత ఉండేది అనేది వాస్తవం. కానీ ఇప్పుడు అలాంటిది లేదు. మెల్లమెల్లగా తెలంగాణ తెలుగుపై అందరి వైఖరీ మారుతోంది. అందుకే ఇప్పుడు తెలంగాణ తెలుగులో లేదా తెలంగాణ యాసలో వచ్చిన సాహిత్యమూ, పాటలూ తెలంగాణేతర ప్రాంతాలకు కూడా చేరుకుంటున్నాయి. ప్రస్తుతం తెలుగు వాడుకకు మరో కేంద్రంగా కాదు, హైదరాబాదే ప్రధాన కేంద్రంగా మారుతున్న పరిస్థితులు కనబడుతున్నై.

**భి**న్నత్వంలో ఏకత్వాన్ని కలిగివుండడమే భారతీయ సంస్కృతి. భారతదేశం భిన్న మతాలకూ, భిన్న సంస్కృతులకూ, విభిన్న జాతులకూ, ఇంకా అనేక భాషలకూ నిలయం. ఒక్కొక్క మతం ఒక్కొక్క కాలంలో ఆవిర్భవించింది, అదేవిధంగా ఒక్కొక్క సంస్కృతి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఏర్పడింది. అదే వరవడిలో అనేక జాతుల కూడలిగా భౌగోళిక, రాజకీయ, సామాజిక భాషా పరమైన కారాణాల చేత భారతదేశంలో అనేక భాషలు కూడా ఏర్పడ్డాయి. భారతదేశంలో ఒక్కొక్క జాతికీ, ఒక్కొక్క మతానికీ, ఒక్కొక్క ప్రాంతానికీ కుడా ప్రత్యేక భాషలు ఉన్నాయి. అయితే, భారతదేశంలో ఒక భాష ఒక రాష్ట్రంలో అధికార భాషగా ఉన్నట్టుగానే, ఒకే భాష అనేక రాష్ట్రాలలో అధికార భాషగా ఉండగా, ఒకే రాష్ట్రంలో అనేక భాషలు కూడా అధికార భాషలుగా ఉన్న రాష్ట్రాలు కుడా ఉన్నాయి. ఉదాహరణకు, కన్నడ కర్ణాటక రాష్ట్ర భాషగా, తమిళం తమిళనాడు రాష్ట్ర భాషగా ఇంకా మలయాళం కేరళ రాష్ట్ర భాషగా ఉన్నట్టు, హిందీ ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఇంకా అనేక రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర అధికార భాషలుగా ఉన్నై. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు కూడా ఒకే రాష్ట్రంలో ఒక ప్రధాన అధికార భాషగా ఉండేది. కానీ ఆపైన ఆంధ్రప్రదేశ్ ఇంకా తెలంగాణగా విడిపోయిన తరువాత, తెలుగు ఇప్పుడు ఒక భాష - రెండు రాష్ట్రాలుగా మారిపోయింది. భారతదేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాలలో ఆంధ్ర ప్రదేశ్ మొదటిది అవ్వడం విశేషం. అయితే భారతదేశ స్వాతంత్ర్యానంతరం తెలంగాణా నిజాం పాలన నుంచి విముక్తి పొందిన తరువాత 1956లో భారత ప్రభుత్వం భాషా ప్రాతిపదిక ఆధారంగా తెలంగాణను ఆంధ్రతో కలిపి సంయుక్త ఆంధ్రప్రదేశ్ గా రూపొందించారు. అయితే తెలంగాణ ప్రాంతాన్ని భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేశారు గానీ, తెలంగాణకు నీళ్లు, నిధులూ, నియామకాల పంపిణీలో అన్యాయం జరగడం వలన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు 2014 సంవత్సరం వరకు పోరాడుతూనే ఉంది. అయితే **తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులూ, నియామకాల పంపిణీలో తెలంగాణ విషయంలో చిన్న చూపు చూపించినట్టు, తెలంగాణ తెలుగుపై అదే విధమైన ధోరణి ఉండటం చేత పైన పేర్కొన్న అంశాలతో పాటు తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ భాష కుడా అంతే కీలకమైన పాత్రను పోషించింది.** అందుకని, మనం కేవలం ఇక్కడ తెలంగాణ భాష, దాని చుట్టూ ఉన్న చారిత్రాత్మక, రాజకీయ, ప్రాంతీయ, మరియు సామాజిక పరమైన విషయాలను మాత్రమే చర్చించే చిన్న ప్రయత్నం చేద్దాం.

**తెలంగాణ భాషా చరిత్ర**

ప్రతి జాతికీ, ప్రతి సంస్కృతికీ, తనకంటూ ఒక్క ప్రత్యేక చరిత్ర ఉంటుంది. అలాగే ఒక భాషకు కుడా ఒక ప్రత్యేక చరిత్ర ఉంటుంది. అయితే ఒక భాష చరిత్రను రెండు రకాలుగా చూడవచ్చు. ఒకటి ఆ భాష పుట్టు పూర్వోత్తరాలను తెలియజేసేది, కాగా రెండోది ఒక భాష ఎదుర్కొన్న లేక ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక, ప్రాంతీయ సమస్యలను గురించి తెలియజేసేది. అయితే తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాల గురించీ దాని జన్యుసంబంధాల గురించీ ఎన్నో అధ్యయనాలు వచ్చాయి. అందువలన ఇక్కడ కేవలం తెలంగాణ భాష మరియు అది ఎదుర్కొన్న చారిత్రక, రాజకీయ, సామాజిక, ఇంక ప్రాంతీయ సమస్యల గురించి మాత్రమే చర్చించటానికి ప్రయత్నిస్తాను. తెలంగాణకు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉంది, ముఖ్యంగా బహమన్‌షా, కుతుబ్ షా పాలకులు (1323-1687) మరియు నిజాం పాలకులు (1687-1948) తెలంగాణను ఆరుశతాబ్దాలకుపైగా ఆక్రమించి పాలించకముందు శాతవాహనులూ, పశ్చిమ చాళుక్యులూ మరియు కాకతీయ రాజులు పరిపాలించేవారు. అయితే కులీ కుతుబ్ షా మరియు ఆ తరువాత నిజాం రాజులు తెలంగాణ ప్రాంతాన్ని ఆక్రమించిన తరువాత, ఇతర రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాలను పక్కనే పెడితే, వీరి పాలనలో తెలంగాణ ప్రాంతంలోని తెలుగుపై చాలా ప్రభావం పడింది అని చరిత్ర చెబుతోంది. ఈ ప్రభావం కులీ కుతుబ్ షా కాలంలో కంటే నిజాం కాలంలో చాలా ఎక్కువగా ఉంది అని చెప్పవచ్చు. ఇక్కడ కొత్తగా చెప్పాల్సింది ఏమంటే, బయటినుంచి వచ్చిన పాలకులు పాలితుల కష్టసుఖాల పరామర్శకంటే తమ సంస్కృతినీ, తమ ఆచారాలనూ, తమ భాషను తెలంగాణపై రుద్దడానికే ఎప్పుడూ ప్రయత్నించారు. ప్రత్యేకించి నిజాం పరిపాలనను గమనించితే, తెలంగాణ ప్రాంతంలో మెజారిటీ ప్రజల మాతృభాష తెలుగు అయినప్పటికీ, తెలుగుకు బదులుగా ఉర్దూను తన పాలనా భాషగా అమలు అయ్యే విధంగా చూసుకున్నారు. ఉర్దూను విద్య, వైద్య మరియు ప్రభుత్వ రంగాలలో అమలు చెయ్యడమే కాకుండా చాలా సందర్భాలలో ఉర్దూను కేవలం అధికారక భాషగా మాత్రమే కాకుండా, అనవసరం అయిన చోటకూడా ప్రజలపై ఉర్దూని బలవంతంగా రుద్దేవారు అని మన చరిత్ర చెబుతుంది. ఇలా వైద్యం, విద్య మరియు ప్రభుత్వ రంగాలలో తెలుగును నిర్లక్ష్యం చేసి ఉర్దూను అమలు చేయడం వలన తెలుగు ఎదుగుదలకు అంతరాయం కలిగిందని చెప్పాలి. ఏనాటినుంచో వస్తున్న సాహిత్యం, నాటకం, వినోదం, ప్రాంతీయ వృత్తిపనుల రంగాలలో

పనిచేస్తున్నవారికి ప్రోత్సహం కరువయింది. అంటే తెలుగు వాడే రంగాలు కుంచించుకుపోగా అ భాష ఎదుగుదలతో పాటుగా ఆ భాషద్వారా శిక్షణపొంది మేధావులుగా తయారు కావడానికి అవకాశం లేకుండా పోయింది.కానీ, దీనికి భిన్నంగా కోస్తా ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో తెలుగు పై అణిచివేత లేకపోవడమే కాకుండా తెలుగు సాహిత్యం కళా రంగాలలో పని చేసే, కవులకూ, కళాకారులకూ, సాహిత్యకారులకూ ఇంకా పరిశోధకులకూ ఎంతో ప్రోత్సాహం ఉండేది. అయితే కులీ కుతుబ్ షా కాలంలో ఈ అణిచివేత అంతగా లేకపోయినా, ఇది నిజాం కాలంలో మాత్రం దాదాపుగా రెండు నుంచి రెండు వందల యాభై సంవత్సరాలపాటు తెలుగుపై ఇదే నిర్లక్ష్య ధోరణి కొనసాగింది. అయితే మనం ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే ఏ భాష అయినా సరే, వాడుకలో నిరాదరణకు గురై విద్య, పాలన, సాహిత్యం రంగాలలో కుడా కొన్ని శతాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురి అయితే ఆ భాషలో విపరీతమైన మార్పులు రావడమే కాకుండా ఆ భాషా మనుగడకే ప్రమాదం కావచ్చు. కానీ తెలంగాణ జాతి మాత్రం ఎన్నో చారిత్రక, రాజకీయ, ప్రాంతీయ, సామాజిక అడ్డంకులు ఎదురయినా తెలుగు భాషను మాత్రం వదులుకోలేదు.

**తెలంగాణ భాష-వైవిధ్యం**

బహుశా అన్ని అంశాలలో కాకపోయినా కొన్ని అంశాలలో అయిన ప్రతి భాషా ఎంతో కొంత వైవిధ్యాన్ని కలిగి ఉంటుంది. అందువలన వైవిధ్యం లేని భాష బహుశా ఉండదు. అయతే కొన్ని చారిత్రక రాజకీయ, సామాజిక, మరియు ప్రాంతీయతల వలన భాషా వైవిధ్యంలో కొంచెం తేడా ఉండవచ్చు. ఒక భాషలో వేర్వేరు మార్పులు రావడానికి అనేక కారణాలు ఉండవచ్చు. అందులో చారిత్రక, రాజకీయ మరియు భౌగోళిక పరిస్థితులు కుడా ఒక ముఖ్య పాత్రను పోషిస్తాయి. అయితే ప్రాంతీయ భాషా వైవిధ్యం అనేది కేవలం తెలంగాణ ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదు. ఎందుకంటే అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో మాట్లాడే భాష తెలుగు అయినప్పటికీ అది వేరువేరు ప్రాంతాల మధ్య ఎంతో ప్రాంతీయ వైవిధ్యం కనిపిస్తుంది. అందుకే ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు ప్రాంతీయ వైవిధ్యం ఆధారంగా తెలుగును ఉత్తర, దక్షిణ, తూర్పు మరియు మధ్య అనే నాలుగు మండలాలుగా విభజించారు. ఈ నాలుగు మండలాలు ఒక్కో విధమైన భాషా వైవిధ్యాన్ని కలిగివున్నాయి. అయితే ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే తెలంగాణ తెలుగులో ఇతర భాషల ప్రభావం చాలా ఎక్కువగానే కనిపిస్తుంది. పైన పేర్కొన్నట్టుగా రాజకీయ మరియు చారిత్రక కారణాలే కాకుండా భౌగోళిక సరిహద్దులు కుడా తెలంగాణ తెలుగులో మార్పులు రావడానికి ఒక ముఖ్యమైన కారణం అని చెప్పవచ్చు. ముఖ్యంగా మనం, తెలంగాణ మరియు కోస్తాంధ్ర భౌగోళిక ప్రాంతీయ స్వరూపాన్ని గమనించితే, ఈ రెండు ప్రాంతాల మధ్య భౌగోళిక సరిహద్దులలో ఒక మౌలికమైన వ్యత్యాసాన్ని గమనించవచ్చు. ఎందుకంటే తెలంగాణ ప్రాంతం వివిధ భాషా ప్రాంతాలతో భౌగోళిక సరిహద్దులను పంచుకొంటోంది. అంటే, తెలంగాణ తెలుగు, మరాఠీ, కన్నడ, హిందీ భాషా ప్రాంతాలతో సంపర్కం కలిగివుండడం వలన ఆయా భాషల పదజాలం తెలంగాణ తెలుగులోకి వచ్చి చేరింది. అందుకే కోస్తా తెలుగుతో పోల్చితే తెలంగాణ తెలుగులో ఇతర భాషల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. కోస్తా ఆంధ్ర తెలుగులో ఇతర భాషల ప్రభావం అంతగా లేక పోవడానికి అక్కడి చారిత్రక, రాజకీయ, కారణాలు వేరుగా ఉన్నప్పటికీ భౌగోళిక స్వరూపం కుడా ఒక ముఖ్యమైన పాత్రను పోషించింది అని చెప్పవచ్చు. ఎందుకంటే ఎందుకంటే, కోస్తా ప్రాంతం దాదాపుగా 975 కి.మీ పైగా సముద్ర తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం చేత, తెలంగాణ ప్రాంత తెలుగుకి ఇతర భాషలతో 'భాషా సంపర్కం' ఉన్నట్టు' కోస్తా ప్రాంత తెలుగుకి అలాంటి 'భాషా సంపర్కం' ఉండదు (లేదు) (తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు ఉన్నా వాటి నేపథ్యం వేరు) కాబట్టి, తెలంగాణ తెలుగులో ఇతర భాషల ప్రభావం కనిపించినంతగా కోస్తా తెలుగులో కనిపించకపోవడానికి ఇదొక ముఖ్య కారణం కావచ్చు. అందుకని మనకు తెలంగాణ తెలుగులో ఇతర భాషల పదజాలం ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది, ఉదాహరణకు గడ్డా, గుల్లా, బరాబర్, జల్దీ, ఉషార్ వంటి ఎన్నో పదాలు మనకు తెలంగాణ తెలుగులో విరివిగా కనిపిస్తాయి. పైన పేర్కొన్నట్లుగా అనేక రాజకీయ, చారిత్రక కారణాల వలన ముఖ్యంగా నిజాం కాలంలో అన్ని అధికారిక విభాగాలలో తెలుగు కంటే ఉర్దూదే పెత్తనం ఉండడం వలన సహజంగానే తెలంగాణ తెలుగులో ఉర్దూ పదజాలం ఇతర భాషల కంటే ఎక్కువగా వచ్చి చేరింది. ఇలా ఇతర భాషల నుంచి పదజాలమే కాకుండా తెలంగాణ ప్రాంతానికి మాత్రమే పరిమితం అయిన తెలుగు పదజాలం కుడా ఎంతో ఉంది. ఇది ఇతర తెలుగు ప్రాంతాల తెలుగు పదాజాలం కంటే ఎంతో వేరుగా కుడా ఉంటుంది, ఉదాహరణకు గుండీf 'ఒక రకమైన వండుకునే పాత్ర', వర్రె = 'వాగు', పెయ్యి = 'శరీరం' మొదలైనవి. ఇలా అనేక కారణాల వలన తెలంగాణ తెలుగు కేవలం పదజాల రూపంలోనే కాకుండా ఉచ్చారణా మరియు పదనిర్మాణ రూపంలో కుడా వైవిధ్యతను కనబరుస్తుంది. పైన పేర్కొన్నట్లుగా భాషా వైవిధ్యం అనేది కేవలం తెలంగాణ తెలుగుకు మాత్రమే పరిమితం కాదు ఇది అన్ని ప్రాంతాల తెలుగులోనూ కనిపిస్తుంది, కానీ వేరు వేరు ప్రాంతాల మధ్య కొంచెం వ్యత్యాసం ఉండవచ్చు.

**తెలంగాణ తెలుగుతో సమస్య ఏమిటి?**

ముఖ్యంగా ప్రపంచీకరణ తరువాత ఐరాస ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కొన్ని వందల భాషలు ఇప్పటికే అంతరించిపోయాయి. ఇంకా ఎన్నో భాషలు అంతరించే ప్రమాదం అంచున ఉన్నాయి. వాటిలో భారతదేశంలో కుడా అలాంటి ఆపన్న భాషలు ఎన్నో ఉన్నాయి. వీటిలో చాలావరకూ అల్పసంఖ్యాక వర్గ భాషలే ఎక్కువ. కానీ మనం ఇక్కడ ప్రత్యేకించి భాష మరియు వాటికి పొంచి ఉన్న ప్రమాదం గురించి ఇక్కడ చర్చించడం లేదు, ఎందుకంటే అది మన ప్రస్తుత విషయం కాదు. అయితే ఇప్పటివరకూ తెలుగు అలాంటి ప్రమాదానికి దగ్గరలో లేదు. ఒక భాష అంతరించిపోవడానికి అది అల్పసంఖ్యాక వర్గ భాషే అవ్వాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కొన్ని చారిత్రక, రాజకీయ కారణాల చేత అది సంస్థాగతమైన ఒక సుదీర్ఘమైన నిర్లక్ష్యానికి గురి అయితే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి భాషా ప్రమాదానికి లోనవుతుంది. మన తెలుగు ఇప్పటికి ఇప్పుడే ప్రమాదంలో పడకపోయినా మనం తెలుగు గురించి మేల్కోకపోతే మన తెలుగు కూడా ఇలాంటి ప్రమాదానికి లోనుకాబోదని నమ్మలేము. అయితే ఒక భాష అంతరించి పోవడానికి అనేక కారణాలు ఉన్నట్టుగా, ఒక భాషలో విపరీతమైన అనేక మార్పులు రావడానికి కుడా అనేక కారాణాలు ఉంటాయి. అదేవిధంగా ఒక భాష అభివృద్ధి పథంలో నడవడానికి కుడా ఎన్నో కారాణాలు ఉంటాయి. ఎందుకంటే ఒక భాష తన మనుగడను సాగించాలి అనుకుంటే కేవలం మాట్లాడేవాళ్ళు

## 1997లో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి ముందు చూపుతో చెప్పిన మాట:

# ‘మాతృభాషా రక్షణ ఒక ఉద్యమరూపం పొందే అవకాశం ఉంది’


ఇదివరకు అంటే స్వాతంత్ర్యానంతరం ఉన్నట్లు హైస్కూలు స్థాయిదాకా తెలుగునే ఉంచి పియుసి నుంచి అందరూ ఇంగ్లీషులోనే చదవాలని పెడితే బాగుండేది. ఇప్పుడున్న నలభై యాభై వయస్సు వాళ్ళలాగా రెండు భాషల్లో ప్రవేశం ఉండేది. అంటే పాత పద్ధతిని పునరుద్ధరించటం ఒక మార్గం; లేదా 2. పట్టభద్ర స్థాయితో ఆపకుండా యూనివర్సిటీ స్థాయిదాకా భాషాధ్యయనాన్ని విస్తరింపచేయటం, ఇంగ్లీషును ఒక సబ్జక్టుగా శాస్త్రీయ పద్ధతుల్లో పాఠ్యాంశం చెయ్యడం. లైబ్రరీ భాషగా ఇంగ్లీషును మార్చివేయాలని కొఠారి కమీషన్ చెప్పింది. 3.మాతృభాషామాధ్యమంలో చదివిన వాళ్ళకు ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగావకాశాలు పెంచటం, ప్రభుత్వం చొరవ తీసుకొంటే బ్యాంకులు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు కూడా ఫలితాల దృష్టితో(మానవతా దృష్టితో కాదు) ఈ రకమైన పాలసీని అమలుచేసేవి. 4. ఉత్పత్తి సాధనాలు ప్రజల భాషలో ఉన్నప్పుడే ఉత్పత్తి పెరుగుతుందని అభివృద్ధి పొందిన దేశాల చరిత్రను చూస్తే తెలుస్తుందని నచ్చచెప్పాలి. ఉద్యోగావకాశాలు ఏ భాషలో చదివితే ఎక్కువగా ఉంటాయో విద్యా విధానంలో ఆ భాషకు విలువ వస్తుంది. స్వల్ప ప్రయత్నంతోనే మాతృభాషాప్రధానంగా ఉత్తమగుణమున్న విద్యాలయాలు వస్తాయి. ఈ మార్పు ప్రభుత్వ ప్రణాళికలను బట్టి ఉంటుంది. 5. హైస్కూలు దాకా అందరూ తెలుగును మూడేళ్ళపాటైనా చదవాలని శాసించటం. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ రకంగా చేసిన శాసనాన్ని 1994 మే నెలలో మహారాష్ట్ర హైకోర్టు ఆమోదించింది. దీనివల్ల మైనారిటీలకు మేలేగాని కీడు జరగదని తీర్పుచెప్పింది. భాషా విషయంలో చట్టాలు, జీవోలు, రూల్సు ఆలోచించి సంస్కరణలు ప్రజాశ్రేయస్సు దృష్టితో చేస్తున్నట్టు నిరూపిస్తే కోర్టులు ఏమీ చెయ్యలేవని జస్టిస్ కృష్ణ అయ్యర్ ఒక సందర్భంలో నాతో అన్నారు. ఇంగ్లీషు మీడియంవల్ల దేశాంతర ఉద్యోగాలు వస్తాయనుకొనే వాళ్ళు ఇంగ్లీషులో జ్ఞానాన్ని వృద్ధిచేసుకోవచ్చు. మరి మన రాష్ట్రంలో పట్టభద్రులైన వాళ్ళలో నూటికి తొంభై తొమ్మిది మందికి ఇక్కడే ఉద్యోగాలు వస్తాయి! ఏ ప్రభుత్వమైనా రూపొందించే విద్యావిధానం వాళ్ళకోసమా? పరాయి దేశం వెళ్ళే వాళ్ళకోసమా? ఆలోచించండి. అటు తెలుగూ ఇటు ఇంగ్లీషూ రెండూ రాక అన్యాయమవుతున్న పిల్లల భవిష్యత్తు దృష్టితో ప్రభుత్వం తక్షణ కర్తవ్యం ఆలోచించకపోతే సామాన్య ప్రజల్లో మాతృభాషా రక్షణ ఒక ఉద్యమరూపం పొందే అవకాశం ఉంది.

***(భాషా శాస్త్రవేత్త, హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి 1-11-97న ‘వార్త’ దినపత్రికలో వ్రాసిన ‘మాతృభాషను ఉద్ధరించదానికి ఉద్యమమే గతి!’ అనే వ్యాసంలో ముగింపు భాగం)***

ఉంటే సరిపోదు. ఆ భాష అన్ని రంగాలలో అమలు జరగడంతో పాటుగా, ఆ భాషలో సామాజిక స్పృహ కలిగిన సాహిత్యం రావాలి. వివిధ రంగాలకు చెందిన నిఘంటువులు రావాలి. సామాజిక పరమైన వ్యాకరణ అధ్యయనం జరగాలి. ఇవన్నీ జరగాలి అంటే భాష అభివృద్ధిని ప్రోత్సహించే ఏలుబడి సాగాలి. ప్రజల భాష అభివృద్ధికి దోహదపడే ఒక ఉన్నత సాధికారిక సంస్థ ఉండాలి. అప్పుడే ఏదైనా భాష తన ఉనికిని కాపాడుకోగలుగుతుంది. స్వాతంత్ర్యానికి ముందు తీసుకుంటే, తెలంగాణ తెలుగుకూ, ఆంధ్ర తెలుగుకూ ఒక ముఖ్యమైన తేడాను మనం గమనించవచ్చు, అదేమిటంటే నిజాం కాలంలో తెలుగుపై అణిచివేత జరగడమే కాకుండా నిజాం కాలంలో తెలుగు భాష అభివృద్ధికి ఎలాంటి ప్రోత్సాహం ఉండేది కాదు. కానీ ఆంధ్ర ప్రాంతంలో తెలుగుకి మంచి ప్రోత్సహం లభించింది. అందుకే చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ లాంటివాళ్ళు తెలంగాణ ప్రాంతంలో కనిపించరు. ఇలా అనేక చారిత్రక, రాజకీయ, ప్రాంతీయ కారణాల చేత తెలంగాణ ప్రాంత తెలుగు అన్ని విధాలా అణచివేయబడింది. ఇంకొక్క బాధాకరమైన విషయం ఏమిటంటే, స్వాతంత్ర్యానంతరం తెలంగాణ ప్రాంతాన్ని భాషా ప్రతిపాదిక ఆధారంగా ఆంధ్ర ప్రాంతంతో విలీనం జరగటం, రెండు ప్రాంతాలలో మాట్లాడే భాష తెలుగే అయినప్పటికీ, నిజాం కాలంలో జరిగినంత అణిచివేత కాకపోయినా, తెలంగాణ తెలుగుపై అదే ధోరణి, అదే నిర్లక్ష్యం అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో జరుగుతూ ఉండేది. అందుకే నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాలతో పాటు తెలంగాణ గోస తెలంగాణ యాస అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ తెలుగు కూడా అంతే ముఖ్యమైన పాత్రను పోషించింది.

**తెలంగాణ తెలుగుపై వైఖరి మారుతోందా?**

పైన పేర్కొన్నట్లుగా అనేక చారిత్రక, రాజకీయ, సామాజిక, మరియు భౌగోళిక కారణాల చేత వివిధ ప్రాంతాల మధ్య ఒకే భాషలో ‘భాషా వైవిధ్యం’ ఉండడం చాలా సర్వసాధారణం. అయితే ఒకే భాషకు చెందిన ఒక ప్రాంతపు పలుకుబడిని ఇతర ప్రాంతాలలో మాట్లాడే పలుకుబడులతో పోల్చి కొంత వైవిధ్యాన్ని కలిగి ఉన్నంత మాత్రాన అది కేవలం మాండలికమే కానీ భాష కాదు అని చెప్పడం ఆ ప్రాంత ప్రజలకూ వారి పలుకుబడుల గుర్తింపును నిరాకరించడమే. సైద్ధాంతికంగా చెప్పాలంటే, భాషలలోని ప్రతి ప్రాంతీయ పలుకుబడీ ఒక మాండలికమే. అయితే వివిధ ప్రాంతీయ మాండలికాలలో ఏదో ఒక పలుకుబడి (వెరైటీ) అంటే ఏదో ఒక ప్రాంతీయ భాష ఆర్థిక రాజకీయ కారణాలచేత ఎక్కువమందికి సుపరిచితం కావడం, దానినే ప్రామాణిక భాష లేదా సాధారణ భాష (కామన్ లాంగ్వేజ్) గా పిలవటం ఆనవాయతీ. **తెలంగాణ తెలుగు ఇతర ప్రాంతాల ప్రాంతీయ పలుకుబడులతో పోల్చితే కొంత వైవిధ్యతను కలిగి ఉంటుంది అనేది వాస్తవమే. అందుకని తెలంగాణ తెలుగు ఒక భాష కాదు మాండలికం మాత్రమే అని అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ తెలుగును అన్ని విభాగాలలో నిర్లక్ష్యం చేసి నిరాదరణకు గురిచేయడం తెలంగాణ ప్రజలకు తమ ఉనికినే కోల్పోతున్నట్లు అనిపించింది. నిజాం**




**పరిపాలనలో ఉర్దూ వలన తెలంగాణ తెలుగు నిర్లక్ష్యానికి గురి అయితే, ఆతరువాత అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ తెలుగు ఒక భాష కాదు అది ఒక మాండలికమే అనే వైఖరితో నిర్లక్ష్యానికి గురి అయ్యింది. అయితే చాలా సందర్భాలలో ఒక భాష మాండలికమా లేదా ఒక భాషనా అని నిర్ణయించేది భాషాశాస్త్రం లేదా భాషాశాస్త్రవేత్తల కంటే రాజకీయ, సాంస్కృతిక, సామాజిక అంశాల పైనే ఎక్కువ ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే రాజకీయ, ప్రాంతీయ విభేదాల వల్లనో ప్రాంతీయ విభజనల వల్లనో ఒక భాష మాండలికంగానూ, ఒక మాండలికం ఒక భాషగా మారిన ఉదాహరణలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి,** ఉదాహరణకు ఒకప్పుడు మైథిలి భాషగా కాకుండా ఒక మాండలికంగానే గుర్తించబడింది. కాని ఇప్పుడు (2003) ఎనిమిదవ షెడ్యూలులో భాషగా గుర్తించబడింది.

భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో తెలంగాణ తెలుగును మైథిలి భాష తీరుగా అధికారిక భాషగా గుర్తించకపోవచ్చు **కానీ తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత అన్ని రంగాలలో తెలంగాణ తెలుగుపై మారుతున్న వైఖరిని చాలా స్పష్టంగా గమనించవచ్చు. అన్ని రంగాలలో కంటే ముఖ్యంగా చెప్పుకోదగ్గది సినిమా రంగం.** ఎందుకంటే, ఒకప్పుడు ప్రభుత్వ రంగంలో గానీ, విద్యా రంగంలో గానీ, సాహిత్య రంగంలో గానీ ఇంకా ప్రసార మాధ్యమాలలో తెలంగాణ తెలుగు వేరుగా ఉంటుందని తెలంగాణ తెలుగును పక్కన పెట్టారు. కానీ సినిమా రంగంలో మాత్రం ప్రతినాయకుడి పాత్రలకూ, వ్యంగ్య పాత్రలకూ, ఇంకా హాస్య పాత్రలకూ తెలంగాణ తెలుగును బహిరంగానే చిత్రీకరించారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు కనిపించవు, ఎందుకంటే కేవలం పైన చెప్పిన పాత్రలకే కాకుండా సందర్భానుసారంగా అన్ని పాత్రలకూ అన్ని సందర్భాలలోనూ కూడా తెలంగాణ తెలుగును వాడుతున్నారు. అయితే **ఇప్పుడు తెలంగాణ తెలుగును వాడుతున్నారా లేదా అనే దానికంటే, తెలంగాణ తెలుగుకూ, తెలంగాణ యాసకూ గౌరవం దక్కుతోంది అనేది మాత్రం ముమ్మాటికి వాస్తవం. అదేవిధంగా పత్రికా రంగంలో కూడా ఈ మార్పును మనం గమనించవచ్చు.** ఉదాహరణకు, నమస్తే తెలంగాణ లాంటి పత్రికలు తెలంగాణ తెలుగును వాడడంతో పాటుగా తెలంగాణ తెలుగును వ్యాప్తికి తమవంతు ప్రయత్నిస్తున్నాయి. అయితే, పత్రికా రంగంలో కంటే ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో తెలంగాణ తెలుగు, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతం అనే తేడా లేకుండా మంచి ప్రజాదరణ పొందుతోంది అని చెప్పవచ్చు. ఉదారహణకు, V6 టీవీలో వచ్చే తీన్మార్ వార్తలు, Tన్యూజ్‌లో వచ్చే ధూంధాం ముచ్చట్లు, టివి9లో వచ్చే ఇస్మార్ట్ న్యూస్: HMTVలో వచ్చే జోర్దార్ వార్తలూ,'ఎబిఎన్' లో వచ్చే కిరాక్ న్యూస్ సహా బిత్తిరి సత్తి కార్యక్రమాలు చాలా ప్రాచుర్యం పొందాయి. వీటితో పాటు తెలంగాణ తెలుగులో వచ్చిన తెలుగు సాహిత్యం గురించి కూడా చర్చించుకోవాలి. ఎందుకంటే తెలంగాణ ఉద్యమ సమయంలో వచ్చిన తెలంగాణ సాహిత్యం తెలంగాణ ఉద్యమంలో ఎంత ముఖ్యమైన పాత్రను పోషించిందో మనకు తెలిసిందే. ఎందుకంటే మనం పైన పేర్కొన్నట్లుగా తెలంగాణ ఉద్యమంలో నీళ్ళు,

**తరువాయి 32వ పుటలో....**

ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

# ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం- పరిశీలన



"**తాము** భ్రమపడి ఇతరులను భ్రమపెట్టిన పండితుల, పాండిత్య మెట్టిదో రామమూర్తి పంతులుగారు బాలకవిశరణ్యములోనూ, భాషా భేషజములోనూ, వెల్లడించారు. వారందుకై చేసిన అపారకృషికి గ్రంథములు ఒక నిదర్శనము" - చింతాదీక్షితులు

**వే**దం వేంకటరాయ శాస్త్రి గారి గ్రంథాల్లో వుండే దోషాల్ని చెప్పడం కోసం "ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం" అనే గ్రంథాన్ని గిడుగు రాశారు. "భిషక్కు" అంటే వైద్యుడు అని అర్థం. "భేషజం" అంటే వైద్యుని ప్రవృత్తి అని అర్థం. అంతే కాక "భేషజం" అనే పదానికి డాంభికం, అతిశయం, అనే అర్థాలు కూడా వున్నాయి. తెలుగు భాషా పండితుల్ని వైద్యులుతో పోల్చి రామమూర్తి గారు "ఆంధ్ర పండిత భిషక్కులు" అని వ్యవహరించారు. భాషా తత్వాన్ని తెలుసుకోకుండానే, అ పిడివాద పండితులు తమకే అంతా తెలుసునని అహంకారంతో ప్రవర్తిస్తారు. తమ సాటివారైనా, ఇతరులయినా, ఎవరికీ ఏమీ రాదని, అంతా మాకే వచ్చుననే భ్రమలో వుండి, అలాగే ప్రవర్తించడాన్ని రామమూర్తి గారు 'భాషా భేషజం' అని అన్నారు.

కొక్కొండ వేంకటరత్నం, వేదం వేంకటరాయశాస్త్రి. మానవల్లి రామకృష్ణ కవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, వడ్డాది సుబ్బారాయడు లాంటి వారిని రామమూర్తి గారు ఆంధ్రపండిత భిషక్కుల వర్గంలో చేర్చారు. ముఖ్యంగా వేదం వారిని దృష్టిలో పెట్టుకొని విమర్శించిన గొప్ప గ్రంథం ఇది. ఇందులో వున్న "మిధ్యాపవాదం" కూడా వేదంవారిని ఉద్దేశించి రాసినదే. అందుకే ఈ గ్రంథానికి "ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజం" అని పేరుపెట్టారు. ఈ గ్రంథానికి ఈ పేరు పెట్టడానికి కారణం కూడా వేదం వారే కారణం.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి అష్టమవార్షిక సభలో వేదంవారు అధ్యక్షోపన్యాసంలో పండితుల్ని ఉద్దేశించి ఇలా అన్నారు. "భాషా దేవికి ఆధునిక వాఙ్మయము వలన కలిగిన ఈ వాపును ఇంకను, జీవధాతువుండగానే పండిత భిషక్కులు కలిసి యాలోచించి తగిన మందుచే తొలగించి, ఆరోగ్య మొసంగుదురు గాక" అని వేదం వారు తెలియజేశారు. వేదం వారి హితోపదేశమే గిడుగుకు ఆనాటి ఆంధ్ర భాషా భేషజం బట్టబయలు చేయటానికి పనికివచ్చిందని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

వేదం వేంకటరాయశాస్త్రి, కొక్కొండ వేంకటరత్నం గార్లు ఇద్దరూ పండితులే. ఇద్దరూ కరుడుకట్టిన గ్రాంథిక భాషా వాదులే. వేంకటరత్నం గారు సంస్కృత "ప్రసన్న రాఘవము" ఆధారంగా 1898లో తెలుగులో "ఆంధ్ర ప్రసన్న రాఘవము" అనే గ్రంథాన్ని గ్రాంథిక భాషలో రాశారు. ఈ గ్రంథాన్ని "ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శనము" అనే పేరుతో వేదం వారు విమర్శించారు. వేంకటరత్నం గారికి గ్రాంథిక భాష రాదని ఎద్దేవా చేశారు. ఇద్దరూ గ్రాంథిక వాదులు అయినప్పటికీ, ప్రాచీనాంధ్ర భాషావిషయంలో వీరిద్దరికీ ఏకాభిప్రాయం లేదని మనకు తెలుస్తుంది. ఇలాంటి పెద్ద పెద్ద పండితులకే గ్రాంథిక భాష రానప్పుడు, విద్యార్థులకు గ్రాంథికభాష ఎలా వస్తుందని గిడుగు ప్రశ్నించారు. గిడుగు వాదనకు ఇద్దరూ ఏమిచేయాలో తెలియనిపరిస్థితికి వచ్చారు. ఇద్దరూ గిడుగు ప్రతిభను చూసి బిత్తరపోయారు. ఇద్దరికీ నోటి మాట రాలేదు.

శాస్త్రి గారు రాసిన గ్రంథాన్ని దృష్టిలో వుంచుకొని గిడుగువారు విమర్శించారు. వేదం వారి గ్రంథంలో 121 అంశాల్ని నిశితంగా పరిశోధించి, వారి గ్రంథమంతా తప్పులు, తడకలతో కూడుకొని వున్నదని నిర్ధారించారు. అంతేకాక వారి పాండిత్యమంతా డొల్ల అని తేల్చి చెప్పారు. గిడుగు ఇందులో వేదం వారికి గ్రాంథిక భాష రాదని ఉదాహరణ పూర్వకంగా విమర్శించారు. మహాపండితులైన గ్రాంథిక వాదుల గ్రంథాల్లో గ్రాంథికానికి విరుద్ధమైన అనేక ప్రయోగాలు వున్నాయని ఉదాహరణ పూర్వకంగా గిడుగు నిరూపించారు. ముఖ్యంగా గిడుగు, వేదం వారి విమర్శలోని అనౌచిత్యాన్ని మాత్సర్యాన్ని లోకానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఆ రచనకు పూనుకున్నారు. వేదం వారిని చీల్చి చెండాడారు. వేదం వారు మారు మాటలాడలేకపోయారు. గమ్మున ఊరుకుండిపోయారు. గిడుగు ప్రతిభ అలాంటిది.

గిడుగు విమర్శలో ఆయన ప్రతిభతేటతెల్లమవుతుంది. వేదం వారి విమర్శను గూర్చి, గిడుగు ఇలా తెలియజేశారు.

"తమవలెనే కాలేజీ పండితులుగా ఉండి, తమవలెనే అనేక గ్రంథములు రచించి, తమవలెనే కవులని, విద్వాంసులని విఖ్యాతి పొందినవారి భాషలో అనేక దోషములు చూపిస్తూ, వారి గ్రంథములు ఈ శాస్త్రులవారు విమర్శించి ఉన్నారు. అవి మేము చదువుకున్నాము. ఇతరుల గ్రంథాలు దుష్ట ప్రబంధములని స్థాపించడమునకు వాటిలో ఏమిదోషములుగా నిరూపించి ఈ శాస్త్రుల వారు నిరాకరించినారో,

ఆ దోషములు ఈ శాస్త్రుల వారి గ్రంథములలో ఉన్నప్పుడు అవి వెదకి చూపించడము కష్టమయిన పనికాదు. ఆ దోషములను బట్టి శాస్త్రులవారి గ్రంథాలు కూడా దుష్టప్రబంధములని సిద్ధాంతము చేయడము సాహసమెందు కవుతుంది. అప్పుడు జంకుకళంకులేని కవి చంద్రులమని విద్వద్వతంసులమని చెప్పుకొన్న శాస్త్రులవారు కూడా ఇతరులతో కలిసి, ఏకరాశిలో చేరుతారు. వారి గ్రాంథికాంధ్ర భాషా పాండిత్యము కేవలము మిథ్య అనిన్నీ, పామరులను మోసపుచ్చుటకు పన్నిన కైతవము అనిన్నీ, తెలుసుకొని వివేకముకలవారు దానికోసము దేవులాడరు. మృగతృష్ణలోని నీటికోసము వృథాశ్రమపడక సర్వజన సామాన్య మయిన జలాశయము చేరి దప్పి తీర్చుకొని సుఖిస్తారు" అని అన్నారు.

రామమూర్తిగారు కొక్కొండ వేంకటరత్నం గారి గూర్చి ఇలా అన్నారు.

"సంస్కృత ప్రసన్న రాఘవము" తెలుగులోనికి తర్జుమా చేసిన వారు కీ.శే. అయిన కొక్కొండ వేంకటరత్నము పంతులవారు నలభై యేండ్లు కాలేజీ తెలుగు పండితులుగా నున్నవారు అనేక గ్రంథములు రచించినవారు. తమవంటి పండితులు ఇంకొకరు లేరనిపించు కొన్నవారు. సలక్షణమైన తెలుగు భాష సులువుగా వ్రాయడమేగాక నిరాఘాటముగా మాట్లాడడము నేర్చినారట. నా వ్యవహారములో ఇంటి వద్దనుకూడా సలక్షణమైన తెలుగే ఆయనకు అలవాటట. సలక్షణమైన తెలుగు భాషకు ఆయన గ్రంథములే కాక, ఆయన నోటిమాటలే ఆదర్శమట. లౌకికి భాష గ్రామ్యమని (సంపంగి పువ్వును తుమ్మెద నిందించినట్టు) పంతులు గారు పరిత్యజించినారట. నాటకములలోనయినా, అత్యధమ, పాత్రల వాక్యములందైనా గ్రామ్యభాష వాడకూడదన్నారట. వేంకటరాయశాస్త్రులవారు నాటకములో అట్టి వాక్యములలో గ్రామ్యం ప్రయోగించడము దోషముగా పంతుల వారి బుద్ధికి తోచినది. ఆ కాలములో గ్రామ్యద్వేషులందరూ శాస్త్రులవారి మీదికి దండెత్తి వచ్చినప్పుడు వారికి పంతులవారు కన్నాకుగానుండి శాస్త్రులవారితోను, వారి పక్షము వారితోను ఘోర యుద్ధము జరిపినారు. ఆరు సంవత్సరముల క్రిందట (అంటే 1913) సాహిత్య పరిషత్తువారు రాజమహేంద్రవరములో సమావిష్ణులయి సభచేసినప్పుడు ఈ పంతులుగారు అధ్యక్షులుగా నుండి మా బోంట్ల నందరినీ గ్రామ్యవాదులని నిందించి, బడులలోనూ, సభలలోను పండితులు కూడా గ్రామ్యభాష మాట్లాడటము మిక్కిలి నింద్యమని నొక్కి చెప్పి తమవలె సదా సలక్షణముగా అందరూ మాట్లాడవలెనని ఉపదేశించినారు" అని అన్నారు.

వేదం వారు, కొక్కొండవారు ఇద్దరూ అతివాద గ్రాంథిక వాదులే. వేంకటరత్నం గారు "ఆంధ్రప్రసన్న రాఘవం"లో "లేదయ్యెడున్" అనే ప్రయోగాలు వాడారు. వేదంవారు అప్రయోగాల్ని అసాధువులని విమర్శించారు. దీనిపై గిడుగు చాలా నిశితంగా విమర్శించారు.

నన్నయ మొదలైన కవులు "లేదయ్యెడున్" అనే పదాలు వాడారని గిడుగు తెలియజేశారు. కాబట్టి పెద్దలు వాడిన పదాలు వేంకటరత్నంగారు కూడా వాడడంలో తప్పులేదు. మహాకవులు ఈ లాంటి ప్రయోగాలు వాడారు అనే విషయం వేదం వారికి తెలియదు. వేదం వారు అజ్ఞానంతో వేంకటరత్నం గారి గ్రంథాన్ని విమర్శించారు. దీనివల్ల వేదం వారు నన్నయాది కవుల్ని కూడా అవమానించారని గిడుగు వెల్లడించారు. చివరకు వేదం వారికి గ్రాంథికభాష కూడా రాదని తెలిసిందని గిడుగు విమర్శించారు.

వేంకటరత్నం గారు "పంపలేదయ్యెడు, ఎక్కడబడదయ్యెడు" అనే ప్రయోగాలు తన గ్రంథంలో వాడారు. వేదంవారు చిన్నయసూరి బాలవ్యాకరణం'' ప్రకారం, ఆ ప్రయోగాలు అపప్రయోగాలని విమర్శించారు. అయితే 1913లో వేదంవారు శ్రీనాథుడు రాసిన శృంగారనైషథానికి "సర్వంకష" వ్యాఖ్యానం రాశారు. అందులో ఈ ప్రయోగాల్ని సమర్థించారు. ఒకే ప్రయోగాన్ని ఒక దగ్గర విమర్శించడం, మరోదగ్గర సమర్థించడం ఎంతవరకు సబబు, ఈ విషయంపై గిడుగు తన నిరసనను ఇలా తెలియజేశారు.

"లేదయ్యెడున్" అని శ్రీనాథుడు ప్రయోగించిన శబ్దము తాటాకు పుస్తకాలలోను, అచ్చుపడ్డ పుస్తకాలలోను తమకంటికి కనబడుతూ ఉండగా, 'లేదయ్యెఁజూ' "లేదయ్యెబో" అని మార్చితే సరిపడును అని దిద్దడానికి సాహసిస్తారు శాస్త్రులవారు. ఈ రూపములు నన్నయ, తిక్కన మొదలైన పూర్వకవులు వాడినవే అని ఎరుగరు. తమకిష్టము గాని శబ్దము ప్రాచీన గ్రంథములలో కనబడితే దిద్ది మరి కనబడకుండా తీసివేసి పరిష్కరించి, అచ్చువేయించే పండితులలో ఈ శాస్త్రులవారు అగ్రగణ్యులు. వీరు పరిష్కరించిన పద్యాలు రచించిన కవులు ఇప్పుడు చూడటము సంభవమైతే, తాము రచించినవి పోల్చుకోలేనట్టు అవి మారిపోయినవి" అని గిడుగు అన్నారు.

గిడుగు ఎంత ప్రతిభావంతుడో, అంత పరిశోధకుడు. ఈ ప్రయోగం సాధువుఅని చెప్పడానికి ఒక్క "భారతం"నుంచే 19 ప్రయోగాలు ఉదాహరణగా చూపారు. వేదంవారు అజ్ఞానంగా వేంకటరత్నం గారిని వేళాకోళం చేసి, విమర్శించారని గిడుగు తీవ్రంగా ఖండించారు. అంతేకాదు. గిడుగు చాలా తీవ్రపదజాలంతో కఠినంగా మందలిస్తూ, హెచ్చరిస్తూ విమర్శించారుకూడా. గిడుగువారు గొప్పపండితుడే కాదు అంతకన్నా ఉత్తమ పరిశోధకుడు. విఖ్యాత భాషాశాస్త్రవేత్త, ప్రఖ్యాత విమర్శకుడు కూడా. శాస్త్రీయ దృక్పథం కలవారు. అందుకే మహామహా పండితుల్ని తన ప్రతిభా ప్రజ్ఞా పాటవాలచే సునాయసంగా ఓడించారు. విజయం సాధించారు. శభాష్ అన్పించుకున్నారు.

"ఇకనైనా ఎకసక్కెములాడక వివేకముకలిగి తెలుసుకొందురు గాక, ''లేదయ్యెడున్'' అనేది పరాచకముకాదు. వాగనుశాసనుని ప్రయోగమంత్రము. కవి బ్రహ్మ ప్రయోగమంత్రము. ప్రబంధపరమేశ్వరుని ప్రయోగమంత్రము. మంత్రార్థము తెలుసుకొని యథావిధి పునర్చరణ చేస్తే, శాస్త్రుల వారిని పట్టుకొని పీడించి, మతిపోగొట్టి, అసంబద్ధ ప్రలాపంబు లాడించిన వైయ్యాకరణ పిశాచము వదలి పారిపోతుంది. తర్వాత పశ్చాత్తపము నొంది, ఆత్మ దోషమును దోషించి ప్రాయశ్చిత్తము చేసుకొంటే ''మిధ్యావవాదం'' పరిహారమవుతుంది". అని గిడుగు వేదం వారిని దృష్టిలో పెట్టుకొని అన్నారు.

కన్నులు, చన్నులు, చెంపలు, బొడ్డు, కాళ్ళుమొదలైన పదప్రయోగాలు గ్రామ్యాలని అప్పకవి అన్నాడు. ఇలాంటి ప్రయోగాల్ని వేంకటరత్నం గారు వాడారు. ఆ కారణంగా వేదం గారు ఆప్రయోగాల్ని అధిక్షేపించారు. అయితే గిడుగు వీటన్నింటికీ భారతం, భాగవతం, నైషథం, పాండురంగ మాహాత్మ్యం, విజయవిలాసం, మొదలైన ప్రముఖ

గ్రంథాల నుంచి ప్రయోగాల్ని చూపించారు. దీనిబట్టి అప్పకవి భారతాన్ని బాగా చదువుకోలేదని అన్పిస్తుందని గిడుగు తీవ్రంగా విమర్శించారు. గిడుగు ఎంతటి వారినైనా, విమర్శలో విడిచిపెట్టేదిలేదు.

అది, ఇది, వాడు, వీడు, అనే పదాలు ప్రయోగించడం దోషమని వేంకటరత్నంగారిని విమర్శించారు వేదం వారు. ఈ లాంటి ప్రయోగాలు ప్రాచీన కావ్యాల్లో వున్నాయని ఉదాహరణ పూర్వకంగా గిడుగు రాశారు. శ్రీనాథుడు రాసిన నైషథానికి వేదం వారు "సర్వంకష" అనే పేరుతో వ్యాఖ్యానం రాశారు. ఇందులో వేదం వారు భ్రమ ప్రమాదాలన్నీ పూసగుచ్చినట్లు ఎత్తిచూపారు గిడుగు వారు. కళ్ళు తెరిపించారు వేదం వారికి.

ద్రుతానికి అచ్చుతో సంశ్లేషం రాదని, అది తప్పు అనీ మీదు మిక్కిలి మహాపాతకమని వేదం వారు వేంకటరత్నం గారిని విమర్శించారు. ఈ విషయంపై గిడుగు చాలా విశ్లేషించారు. తమ వాదానికి బలంగా భారతం, హరివంశం, మొదలైన ప్రముఖ ప్రాచీన గ్రంథాల నుంచి ఇరవై ప్రయోగాలు ఉదాహరణ పూర్వకంగా చూపించారు. ఈ దెబ్బకు వేదంవారి నోటమాట రాలేదు.

సభకులు అని సభ్యార్థంలో ప్రయోగించటం తప్పుని శాస్త్రిగారు, వేంకటరత్నం గారిని విమర్శించారు. గిడుగు తెలుగు కావ్యాల నుంచి ఆప్రయోగానికి సభ్యార్థాన్ని నిరూపించారు.

"కథా సరిత్సాగరం" మొదటి ముద్రణలోని అనేక ప్రయోగాల్ని తెలుగు పదాల సాధుత్వం తెలియక వేదం వారు తప్పులు అనుకొని దిద్దారని గిడుగు విమర్శించారు. అవి వందల కొద్దీ వున్నాయి. ఒప్పులను తప్పులనీ, తప్పులని ఒప్పులనీ వేదం వారు తడపాటు పడ్డారని గిడుగు ఉదాహరణ పూర్వకంగా నిరూపించారు.

"వల్ల" అనే ప్రయోగం తప్పుఅని వేదం వారు అన్నారు. శిష్టుల వాడడంచేత "వల్ల" "వలె", అనే శబ్దాలు సాధువులు అనక తప్పదని గిడుగు అన్నారు. ఉదాహరణంగా ఆముక్త మాల్యద, మనుచరిత్ర, రామరాజేయం, రంగనాథ రామాయణం, భాగవతం మొదలైన గ్రంథాలనుంచి ఇరవై ఆరు ప్రయోగాల్ని గిడుగు చెప్పారు.

"గంథము" అనే పదాన్ని "గందము" అని ప్రయుక్తం చేశారని వేదం వారు, వేంకటరత్నం గారిని విమర్శించారు. గిడుగు దాన్ని సమర్థించారు. క్వార్థకేకార సంధి, ముందుకు, ఎందుకు, కర్మార్థక ప్రయోగము, ఇత్వసంధి మొదలైన అంశాల్లో వేదం వారి విమర్శ, సహేతుకంకాదని అనేక ప్రాచీన కావ్య ప్రయోగాలు ఉదాహరణ ఇచ్చి తీవ్రంగా విమర్శించారు గిడుగు.

వేదంవారి గూర్చి గిడుగు ఇలా అన్నారు. "శాస్త్రులు వారికి తత్త్వజిజ్ఞాసలేదు. వి. సందాదప్రియులు. ప్రతివాదులు కాదన్నది అవుననీ, అవునన్నది కాదనిన్ని సిద్ధాంతము చేయడమే వారికి కావలసినది. జంకుకళంకులేని వారమని వారే గదా చెప్పుకొన్నారు. వారు గొప్ప పండితులని వారి శిష్యబృందమునకు పరమవిశ్వాసమున్నది. వారేమన్నా బళాబళి అనే వారున్నారని వారికి బాగా తెలుసును. మరిజంకేల, కళంకుంటేనేమి? కవిచంద్రుల గదా శాస్త్రులవారు, వారి యందు కళంకు వారి శోభను వృద్ధి చేస్తుందనే వారికిన్ని వారి శిష్యులకున్న సమ్మతము. ఏమదృష్టము" అని గిడుగు తెలియజేశారు.

వేదంవారు "ఆంధ్రప్రసన్న రాఘవం"లోని ఎన్నో పదాలు లక్షణానికి లొంగని కారణంగా అసాధువులని చెప్పారు. అయితే ఆ ప్రయోగాలన్నీ పూర్వకవులు తమ గ్రంథాల్లో ప్రయోగించారు. లాక్షణికులు ఏకారణంగానో ఆ పదాల్ని అనుశాసనం చేయలేకపోయారు. అనుశాసనంలేని ప్రతీపదాన్ని గ్రాంథిక వాదులు ఆసాధువులుగా ప్రచారం చేశారు. ఇదే గ్రాంథిక వాదుల్లోని ప్రధానలోపమని గిడుగు చెప్పారు. గ్రాంథిక వాదులు ప్రాచీనాంధ్ర భాషారూపాల్ని ప్రామాణికంగా తీసుకోలేదు. అందుకే గిడుగు గ్రాంథిక భాషావాదాల్ని ఇలా తూర్పారబట్టారు.

"అధర్వణుని మాటపట్టుకొని, అహోబలపండితులవారు శ్రీనాథుని భాషేకాక, తిక్కన భాషను కూడా నిందించినట్టే, కాకునూరి అప్పన శాస్త్రుల మాట పట్టుకొని వేదం వేంకటరాయ శాస్త్రుల వారు, కొక్కొండ వేంకటరత్నం పంతులు వారి భాషేకాక, నన్నయ, తిక్కనాదుల భాషనుకూడా గ్రామ్యమని నిరాకరిస్తారు. ఈ ఆంధ్ర పండితులకు లౌకిక భాష గ్రామ్యమే అయ్యేను. కవుల గ్రాంథిక భాషకూడా నిరాకరించి మూలచ్ఛేదము చేస్తే, మరి ఏభాషకు వీరు లక్షణము నిరూపిస్తారు. తమ సంకల్పము చొప్పున భాషను పుట్టించి దాని లక్షణము నిర్దుష్టముగా తమ తృప్తికై చెప్పుకొని తమ పాండిత్యము సార్థకము చేసుకుంటారా? భారత మయినా తిన్నగా చూడకుండా గ్రాంథిక భాషాలక్షణము చెప్పే ఈ పండితులకు గ్రాంథిక భాషాదేవి కలలో నిజస్వరూపము చూపించి వేసినది గాబోలు. ఇతరుల వలె శ్రమపడి గ్రంథాలు చదువనక్కరలేదు కాబోలు" అని నిశితంగా గిడుగు విమర్శించారు.

వేదం వారికి ప్రాచీనాంధ్ర భాషా సంప్రదాయం అసలు తెలియదని గిడుగు దుయ్యబట్టారు. అది, ఇది, వాడు, వీడు పదాలు ప్రాచీనాంధ్రంలోనూ, లోక వ్యవహారంలోనూ, వున్నాయి. అసలు విషయం ఏమంటే నన్నయాది కవులు ఈ పదాల్ని ఉత్తమ పాత్రల సంబోధనల విషయంలోనూ, సంభాషణ విషయంలోనూ ప్రయోగించారు. కొక్కొండవారు వాడు, వీడు, పదాల్ని వాడినందుకు వేదంవారు విమర్శించారు. ప్రాచీన భాషా సంప్రదాయం, వేదం వారికి తెలియక పోవడం వల్ల ఇలా విమర్శించారని గిడుగు ఎద్దేవాచేశారు. వేదం లాంటి అజ్ఞానులు ఎందరో గ్రాంథిక భాషావాదులు ఎందరో వున్నారని గిడుగు ధ్వజం ఎత్తారు. గిడుగు విషయం మీద తప్ప, వ్యక్తిగతంగా ఎవరినీ, ఎప్పుడూ ఎక్కడా, విమర్శించలేదు. అది ఆయన త్వనికి వ్యతిరేకంకూడా. గ్రాంథిక భాషావాదులకు భాషా సంస్కరణ లేకపోవడాన్ని గిడుగు చాలా బాధపడ్డారు.

"ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం" అనే గ్రంథాన్ని "తెలుగు" పత్రికలో ప్రకటించారు. గిడుగు "తెలుగు" పత్రిక అన్ని సంచికలు వేదంవారికి మర్యాదపూర్వకంగా పంపారు. అంతేకాదు, తాను రాసిన విమర్శకు మీరు ప్రతివిమర్శ కానీ, సమాధానం కానీ చెప్పితే నేను "తెలుగు" పత్రికలో ముద్రిస్తానని గిడుగు వేదంవారికి సవాలు చేసారు. అయితే వేదంవారు సమాధానం ఇవ్వలేదు. గ్రాంథిక వాదులు నేల విడిచి సాముచేశారు. గిడుగు ప్రతిభ ముందు మసిబారి పోయారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తర్వాత వేదంవారు పదిసంవత్సరాలు ఆరోగ్యంగా బ్రతికే వున్నారు. అయినా వేదంవారు సమాధానం ఇవ్వలేదు. ఇవ్వలేరుకూడా. కారణం ఆయన వాదం నూటికి

నూరుపాళ్ళు తప్పు కాబట్టి. అందుకే గిడుగుకి జై. ఆయన ప్రతిభకు జైజై.

**మిథ్యాపవాదం :**

"ఆంధ్రపండితభిషక్కుల భాషాభేషజం" అనే గ్రంథంలో "మిథ్యాపవాదం" అనే మరో అద్భుతమైన రచన కూడా చోటుచేసుకుంది. కందుకూరి రచనల్లోని వ్యాకరణ దోషాలకూ, విద్యాశాఖవారు . పఠనీయగ్రంథాలుగా, పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించిన వాటిలోనూ, వ్యాకరణ విరుద్ధాలు, దుష్ట ప్రయోగాలు అని వేదం వారు చేసిన అపప్రయోగాల విమర్శను, గిడుగు పరాస్తంచేశారు. మిథ్యాపవాదం" రచన "సారస్వత సర్వసం"లో వచ్చింది. 1924లో ఇది ప్రారంభమైంది. దీని సంపాదకులు రామభద్ర చయనులు గారు.

గిడుగు "ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజం" గ్రంథంలో "దేశభాషతో తమకేమీ సంబంధము లేనట్టు దేశభాష గుడ్డి పండితులకు గుత్తకిచ్చివేసి, తాము కళ్ళుమూసుకొని, ఊరుకొన్న నాగరికులు మరి ఏదేశమందైనా క్రీ.శ. ఇరవైయోశతాబ్ద మందున్నారా? ఏమి కర్మము! ఏమి పాపము! తెలుగు భాషకు, తెలుగు వారికి ఏమి ఇంతదుర్గతి పట్టినది! దేశస్థుల భాష, దేశమందున్న శిష్టుల భాష గ్రామ్యమట. పండితులకైనా బాగా రానిది గ్రాంథిక భాషట! అయ్యో! దేశభాషా! నిన్ను తృణీకరించడమూ చేతగాదా, నూటికి పదిమందైనా తెలుగక్షరాలు వచ్చిన వాళ్ళు దేశములో లేకపోవడము, ఇంగ్లీషుపుస్తకాలే ఎప్పుడూ చదవడము సంభవించినది. ఇకనైనా తెలుగువారు కండ్లువిప్పి చూతురా" అని తన ఆవేదనను వ్యక్తం చేశారు.


వేదం వారంటే గిడుగుకు వల్ల మాలిన గౌరవం. గిడుగు వారు వేదం గారి మనువడు రాజమండ్రిలో ఒక మారు అనుకోకుండా కలుసుకుంటారు. అప్పుడు గిడుగు "మీ తాతగారిని నీ వెరుగుదువా?" అని అంటారు. "ఎరుగకేమి. 19వ ఏడు వచ్చేవరకూ ఎరుగుదును" అని చెప్పారు. అప్పుడు గిడుగు "అది ఎరగటం కాదు, వేదం వేంకటరాయశాస్త్రిగారు ఎంతటి గొప్ప పండితులో మీరెరుగరు. నాకు తెలుసు" అని అంటారు. అప్పుడు వేదం మనవడు "మీరు, తాతగారిని విమర్శించారుకదా"! అని అంటారు. వేంటనే గిడుగు "పండితుడు కనుకనే విమర్శించాను. సామాన్యులను విమర్శించి ఏమిఫలం" అని అంటారు.

*"మనకు తెలిసినంతవరకు భారతీయుల్లో కానీ, యూరోపియనుల్లో కానీ, తెలుగుభాషను వైజ్ఞానిక నేపథ్యంతో పరిశోధించాడని చెప్పగల ఒక్క పండితుడూ లేడు. అలా చెప్పగలినవాడు గిడుగు రామమూర్తి పంతులు గారొక్కడే, శాస్త్రీయ పద్ధతుల్లో భాషా విశ్లేషణ చెయ్యడానికి బహుకాలంగా శ్రమించిన పండితుడు ఆయన తప్ప మరొకడు లేడు"*

– గురజాడ

---

రచయిత– తెలుగు భాషా చరిత్ర, సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, ఆధునిక భాషాశాస్త్రం, మున్నగు 88 గ్రంథాలు రచించారు. గ్రూప్1, 2, సివిల్స్ పరీక్షల్లోనూ ఇతర అనేక ఉద్యోగాలకి సంబంధించిన పరీక్షల్లోనూ వీరి గ్రంథాలపైనే విద్యార్థులు ఆధారపడతారు. అనేక పరిశోధన పత్రాలు వ్రాశారు



ఆర్. కుసుమ కుమారి
9963625639

# జైన వాఙ్మయం - శిల్ప విశేషాలు



**కథా సాహిత్యంలో ఆకాలంలో జైనధర్మం చేసినంతటి కృషి అటు బౌద్ధ ధర్మంలో కాని ఇటు హిందూధర్మంలో కానీ జరగలేదు. ప్రజల భాషలో రచించిన కథలే ప్రజల్లోకి వెళ్తాయని జైన ధర్మం మొదట గుర్తించింది. ఆ దిశలోనే కథారచన సాగించారు. జైనధర్మ ప్రజ్ఞల వ్యాప్తికి, కథలనే కళా సాధనంగా చేసుకున్నవారు జైనరచయితలే. ఆకాలంలో ఆ ప్రక్రియను అభివృద్ధి చేసినవాళ్లు వాళ్లే.ప్రాచీన భారతీయ కథను సుసంపన్నం చేసి, ఉన్నత శిఖరాలమీద నిలబెట్టారు. ఆ సాహిత్యాన్ని భద్రపరచడంలో కూడా ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. తమిళం, కన్నడంలలో వచ్చిన జైన సాహిత్యం ప్రపంచ వ్యాప్తంగా సుప్రసిద్ధమయింది.**

**జైన వాఙ్మయం-పరిచయం.**

జైన ధర్మం బౌద్ధ ధర్మం కంటే ప్రాచీనమైనది. అయితే జైన ధర్మానికి సంబంధించిన సాహిత్యం బౌద్ధ ధర్మం సాహిత్యం కంటే ఆలస్యంగా దొరికింది. అందువల్ల, బౌద్ధ ధర్మం సాహిత్యమే ముందు వచ్చినట్లు అభిప్రాయం ఏర్పడిపోయింది.

భారతీయ సాహిత్యంలో జైన సాహిత్యం ప్రముఖమైంది.జైనులు తమ రచనలను జన సామాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి అవగాహన కలిగించే రీతిలో రచించారు. ప్రాచీన వ్యాఖ్యానాలను ప్రాకృత భాషలైన మాగధీ, మహారాష్ట్ర భాషల్లో రాశారు. ఎనిమిదవ శతాబ్దిలో దిగంబర జైనులు సంస్కృతంలో రాయడం ప్రారంభించారు. శ్వేతాంబర జైనులు ఎనిమిదో శతాబ్ది తరువాత సంస్కృతంలో రాయడం మొదలుపెట్టారు. ఆ రచనలు సరళ సంస్కృతంలో ఆ విధమైన భాషారీతుల్లో వచ్చాయి. 10వ శతాబ్ది నుంచి 12వ శతాబ్ది వరకూ అపభ్రంశ మాండలికాల్లో రాశారు. ఆ తరువాత కాలంలో దేశ భాషల్లో రాశారు.

జైన సాహిత్యం దక్షిణాదిన తమిళ కన్నడ భాషల్లో వచ్చింది. ఉత్తరాదిన గుజరాతీ, హిందీ భాషల్లో వచ్చింది. భారతీయ సాహిత్యంలో జైనులు స్పృశించని ప్రక్రియ ఏదీ లేదు. పురాణాలు-ఆఖ్యానాలు-నాటకాలు-స్తోత్రాలు వంటి ప్రక్రియలన్నింటిలోనూ రాశారు. కొన్ని గ్రంథాలు ప్రజల వాడుక భాషలో సరళంగా వచ్చాయి. కొన్ని కావ్యాలు ఆలంకారిక కావ్యశైలిలో వచ్చాయి. చిన్న వివరణలతో జైన సాహిత్యంలో నిజ్జుక్తులు (నిర్యుక్తులు) -వ్యాఖ్యానాలుగా వచ్చాయి. ఆ తరువాత, ప్రాకృతంలో విపుల వ్యాఖ్యానాలుగా రూపొందాయి. వాటి ఆధారంగా భాష్యములు, చూర్ణికలు, సంస్కృతవ్యాఖ్యానాలు వచ్చాయి.

బౌద్ధమునులువలె, జైనమునులు కూడా తమ ధర్మోపదేశాలను కథల రూపంలో చెప్పి, జైనధర్మ వ్యాప్తికి కృషి చేశారు.

**జైనధర్మం - స్వభావం :**

భగవాన్ మహావీర్ క్రీస్తుపూర్వం 599లో జన్మించారు. ఇప్పుడు బీహార్‌లోనున్న క్షత్రియకుండ్ - కుండల్‌పూర్‌లో జన్మించారు. తండ్రి పేరు సిద్ధార్థ. అతడు క్షత్రియకుండ్ నగర రాజు. తల్లి త్రిశాలా. ఆమె వైశాలిరాజు చేతక్‌కు చెల్లెలు.

మహావీర్ జన్మించి ఇప్పటికి 2600 సంవత్సరాలైంది. అతడు జైన ధర్మాన్ని స్థాపించాడు. జైన ధర్మం స్థాపించి ఇప్పటికి 2500 సంవత్సరాలు దాటింది. తీర్థ్-అనే ధర్మ మార్గాన్ని ఉపదేశించాడు. తీర్థాన్కార్ - గా ప్రసిద్ధుడయ్యాడు.

అతడు ప్రబోధించిన ధర్మం-జైన ధర్మంగా స్థిరపడింది. అహింస-నిగ్రహం- ప్రశాంతచిత్తం- క్షమ- జైన ధర్మపు ముఖ్య స్వభావాలు. సృష్టి - స్థితి - లయలకు సృష్టికర్త భగవంతుడు అనే సిద్ధాంతాన్ని జైన ధర్మం ఆమోదించదు. తీర్థాన్కార్‌లనే భగవంతుడిగా జైనులు పరిగణిస్తారు. మనిషి దైవత్వ స్థితి- సర్వజ్ఞాన స్థితి- చేరుకున్నాక-అంటే తీర్థాన్కార్ -అయ్యాక- అతడిలోనే దేవుణ్ణి చూస్తారు. అతణ్నే దేవుడిగా భావిస్తారు. అతని ఉపదేశాలను దైవోపదేశాలుగా ఆచరిస్తారు. అహింస- సత్యం- దొంగతనం చేయకుండుట - ఆస్తి లేకుండా ఉండుట- బ్రహ్మచర్యం - ప్రమాణాలుగా మహావీర్ నిర్దేశించాడు. ఆయన బోధనలను - ఆగం-అంటారు.

ధర్మం-అర్థ-కామ-అనే మూడు పురుషార్థాలు. మూడు ధర్మాల్లోనూ అంటే హిందూ ధర్మం-జైన ధర్మం- బౌద్ధ ధర్మం- లోనూ జీవిత లక్ష్యాలుగా ఆమోదించబడ్డాయి. కర్మ సిద్ధాంతం కూడా ఈ మూడు ధర్మాల్లోనూ విశ్వసించబడింది.

జైన ధర్మం మీద, జైన ధర్మం - బౌద్ధ ధర్మం-ల తులనాత్మక అధ్యయనం మీద, చాలా గ్రంథాలు ఆంగ్లంలో వచ్చాయి.

ఇన్ని మతాలు ఎందుకు ఏర్పడ్డాయి? ప్రతి ప్రపంచమతంలోనూ చీలికలు ఎందుకు వచ్చాయి? మతాధిపతుల మధ్య భేదాభిప్రాయాలే ప్రధాన కారణంగా కనిపిస్తుంది. మతం రాజకీయ ఆధిపత్య శక్తిలో భాగంగా ఉండడం కూడా మరో ప్రధాన కారణంగా కనిపిస్తుంది.

**జైన వాఙ్మయం-వస్తువు :**

ఏ మత ధర్మం అయినా, కథను ఆ మత ధర్మం పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగించి, దాన్ని ప్రజల్లో వ్యాప్తి పొందేటట్లు చేయడమే ప్రధాన లక్ష్యంగా వస్తుంది. జైన ధర్మం విషయంలోనూ అదే జరిగింది. మహావీర్ బోధించిన నాలుగు ప్రతిజ్ఞల పరిధిలోనే చాలా వరకూ

కథలు వచ్చాయి. ఎవరు ఏవిధంగా హింసించినా జైనమునులు చలించకుండా ఏ విధంగా సమాధిస్థితిలో ధ్యానంలో ఉండిపోయేవారో, జైనమునుల్లో మానవాతీతశక్తులు- నిగ్రహం, క్షమ, అహింస వంటి మానవశక్తులు ఏవిధంగా ప్రజలకు సత్యజీవన విధానంలోకి మళ్లించాయో వాస్తవంగా కొన్ని కథలు చిత్రించాయి. పరకాయ ప్రవేశం వంటి శక్తులను విశ్లేషిస్తూ ఆసక్తికరమైన కథలు వచ్చాయి. లౌకిక జీవనవిధానానికి సంబంధించిన కథలూ వచ్చాయి. చతురమైన వ్యభిచార కథలు వచ్చాయి. చోరుల కథలు వచ్చాయి. అబద్ధాలతో కూడిన అద్భుతకథలూ వచ్చాయి మూర్ఖులకథలూ వచ్చాయి. సాహసగాథలూ ఉన్నాయి. ఆ విధంగా జైన కథలు ఆనాటి జీవిత విధానానికి సంబంధించి ఎన్నెన్నో అంశాలను చిత్రీకరించి, కథను ఉన్నత స్థితికి తీసుకువెళ్లాయి.

**జైన వాఙ్మయం-రూపం :**

ప్రాకృతంలోనూ- సంస్కృతంలోనూ- ఆ రెండింటిలోనూ కూడా ఉపయోగించిన శైలిలోనూ-అపభ్రంశలోనూ జైన ధర్మం కథలను సృష్టించింది. కథలు శ్లోకాల్లోనూ, వచనంలోనూ ఆ రెండూ కలిసిన శైలిలోనూ రచించబడ్డాయి. వ్యాఖ్యానాల్లో విడివిడికథలు వచ్చాయి. మూలకథ- ఆ కథలో ఉపాఖ్యానాలు-రూపంలో కొన్ని కథా కావ్యాలు వచ్చాయి. చాలా కథలు ఆనాటి ప్రజల వాడుక భాషలో వచ్చాయి. ప్రజల వాడుక భాషలో రచిస్తేనే, ఆ కథలు ప్రజల్లోకి వెళ్తాయని జైన రచయితలు ఆకాలంలోనే గుర్తించారు. డబ్బుసంచి - వంటి కొన్ని కథల్లో ఆసక్తికరంగా చదివించే సంభాషణలు కనిపిస్తాయి. ఆలంకారిక శైలికి ప్రాధాన్యత ఇవ్వలేదు. మూలకథ- ఉపాఖ్యానాలు మధ్య సందర్భోచితమైన సంవిధానం కనిపిస్తుంది. చాలా కథలు ప్రథమ పురుష కథనంలోనే సాగాయి. ఒక పాత్ర - కొన్ని పాత్రలకు సూటిగా కథను చెప్పే రచనా రీతే ఇంచుమించుగా అన్ని కథల్లోనూ కనిపిస్తుంది. ఒక్క విషయంలో జైన కథలు ప్రత్యేకత ఉంది. బౌద్ధ కథల్లో - వస్తువు విషయంలోనూ - రూపం విషయంలోనూ కూడా- చాలా వరకూ మూసపోతధోరణి కనిపిస్తుంది. అయితే జైన కథలు ఆ విధంగా లేవు. వస్తు రూపాలు - రెండింటిలోనూ వైవిధ్యత దర్శనమౌతుంది. అంతేకాకుండా, ఆనాటి ప్రజల భాషల్లో వచ్చాయి. ఆనాటి సమాజానికి అద్దంపట్టాయి.

ఈ విధంగా జైనులు ఎన్నో గొప్ప కథాకావ్యాలను, గ్రంథాలను రచించి భారతీయ కథను ఉన్నతశిఖరాల మీద నిలబెట్టారు.

**ముగింపు వ్యాఖ్యానం:**

**కథా సాహిత్యంలో ఆకాలంలో జైనధర్మం చేసినంతటి కృషి అటు బౌద్ధ ధర్మంలో కాని - ఇటు హిందూధర్మంలో కానీ జరగలేదు.**

**ప్రజల భాషలో రచించిన కథలే ప్రజల్లోకి వెళ్తాయని జైన ధర్మం మొదట గుర్తించింది. ఆ దిశలోనే కథారచన సాగించారు.**

**జైనధర్మ ప్రజ్జల వ్యాప్తికి, కథలనే కళా సాధనంగా చేసుకున్నవారు జైనరచయితలే. ఆకాలంలో ఆ ప్రక్రియను అభివృద్ధి చేసినవాళ్లు వాళ్లే.**

ప్రాకృతం, సంస్కృతం, ప్రాకృత సంస్కృతాల మిశ్రమం, అపభ్రంశం, భారతీయ ప్రాంతీయ భాషల్లో జైనకథలు వచ్చాయి. ఆ భాషా పరిణామక్రమం ఆ కథల్లో తెలుస్తుంది.

నీతులను నీతులుగా చెప్పకుండా, వాస్తవిక సమాజచిత్రణలోంచి- జీవిత చిత్రణలోంచి-స్పష్టమైన అవగాహన కలిగేటట్లు చిత్రించారు.


సన్యాసులు- బ్రాహ్మణులు- రాజుల-వారి జీవిత చిత్రణే కాకుండా, సామాన్యుల జీవిత చిత్రణకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు.

కరుణ- క్షమ - ప్రేమ- రసాలతోపాటు హాస్య వ్యంగ్య రసాలను కూడా కథారచనలో ఒలికించి ప్రత్యేకతను చాటుకున్నారు.

**ప్రాచీన భారతీయ కథను సుసంపన్నం చేసి, ఉన్నత శిఖరాలమీద నిలబెట్టారు. ఆ సాహిత్యాన్ని భద్రపరచడంలో కూడా ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. తమిళం, కన్నడంలో వచ్చిన జైన సాహిత్యం ప్రపంచ వ్యాప్తంగా సుప్రసిద్ధమయింది.**

-రచయిత తెలుగు సహాయ ఆచార్యులు
డా॥ వి.యస్.కృష్ణ ప్రభుత్వ కళాశాల(ఎ) విశాఖపట్నం

## గ్రంథాలయం



**34గోఖలే రోడ్ నార్త్** (కథలు/కవితలు)
రచన:**డా॥ తాటి నరహరి**
పుటలు:89 వెల:రూ.150
ప్రతులకు: 1604, బిల్డెజ్లా,
16వ అంతస్తు, భవానిశంకర్‌రోడ్డు
దాదర్(ప), ముంబాయి-400 028
ఫోన్: 9322400551



**చాళుక్య బలిజ రాజపుత్రుల చరిత్ర**
(పౌరాణిక,చారిత్రక,సామాజిక పరిశోధనాగ్రంథము)
సంకలన కర్త: **భట్టరుశెట్టి పద్మారావు రాయలు**
పుటలు:516 వెల:రూ.500
ప్రచురణ: **భట్టరుశెట్టి పద్మారావు రాయలు**
బలిజపాళెం(పోస్టు), (వయా) బొట్లగూడూరు, పామూరు మండలం, ప్రకాశంజిల్లా -523110, ఫోన్:9010429826.



**గాండ్ల మిట్ట** (కథలు)
రచన:**ఆర్.సి.కృష్ణస్వామి రాజు**
పుటలు:146 వెల:రూ.160
ప్రతులకు: ఆర్.సి.కృష్ణస్వామి రాజు
22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ,
మంగళం రోడ్, తిరుపతి-517 507
ఫోన్: 9393662821



**ఏది నిత్యం**
రచయిత: **డా॥ మక్కెన శ్రీను**
పుటలు: 94 వెల:రూ.110
ప్రతులకు: **డా॥ మక్కెన శ్రీను,**
టి.ఎఫ్.-3, బొడ్డపాటి మ్యాన్షన్,
బైబిల్ స్కూల్ ఎదురుగా, గుణదల,
విజయవాడ-4. ఫోన్: 98852 19712.

సుంకర గోపాలయ్య
9492638547

# కాస్మిక్ జాతి కోసం దిగంబర కవిత్వం

*చెవులుంటే విను / కళ్ళుంటే చూడు / మెదడుంటే ఆలోచించు;*

పసవుంటే అంటే చీమూ నెత్తురు ఉంటే నీతి నిజాయితీ వుంటే దేశమంతటా రాజకీయ నాయకులు, పెద్ద పెద్ద బొజ్జల, గొప్పగొప్ప ప్రజారక్త వ్యాపారులు, పదవి కోసం డబ్బుకోసం దేనికైనా తెగించే మహాత్ములు జాతి రక్తనాళాల నిండా మహమ్మరిలా వ్యాపింపజేస్తున్న ఒక కుష్ఠువ్యవస్థని నాశనం చేయడానికి బయటకి రా –

దిగంబర కవులు ఆనాటి సమాజ పరిస్థితులను చూసి దిగంబర కవులు చేసిన వ్యాఖ్యలు ఇవి. దిగంబర కవిత మూడవ సంపుటి (1968)లోని పలుకులు ఇవి.

"మంచి కోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం, కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం ఆహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలోంచి పలుకుతున్న గొంతుకలం" అంటూ కుండబద్దలు కొట్టారు. సామాజిక మార్పు కోసం వెర్రెత్తి అరిచారు. ప్రతి మనిషి ఉనికి కోసం పిచ్చెక్కి ప్రవచించిన కవిత. దిగంబర కవిత.

సాహిత్యం హితం చేకూరుస్తుంది. కానీ వీళ్ళు ఆ హితాన్ని కాస్త తీవ్ర పదజాలంతో చెప్పారు. సంస్కరణను త్వరగా ఆశించారు.

అటువంటి దిగంబర కవిత్వంలోని సంస్కరణగా దృష్టిని పరిశీలిద్దాం

*"కలాలు కాగితాలు సర్దుకోండి*
*లా బుక్కుల్లో నా సందేహాలు వ్రాసుకోండి*
*న్యాయానికి దేశాలేమిటి? యెల్లలేమిటి ?*
*మనిషీ, రక్తం, ప్రాణం ముఖ్యం*
*లింగభేదాలు వాదాలు తప్పితే*
*మందిర్, మస్జిద్, చర్చి*
*మతాధికారులు మతాలు యెందుకు ?"*

– చెరబండరాజు

ఆకలి, కామం, కలలు, కన్నీళ్ళు మనిషిలో మర్మ జ్ఞానమంతా ఒక్కటే దేశమేదైతేనేం, మట్టంతా ఒక్కటే అంటూ నిజమైన న్యాయస్థానం చూపండని చెరబండరాజు అంటారు. మనిషి మీద నమ్మకం పోగొట్టే మీరు దేవుడు మీద ప్రమాణం ఎందుకు చేయమంటారని నిలదీస్తాడు.

ప్రజల అజ్ఞానాన్ని, మూఢనమ్మకాల్ని ఆసరాగా తీసుకొని ప్రజల డబ్బుపై భోగాలు అనుభవిస్తు దేశానికి పనికొచ్చే ఒక్క పనీ చేయని పీఠాధిపతుల్ని, బాబాల్ని, తరిమికొట్టాలంటారు. మతమౌఢ్యుల్ని, దేవుడి పేర వ్యాపారం చేసేవాళ్లనీ అవినీతిగాళ్లని కళపేరుతో ప్రజల్ని అవినీతి వైపు ప్రోత్సహిస్తున్న సినీకళాకారుల్ని నిలదీయాలని పిలుపు నిచ్చారు. ఈ నాటికి మనం ఇలాంటి దృశ్యాన్ని చూస్తు ఉన్నాం. ఆశ్రమాల పేర మీద ప్రజల బలహీనతల్ని, ఆడవాళ్ల శీలాన్ని వాడుకుంటున్న బాబాలు ఇప్పటికీ ఉన్నారు.

*" పల్లకీలలో తప్ప ప్రయాణం చేయరు*
*ధనవంతుల మేడల్లో తప్ప పూరిగుడిశెల ఊసెత్తరు*
*కాళ్ళుండీ కుంటి వాళ్ళు*
*మనుషుల బుజాల్ని తప్ప ఇంకేమీ ఎక్కరు*
*కాషాయాంబరాలు మానరు*
*ఆధ్యాత్మిక చింతన పేర*
*నవీన పతివ్రతల్ని పావనం చెయ్యందే వదలరు"*
*జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త*

– చెరబండరాజు

"నేను దేవుణ్ణి నమ్ముతున్నాను" అనే కవితలో దేవుడు ఎలా ఉండకూడదో వ్యంగ్యంగా చెబుతారు. లోక్‌సభలో చోటుకోసం, నల్లబజార్లో లాభాల కోసం, ఆలినర్పించి పొందే ప్రమోషన్ల కోసం, నా దేవుడు ముడుపులందు కోడు, నా దేవుడికి మనిషిగా బ్రతకడమిష్టమని ప్రకటిస్తాడు.

*"ఎవరికీ కాని కుక్క పిల్ల మీంచి కారునడిచినప్పుడు*
*మెతుకు కోసం మానాన్ని కాల్చుకున్నప్పుడు*
*జాలిబడ్డ గుండెల్లో నా దేవుడున్నాడు*
*నా దేవుడు, చీమూ నెత్తురూ వున్న మానవుడు*
*మానవత్వాన్ని తప్ప మరో మతాన్ని అంగీకరించడు"*

– భైరవయ్య

మతాలు, కులాల పేరు మీద ఇప్పటికీ జరిగే విధ్వంసాలను మనం చూస్తునేవున్నాం. మానవత్వమే అసలు మతం అంటూ భైరవయ్య నినదించారు.


ఈ ప్రజాస్వామ్యదేశంలో బతుకు చెడిన పీడితులు, దరిద్రులు ఎలా ఓడిపోయారో 'ఓటమి తిరుగుబాటు'లో జ్వాలాముఖి చెప్పుకొస్తారు. వారి దైన్యాన్ని వివరిస్తాడు

*"బోధివృక్షం పిడికెడు నీడనీయలేదు*
*గాంధీ పథం గరిటెడు గంజిపోయలేదు*
*ధర్మశాస్త్రాలు తలదాచుకోనీయలేదు*
*కర్మ సిద్ధాంతం బానిసను చేసి వదిలింది"*


–జ్వాలాముఖి

స్వాతంత్ర్యం పేరుమీద, ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజల జీవితాల్లో చీకట్లు అలముకున్నాయని వాటిని నిలువునా కాల్చాలని నగ్నముని 'కసుదిక్' అనే కవితలో ఇలా అంటారు.


*'రాజధానుల్లో సింహాసనాల రంకు చీకటి*
*సినిమా తెరపై చీకటి*
*రేషన్ షాపుల్లో చీకటి*
*వాగ్దానాల చీకటి*



నగ్నముని
15-5-1940




నిఖిలేశ్వర్
11-8-1938



చెరబండరాజు
1944
02-07-2082



మహాస్వప్న
1940
26-06-2019



జ్వాలాముఖి
12-04-1938
14-12-2008



భైరవయ్య
8-12-1942
19-12-2019

*కులాల పేరుతో హోదాల చీకటి*
*మతాల పేరుతో పీఠాల చీకటి*
*మానవ మేధస్సును నంచుకుతింటున్న చీకటి"*

– నగ్నముని

ఈ చీకట్లు ఇప్పటికే సమాజంలో ఉన్నాయి. పేరుకుపోయున్నాయి. సంస్కరణల వెలుగులు కావాలి. "పచ్చినిజాలు ఆవిష్కరించే వాడు కవి" అన్న మాటలుపై వాక్యాలలో మనకు కనిపిస్తోంది.

మనిషిలోని చీకటి కోణాల్ని కాల్చేస్తూ వెలుగువైపు తిప్పడానికి, సంఘంలో ఉన్న మూఢనమ్మకాన్ని పారద్రోలి, మానసికంగా, ఆర్థికంగా తయారుచేయడానికి కళ ఉపయోగపడాలి కానీ అవినీతిని ప్రోత్సహించకూడదంటారు. పత్రికల రాతల్లో, సినిమాల్లో సంఘాన్ని మార్చే ఆలోచనలు ఉండాలని కోరుకున్నారు. తీవ్ర పదజాలం ఉపయోగించారు. సమాజ సంస్కరణకు యువతరం ముందుకు రావాలని, విషవలయాల్ని సృష్టిస్తున్న ధనవంతులు, రాజకీయ నాయకులు, పనికి రాని చదువునేర్పుతున్న విశ్వవిద్యాలయాల్ని ప్రశించాలన్నారు. ఈ కుష్ఠువ్యవస్థలో దుర్గంధ సంస్కృతిని నాశనం చేయడానికి నిజమైన మనుష్యులు కావాలని కోరుకున్నారు.

"కలియుగం రేడియో గ్రామ్‌లో
గిర గిర తిరుగుతున్న క్రీ.శ ఇరవయ్యోశతాబ్దం రికార్డు
మీద పిన్నునై
మానవత రెండు కళ్ళూ మూసుకు పోయినప్పుడు
విప్పుకుంటున్న మూడో కన్నునై
నేను వస్తున్నాను దిగంబర కవిని
రాత్రి ఉదయిస్తున్న రవిని"

– మహాస్వప్న

ఇలా ఒక నూతన సమాజం కోసం నేను ఉదయిస్తున్నా నంటూ మహాస్వప్న "గ్లానిర్భవతి భారతి" అనే కవితలో తెలుపుతారు.

మన మంతా ధర్మ దేవత చర్మం వొలిచీ, గద్దల్లాంటి గుణాలను లోలోన కప్పి, లోకాలకు గంతలు కడుతున్నాం. భారత, భాగవత, రామాయణం పారాయణ అండదండల్లో ప్రాచీనత్వానికి పతాకను ఎత్తుతూ, నిత్య జీవితంలో నైతికంగా పతనమైఅభ్యుదయాన్ని కోరుకోవడం లేదని "జ్వాలాముఖి" అవలోకన కవితలో ప్రకటిస్తారు. సర్వమానవ కళ్యాణం కోరుకుంటారు.

*"సంకుచితత్వాన్ని మనమంతా*
*సాంప్రదాయబద్ధం చేసేసుకున్నాం*
*కాబట్టే మన కింకా అర్థం కానిది*
*సర్వమానవ కళ్యాణం "*

–జ్వాలాముఖి

మన పవిత్ర విశాల దేవాలయ ప్రాకారాల నడుమ, పొడుగాటి గోపురాల నీడలో భగవంతుణ్ణి బంధించి వ్యాపారం చేస్తున్నాం. బయట బిచ్చగాళ్ల సంగతి ఏంటని ప్రశ్నిస్తారు నిఖిలేశ్వర్ విగ్రహారాధన పై దృష్టి పెట్టి మానవత్వాన్ని మంట గలిపామని హెచ్చరిస్తారు.

*" దేవుళ్ళకోసం – రాజుల సమాధుల కోసం*
*బంగారు ఇటుకలతో గోడలు లేపే ఈ దేశంలో*
*మట్టిగోడల గోడు వినే వాడెవ్వడు ? "*

– నిఖిలేశ్వర్

"ఈ జీవితంలో జంతువుల్లా బ్రతికే అధికారం ఎవరికీ లేదు. పనిచేస్తూ, తింటూ, పిల్లల్నికంటూ వున్నంత మాత్రాన అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నట్టుకాదు. ఈ జీవితం తాటస్థ్యాన్ని వరించకూడదు. మనిషి జీవితం ద్వీపం లాగా కాకుండా తోటి వారి ప్రేరణ ప్రోతస్సుగా వుండడం కావాలి" ఇదే దిగంబర కవులు కోరుకున్న మార్పు. కుళ్ళిగబ్బుకొడుతున్న కుల,మత,వర్ణ,వర్గ బురద గుంటల్లో పడి పురుగుల్లా ఉన్న వారిని త్యజించాలన్నారు. యుగయుగాల చీకటి నుండి, తరతరాల దాహం నుండి విముక్తి కోరుకున్నారు.

*సరిహద్దుల్లో పారే నెత్తుటేర్లని*
*నిర్లిప్తంగా చూస్తూ నిలుచున్న మేధావుల్ని మన్నించకు*
*ఎవర్ని నమ్మకు*
*నీ ఆశయం సూర్యుణ్ణి మాత్రం*
*పిడికిట్లో జార విడువకు*
*ప్రాణాన్ని పణం పెట్టయినా*
*ఈ జగతికి మానవతా భిక్ష పెట్టు*


– చెరబండరాజు

దిగంబర కవులు చెప్పిన ఈ విషయాల్లో ఇప్పటికీ మనం చాలా విషయాల్లో ఏకీభవించవచ్చు. అదే నిర్లిప్తత ఉంది. ఈ సమాజానికి మానవత్వం మందుపట్టాలి. "దిగంబర కవిత్వ ప్రాసంగికత ఇన్నేళ్ళలో మరింత పెరిగిందే తప్ప రవ్వంత కూడా తరగలేదు. మరి కొన్ని సంక్లిష్టతలు వచ్చిచేరాయి. సమాజం ఏమవుతూ ఉందో అందరూ ఎరిగిందే'' అని పలికిన సీతారాం గారి మాటలు మనం గమనించదగినవి. ఈ సమాజ సంస్కరణ కోసం మరో దిగంబర కవితోద్యమం వస్తుందా ! ఏమో చూద్దాం.

రచయిత తెలుగు శాఖాధిపతి
డి.ఆర్.జి. ప్రభుత్వ కళాశాల, తాడేపల్లిగూడెం

కోటిపల్లి సుబ్బారావు
94915 24786

# బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ పదహారణాల తెలుగువాడే



**బెంగళూరు నుండి వెలువడే 'ప్రజావాణి' దినపత్రిక 1957వ సంవత్సరం మార్చి నెల 17వ తారీఖు ఆదివారం రోజున కన్నడంలో విద్వాన్ సుబ్బరామప్ప బెంగళూరు నిర్మాపక కెంపేగౌడ తెలుగినవ- తెలుగుకవి అనే మకుటాలతో వ్రాసిన వ్యాసాన్ని యథాతథంగా తెలుగు అనువాదాన్ని ఇక్కడ ఇస్తున్నాం.**

సుందర బెంగళూరు మహానగర నిర్మాత శ్రీ కెంపేగౌడ యొక్క మాతృభాష తెలుగు. అతను తెలుగులో చాలా కవితలు వ్రాశాడు. అలాగే 'గంగా గౌరి విలాసం' అనే యక్షగానమును రచించి, బెంగళూరులోని అలసూరులో తను నిర్మించిన సోమేశ్వరాలయంలో ప్రతిష్ఠించిన సోమేశ్వరస్వామికి అంకితం చేశాడు కూడా. (ప్రాచ్య లిఖిత పుస్తక బాండార వివరణి సూచిక ఎ-యక్షగానాలు)

**శాసనాధారాలు:**

పెద్దకెంపేరాయుడు (గౌడ) దగ్గర నుండి రెండవ కెంపేరాయుడు వరకు గల వంశీయులు తెలుగువారు అనడానికి కొన్ని శాసనాధారాలు బెంగళూరు నగరంలోని బళ్ళాపూరపేట రంగనాథస్వామి దేవస్థానమందు చూడవచ్చు. పెద కెంపారాయుడు (కెంపే గౌడ) వారి కుమారుడు ఇమ్మడి కెంపేరాయుడు ఈ రంగనాథస్వామి దేవస్థానంలో శిలాఫలకము నందు తెలుగులో ఈ విధముగా వ్రాయించినాడు: స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక 1549 ప్రభవ నామ సంవత్సరం శ్రీమద్ రాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ వీరరామదేవరాయ మహారాయలయ్యవారు రత్నసింహాసనారూఢులైన, యలహంకనాడు ప్రభువులైన కెంప నంజయ్య గౌని వారి (గౌడని శబ్ద భవము) పౌత్రులైన కెంపెగౌనివారి పుత్రులైన ఇమ్మడి కెంపగౌనయ్య వారు సద్ధర్మ ప్రతిపాలకులై సుఖరాజ్యం చేయుచుండగాను, బెంగళూరు పేటేయందు సమస్తజనులు నానాదేశముల సమస్త జనులును.... రంగనాథస్వామి పడితర నైవేద్య తిరునాళ్ళు మొదలైన ధర్మాలకై కెంపెగౌనయ్య వారికి ఎరుక చేసి ఇచ్చిన ముగముంపడి అరవీసం లెఖ్ఖను విడిచేస్తిమి. త్రికరణ శుద్ధిగా దానపత్ర శిలాశాసనం". దీని తర్వాత ఎనిమిది సంవత్సరాలకు వారు తెలుగువారని తెలిసినది.

ఇంకా 'ఇమ్మడి కెంపనగౌనయ్య గారికి ఆచంద్ర తారార్కము పుత్ర పౌత్ర పారంపర్యము ధర్మం' అని కూడా పేర్కొనబడినది.

కెంపేగౌడ గురించి నాకు (విద్వాన్ కె. సుబ్బరామప్ప) దొరికిన శాసనాధారములను బట్టి అతని జీవిత చరిత్రను ఈ క్రింది విధముగా ఇవ్వడమైనది.

**కంచి నుండి మైసూరు**

కెంపేగౌడ గారి అసలు పేరు పెద కెంపరాయలు. గౌడ అనే పదం వారి వంశీయులకు వచ్చిన ఒక నాయకత్వ పదాన్ని సూచించే బిరుదు. పెద కెంపరాయల పూర్వీకులు తెలుగు వారు. ముందు తమిళనాడు కాంచీపురం ప్రాంతం నుండి మైసూరు రాజ్యంలో నుండే 'అవరే' అనే గ్రామానికి వచ్చి, అక్కడనుండి బెంగళూరుకు 8 మైళ్ళ దూరాన్నున్న యలహంక ప్రాంతంలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. అప్పటికి విజయనగర సామ్రాజ్యము స్థాపితమై, ఆ విజయనగర రాజులనుండి 'గౌడత్వమును' పొందారు. దానివల్ల వీరికి 'గౌడ' మరియు 'యలహంక ప్రభువు' అన్న పరిపాలనా బిరుదులు వచ్చాయి.

వీరిలో క్రీ.శ. 1418 నుండి 1533 వరకు యలహంకను పరిపాలించిన వారిలో 'జయగౌడ' సుప్రసిద్ధుడు. అతని పుత్రుడు సిద్ధగౌడ. సిద్ధగౌడనికి సంతానం లేకపోవడంతో అతను వారి కులదైవమైనటువంటి కెంపమ్మ దేవిని ఆరాధించి తదనంతరం జన్మించిన పుత్రునికి 'కెంపనంజేగౌడ' అని నామకరణం చేసెను. (కెంపమ్మ అంటే తెలుగులో ఎర్రమ్మ అని అర్థము). అప్పటినుండి వారి వంశీయులకు 'కెంప' అనే పేరు స్థిరమైంది. తన తండ్రి స్వర్గస్థులైన తరువాత కెంపనంజేగౌడ క్రీ.శ. 1443 నుండి 1513 వరకు తన యలహంక సంస్థానాన్ని పరిపాలించెను.

**ఈ కెంపనంజేగౌడ కుమారుడే 'దొడ్డ కెంపేగౌడ'. ఇతను క్రీ.శ.**


ಬೆಂಗಳೂರು ನಿರ್ಮಾಪಕ ಕೆಂಪೇಗೌಡ

ವಿದ್ವಾನ್ ಕೆ. ಸುಬ್ಬರಾಮಪ್ಪ

తెలుగినవ - తెలుగు కవి

**1513 నుండి 1569 వరకు అవిచ్ఛిన్నముగా రాజ్యభారమును వహించెను. ఇతను శ్రీకృష్ణదేవరాయల నుండి మన్నన పొందెను. ఇతనే క్రీ.శ. 1537వ సంవత్సరంలో బెంగళూరు నగరమును నిర్మించెను. ఇతనే 'గంగా గౌరి విలాసం' అనే యక్షగానమును తెలుగులో రచించెను.**

**శివసముద్రం**

బెంగళూరు నగర నిర్మాణానికి ముందు ఆ ప్రాంతానికి 'శివసముద్రమని' పేరుండెను. తన రాజ్యమును విస్తరింపచేసిన తరువాత ఒకనాడు శివసముద్రమునకు 10 మైళ్ళ దూరంలో వేటాడుచుండగా అక్కడ ఒక కుందేలు వేటకుక్కను తరమడం చూసి ఆ కుందేలు ధైర్య సాహసానికి మెచ్చుకొని, ఆశ్చర్యచకితుడై పరమానంద భరితుడై, ఆ స్థలమే రాజధానికి సరైనదని నిర్ణయించుకొని అక్కడ నాల్గు శిఖరములు గల ఒక కోటను నిర్మించెను. ఆ కోటకు సింహద్వారమును నిర్మించడానికి ప్రారంభించినప్పుడు అది ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు ఉండి రాత్రి పడిపోవుచుండెను. ఈ విధంగా చాలా రోజులు గడిచిన పిమ్మట, రాజు చాలా ఖిన్నుడాయెను. ఒక రోజు ఒక మహాపురుషుడు ఆయనకు కలలో కనిపించి నరబలి ఇస్తే సింహద్వారము నిలబడునని చెప్పినట్లాయెను. దీనిని వినిన రాయుని కోడలైన లక్ష్మమ్మ బలియగుటకు ముందుకు వచ్చెను. కెంపరాయుడు సమ్మతించనప్పటికి, లక్ష్మమ్మ ఒకరోజు ఎవరికీ తెలియకుండా సింహద్వారము వద్దకెళ్ళి తన గొంతు కోసుకొని ఆ రక్తంతో సింహద్వారమును తడిపి ఆత్మసమర్పణము చేసికొనెను. తదనంతరం సింహద్వారము నిలిచెను. ఆమె జ్ఞాపకార్థం రాయడు తూర్పుదిక్కులోగల కోరమండలమను ప్రదేశములో లక్ష్మమ్మకు ఒక దేవాలయమును నిర్మించెను. ఇప్పటికీ ఈ దేవాలయంలో లక్ష్మమ్మకు పూజలు కొనసాగుతున్నవి.

కెంపరాయుడు బెంగళూరు నగరమునే కాకుండా అనేక గుడిగోపురములను కూడా కట్టించెను. వాటిలో ముఖ్యమైనవి బెంగళూరు గవిపురంలోని గవి గంగాధరేశ్వరాలయం మరియు దాని దగ్గరలోని తమ కులదేవత కెంపమ్మ పేరున కట్టించిన కెంపాంబుధి చెరువు. ఇవే కాకుండా బెంగళూరు బసవగుడిలో బసవన్నని ప్రతిష్ఠాపన చేసి శివారాధకుడని పేరొందెను. ఈ దేవాలయం సమీపంలోనే దొడ్డ విఘ్నేశ్వర (పెద్ద గణపతి), నందీశ్వర, ఆంజనేయ మరియు మల్లిఖార్జున దేవస్థానములను కూడా నిర్మించెను.

**సోమేశ్వరార్పణము**

ఇవన్నిటికంటే ముఖ్యమైనది అలసూరులోని సోమేశ్వరాలయము. ఈ ఆలయము నిర్మాణం వెనుక ఒక కథ ఉంది. ఒకనాడు సోమేశ్వరస్వామి శ్రీ కెంపరాయుడుకి కలలో కనిపించి ఇప్పుడు దేవస్థానమున్న ప్రదేశములో త్రవ్వినయెడల అపార ధనము దొరకునని, దానితో తనకు దేవస్థానము నిర్మించమని చెప్పెను. అచట త్రవ్వగా నిజముగనే అపార ధనము మరియు ఒక శివలింగము దొరికెను. ఆ ధనముతో ఒక దేవస్థానము నిర్మించి అందులో సోమేశ్వరుణ్ణి ప్రతిష్టించి ఆరాధన చేయనొడగెను. ఈ సోమేశ్వరునికే కెంపరాయుడు 'గంగా గౌరి విలాసము' అను యక్షగానమును అంకితం చేసెను.

(1) Epigraphica Carnatica Vol. 9, Bangalore Page 179 (2) The Quarterly Journal of the Mythic Society Vol XII No. 4 July 1923; (3) "The Kempe Gowda Chiefs" by Puttaiya, B.A. Pages (723-741). పై గ్రంథాదులలో ఈ విధముగా తెలుగులో వ్రాయబడినది.

1. శ్రీ గౌరీపతి చంద్రశేఖర సతీ చిత్తాబ్జ రోలంబ సన్నగాధీశ్వరా హార మార మథనా నాకేశ సంసేవితా "యోగేంద్రార్చిత పాద పద్మ యోహా మయార్థాంగ హెరియ కెంప నృపర్తి రక్షించు సోమేశ్వరా".

2.సుకవులకు సారమ్మ బహు సుకవులకెద శూలమై యకుంఠిత ధారై చకిత చకిత వాద్యములై వికసించును పెద్ద కెంప విభు సత్కవితల్

3. గంగా గౌరీ విలాసము సంగతి పద పద్యములకు సరసత వివర్క రంగత్భాషణము ఉచిల గంగా పెద్ద కెంపరాయ డొనరించున్.... ఈ యక్షగాన రచనను చూపించుటకు ఒక పాటను మచ్చుకు వినిపిస్తాను.

**కాంబోధి రాగము; ఏక తాళము**

జాలి మాలి బొందితిని నానిపోవ జాలక కుందితినే చాలు చాలు ఆడబుట్టా ఇట్లైనమీద బాల నాకేటి గుటో గడియ ఏడాదిమైనగదివే వానిమా విడిదికి తేగదవే తలకెక్కే దాని నేమందునే నెంత పిలిచిన రాడేమందు.

ఈ కేంపెగౌడ వంశస్థులు బెంగళూరు ప్రాంతమును క్రీ.శ. 1728 వరకు పరిపాలించిరి. మైసూరు దొడ్డ కృష్ణరాజ దళవాయి, దేవరాజయ్య కెంపెగౌడ వంశస్థులలో చివరివాడైన ముమ్మడి కెంపవీరప్పను ఓడించి బెంగళూరును తన రాజ్యములోనికి చేర్చుకొనెను.

కెంపగౌడ వంశీయుల వృత్తాంతమును తెలిపే తాళపత్ర గ్రంథమొకటి లభించినది. అందులో మొదటి 6 పేజీలు తెలుగులో మిగిలినవి కన్నడములోనూ ఉన్నాయి. వీటినుండి తెలిసినదేమనగా వీరు తెలుగువారనియు కానీ రాజకీయ వ్యవహారములు కన్నడలో నడిపేవారనియూ తెలుస్తోంది(వైశ్య పత్రిక).

**పెద్ద కెంపరాయుడు గారి కెంపేగౌడ తెలుగువాడు అని తెలిపే**

**మిగతా ఆధారాలు ఇలా ఉన్నాయి.**

2. పెద్ద కెంపరాయుడుగారి వంశస్థులు బండికాపులు, వంశానికి చెందిన వారని చరిత్రకారులు చెప్పుచున్నారు. వీరి పూర్వీకులైన రణబైరేనాయకుడు, దుష్టపల్లెగారల దారుణాల నుండి తప్పించుకొనుటకు వీరు 'ఏడుబండ్లలో' కాంచీపుర ప్రాంతంలోని యనమంజి, పుత్తూరు నుండి వచ్చి మైసూరు రాజ్యంలో ఉండే 'అవరే' అనే గ్రామంలో స్థిరపడ్డారు. ఈ 'కాపు' కులము తెలుగు కులము. మాతృభాష తెలుగు. కొంతమంది చరిత్రకారులు వీరు కడప జిల్లా నుండి ఏడుబండ్లలో బయలుదేరివచ్చి 'ఆవతి'లో స్థిరపడిన 'బండికాపు'లని చెప్పుచున్నారు. బహుశా వీరు కాంచీపురం పుత్తూరు, యనమంజినుండి వచ్చి కడపలో ఆగి అచ్చటి నుండి ఏడు బండ్లలో బయలుదేరి మైసూరు రాజ్యం అవరేలో స్థిరపడి ఉండవచ్చును.

3. ఎమ్.ఆర్. గోపాలస్వామి అనేవారు 'బెంగళూరును స్థాపించిన కెంపేగౌడ తెలుగు కవి' అని 27-1-1957వ తేదీ ప్రజామాత పత్రిక 9వ పేజీలో ప్రకటించినారు.

ఏకాంబరశాస్త్రి గారు వ్రాసిన 'ఏకాంబర విజయము'లో కెంపేగౌడ పెద్దకెంపేగౌడ అని పిలువబడినాడని వ్రాసినారు. పెద్ద కెంపేగౌడ అనే నామము తెలుగు నామమే.

ఇక్కడ ఇంకో విషయము. బెంగళూరు, దాని పరిసర ప్రాంతములలోనున్న భూములన్నీ మొదట తెలుగువారైన రెడ్లు, మిగతా తెలుగు కులాలకు చెందినవారి పేరుమీదే రిజిష్టరు అయినవి. వాటిని వారు అమ్మిన తర్వాత కొన్నవారి పేర్ల మీద బదిలీ అయినవి. ఇది ఎవరూ కాదనడానికి వీలులేని సంగతి. అదీ కాక క్రీ.శ. 1418 సంవత్సరం, ఆ తరువాతి కాలంలో కూడా, ఇప్పటివలె తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర అనే విభజన లేదు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర, ఒరిస్సా వరకు విజయనగర సామ్రాజ్య ప్రభువులే పరిపాలించారు.

4. మాగడి ఆఖరిరాజైన వీరప్పగౌని, శత్రువుల మరియు చాడికోరుల పితూరీకి బలియై పట్టుబడినాడు. తర్వాత అతనిని బంధించి ఇనుప పంజరంలో వేసి శ్రీరంగపట్నంవైపు తీసుకువెళ్ళినారని తెలుస్తున్నది. అలా మైసూరు రాజు యొక్క దళవాయి దేవరాజయ్య ఓడిన కెంపవీరప్ప (గౌడ)ను బంధించి కావేరిలో పావని సంగమంలోని కరిగట్టలో (శ్రీరంగపట్నం దగ్గర) జైలులో వేసినారు. అలా జైలులో ఉంటూ అప్పటి హులికల్లు సేనాని ముద్దు కృష్ణరాజగౌడకు క్రీ.శ. 1728లో చివరగా రహస్యంగా ఒక ఉత్తరం వ్రాసి పంపెను. ఆ ఉత్తరం ఈ క్రింది విధంగా ఉన్నది. (ఈ ఉత్తరం బెంగళూరు అభిలేఖా భాండాగారములో ఉన్నది). దాని తెలుగు పాఠం ఈ క్రింది విధంగా ఉంది.

'మీకు మా ఆశీర్వాదములు. ఫాల్గుణ మాసం బహుళ కృష్ణ దశమి వరకు మనమందరము బాగానే ఉన్నాము. మీ క్షేమ సమాచారములు తెలుపగోర్తాను. సోమనాథదేవుని ఆజ్ఞ (వ్రాత) వల్లనేమో మేమీ దురదృష్టానికి గురియైతిమి. ఇప్పుడు మా ఆరోగ్యము బాగోలేదు. మరియు ఈ అనారోగ్యం నుండి బయటపడే అవకాశం లేదు. బహుశా మాకిక బ్రతికే యోగం లేదు. మా కుటుంబానికి వారసులు మీరొక్కరే తప్ప మరొక్కరు లేరు. సోముని ద్వారా మా శిరస్సు యొక్క ఆభరణము మరియు రాజ్య ఆయుధాలు పంపిస్తున్నాను. మీరు తెలివిగా ప్రవర్తించి, మా యొక్క ఆరోగ్యం గురించి తరచుగా తెలుసుకోగోరతాను. మేము చనిపోయిన తర్వాత మాకు ఉత్తర శ్రాద్ధ కర్మలు నిర్వర్తించగోరతాను. సోమన్న మీకు వ్యక్తిగతంగా మిగతా విషయాలు చెబుతాడు. అట్టి విషయాలు లిఖిత పూర్వకం కాకూడదు. మేము చెప్పిన విషయాలు మర్చిపోవద్దు. ఇచ్చటకు మీకు సన్నిహితులైన నమ్మకమైన వారిని తప్పనిసరిగా పంపించాలి. - కెంపయ్య

ఇచ్చట తనను కెంపయ్య అనే సంబోధించుకొన్నాడు. ఈ ఉత్తరం తెలుగు-కన్నడ భాషలతో కూడుకొని ఉన్నది.

5. వీరు ఆంధ్రప్రాంతమునకు చెందినవారని మరొక వాదన కలదు. ఆంధ్రప్రాంతంలో ఉండే కాపులు కడప నుండి ఏడుబండ్లలో 7 కుటుంబాల వారు వచ్చి యలహంకలో నాడ ప్రభువులుగా పిలువబడ్డారు. కాపుకులస్తులు ముమ్మాటికీ తెలుగు వారే. వీరి మాతృభాష తెలుగు. వీరు కోలారు జిల్లా యందలి ములుబాగిలు తాలూకాలోని ములకంగకు వచ్చి తర్వాత ఆవతి, యలహంక, బెంగళూరు మరియు మాగడిలో నివసించి రాజ్యపరిపాలన చేసినారు. చరిత్రకారులు ఈ వంశమందలి రాజును పెద్ద కెంపరాయలు, పెద్ద కెంపయ్య అని పిలవడము కూడా వారి తెలుగు మూలాన్ని సూచిస్తుంది.

వీరు ఆంధ్ర, కడప నుండి ఏడుబండ్లలో వచ్చిన బండి కాపులుగా ప్రముఖ దళితకవి, విమర్శకులు శ్రీ వడ్డగిరి నాగరాజు గారు అభిప్రాయపడ్డారు.

5. యలహంక ప్రభువులైన ఇమ్మడి కెంపేగౌడ రాజ్యంలో గుజ్జరి విశ్వనాథం అనేవారు కట్టించిన ధర్మశాల - మఠము విషయము గురించి తెలుగులో శిలాశాసనాన్ని గమనించవచ్చును. బెంగళూరు నగరంలో చిక్కపేట స్థలంలో 'తుంగ అచ్చప్ప ఇంటి ప్రక్కన దొరికిన తెలుగు శిలాశాసనములో ఈ క్రింది విధముగా ఉన్నది.

శ్రీయుతులు నాడప్రభువులైన 'ఇమ్మడి కెంపయ్యా గౌని దయ వాఇకే కం. ఆచంద్రార్కంగాను పుత్రపౌత్ర పారంపర్యంగా ధర్మము కొఅకు గుజ్జరి విశ్వనాధు కట్టించిన ధర్మశాల మఠము శ్రీముఖ సంవత్సర, వైశాఖ శుద్ధ తదియ యందు .....

ఇక్కడ ఇమ్మడి కెంపేగౌడ అయ్యాగారికి అంటే కులగురువులకు ధర్మార్థంగా గుజ్జరి విశ్వనాథ అనే వారుధర్మశాల మఠాన్ని కట్టించిన వివరాలు తెలుగులో ఉన్నవి. ఇమ్మడి కెంపేగౌడ గారు శిలాశాసనము కూడా తెలుగులో వేయించేరు.

6. ఇమ్మడి కెంపేగౌడ రచించిన గంగా గౌరి విలాసము అనే తెలుగు యక్షగానము (ప్రతి చెన్నై ప్రాచ్యలిఖిత భాండాగారములో నున్నది). దీని మొదటి భాగములో తమ కులదేవతలైన సోమేశ్వరుని స్తుతించి

'శ్రీ గౌరిపతి చంద్రశేఖరసతి చిత్తాంజరోలంబస
న్నాగాధీశ్వర హరమార మథనా నాకేశ సంసేవితా
యోగీంద్రార్చిత పాదపద్మ.......
యోహామయ యర్థాంగ
హిరియ కెంపన్నృపర్తి రక్షించు సోమేశ్వరా

**కంద పద్యం:**

సుకవులకు సారమై బహు
సు(కు) కవుల కడశూలమై కుంఠితధారై

చకిత చకిత వాద్యములై

వికసించును పెద్ద కెంపవిభు సక్కలితుల్

**కందపద్యం:**

గంగాగౌరివిలాసము

సంగతి పదపద్యమలకు సరసతవివరన్

రంగద్భాషణములు చెల

గంగా పెద్ద (ద) కెంపరాయ (విభు) దొనరించున్

అని స్తుతించబడినది.

తెలుగులో రచించబడిన ఈ యక్షగానం యిమ్మడి పెద్ద కెంపరాయలు తెలుగువారని తెలపక తెలుపుచున్నది.

7. యిమ్మడి కెంపనాయకులు తెలుగువారని తెలుపుటకు మరో ఆధారము కూడా కలదు. శ్రీ ఏకాంబర శాస్త్రి వ్రాసిన 'వీరభద్ర విజయము' లో కెంపేగౌడ గారిని పెద్ద కెంపేగౌడ అని పిలిచినారు. అదియును కాకుండా ''ఈ రాజు కర్ణటకాంధ్రద్రవిడ రాజ్యాలలో కీర్తివంతుడై వెలసినాడు అని ప్రస్తావించేడు. ఈ కావ్యము కూడ పెద్ద కెంపరాయలు (కెంపేగౌడ) ఆంధ్ర మరియు తెలుగువారని చెప్పుటకు కూడా ఒక ఆధారము.

8. వీరు తమిళమూలం వారని చెప్పే ఒక వాదం కూడ ఉన్నది. అది కూడా తెలుగువారనే వాదానికే బలం చేకూరుస్తున్నది. తమిళ మూలం వాదన ప్రకారం వీరు కాంచీపురం దగ్గఱలో నున్న ఎలమంజి (తెలుగులోని ఎలమంచి, తమిళంలో ఎలమంజి అవుతుంది) పుత్తూరు నుండి వచ్చి ఇప్పటి కర్నాటక యందలి ఆవతిలో స్థిరపడినారు. వీరు అక్కడి ఒక దుష్ట పాలెగారయిన నాయకుని బాధల నుండి తప్పించుకొనుటకు ఏడుబండ్లలో ఎలమంజి-పుత్తూరు నుండి వచ్చి కర్నాటకలో స్థిరపడినారని కథనము. వీరు దుష్టపాలెగార్ల నుండి తప్పించుకొని ఏడు బండ్లలో వచ్చిన 'కాపులు' అని ఈ వాదం అంగీకరిస్తున్నది. వారు అక్కడి నుండి వచ్చి ఆవతిలో స్థిరపడినారని చెబుతున్నారు. కొందరు చరిత్రకారులు 'కాపులు' అంటే ఒక్కలిగరుఅని, వ్యవసాయదారులని నిర్వచించితిరి. వీరు కాంచీపురం, మొరసునాడు, కొంగనాడు అనే పర్యాయ పదాలను చూపించి, ఈ వంశానికి చెందినవారు తెలుగు మాట్లాడే వక్కలిగరుగా చెప్పితిరి. ఆంధ్రప్రదేశ్లో ఎక్కువగా ఉన్న వీరు కర్నాటకలోని బెంగళూరు, తుమకూరు, కోలారు, చిత్రదుర్గలో ఉన్నవారు వ్యవసాయదారులని, ఒక్కలిగరు అనియు రెడ్డి గార్లనియు పిలిచేవారనియు అంటున్నారు. కాని కాపుకులస్తులు నూటికినూరుపాళ్ళు తెలుగు కులస్తులు. తెలుగువారే. రెడ్ల యొక్క కులం కూడ కాపుకులమే. తెలగ, కాపు, బలిజ, ఒంటరి కులస్తులు కూడా కాపుకులస్తులే. వీరందరూ తెలుగు మాతృభాషగా కలవారే. వారు తమిళనాడు, కర్నాటక, ఆంధ్రలో నున్న తెలుగువారు. కాంచీపురం కూడ ఒకప్పుడు పూర్తి తెలుగు ప్రాంతమే. అప్పటికి విజయనగర సామ్రాజ్యంలో భాగమే తమిళనాడు జనాభాలోని 46% ప్రజలు తెలుగు మూలాలు కలిగినవారే. ఇపుడు కూడా కాంచీపురం, దాని చుట్టు ప్రక్కల గ్రామ ప్రజల్లో ఎక్కువ మంది తెలుగు మూలాలు కలిగినవారే. ఏడు బండ్లలో వచ్చిన కాపువారంటే, అది పూర్తి తెలుగు పదం. తెలుగువారు. కాబట్టి తమిళ మూలమని వాదించే వారు కూడ ఈ బండి కాపులు తెలుగు వారని విశ్వసించకతప్పదు.

9. యిమ్మడి కెంపేగౌడ వంశము వారు కన్నడము వారిన తెలిపే వాదనలో నిర్దుష్టమైన అంశాలు కనిపించుటలేదు. ప్రధానంగా కర్నాటక ప్రాంతంలో పరిపాలనచేసిన వారిని కన్నడమూలం కాదని చెప్పుట సహేతుకం కాదని చెబుతున్నారు. కెంపేగౌడ నాడ ప్రభువుల మూలం గురించి పై పరిశోధన చేసిన వారిలో ప్రముఖ విద్వాంసులు సర్వశ్రీ ఎమ్.వి. శ్రీనివాస్, దేవర కొండారెడ్డి, ఎమ్.జి. మంజునాథ్ మరియు డి.వి. కృష్ణమూర్తి. ద్విభాషా ప్రదేశము కోలారు జిల్లా మరియు బెంగళూరులోని కొన్ని ప్రదేశాలలో నివసించడము వలన తెలుగు భాషా సాహిత్య క్షేత్రంలో సంపర్కము కలుగుట స్వాభావికము. ఐతే వారు కన్నడనాడు మూల వాసులు అయి ఉండి రాజ్యాన్ని నిర్మించి పరిపాలన చేసినారనేది నిస్సందేహమైనదని శ్రీ ఎమ్.వి. శ్రీనివాస్ గారి అభిప్రాయము. శ్రీ దేవరకొండారెడ్డి గారు యలహంక నాడ ప్రభువులు ములబాగిలు తాలుకాలోని 'పుత్తూరు' నుండి వచ్చినవారంటే, శ్రీ ఎమ్.జి. మంజునాథగారు కోలారు దగ్గఱ లోని ప్రాంతము వారి జన్మస్థలమనియు చెప్పితిరి. శ్రీ పి.వి. కృష్ణమూర్తి గారు పలు శాసనాలు అధ్యయనము చేసి, వారి మూల ప్రాంతము గురించి కంచి, మొరసునాడు, యనమంజి, పాలారు పరివాహక ప్రాంతము గురించి దీర్ఘంగా వ్యాఖ్యానించి కెంపేగౌడ వంశస్థులు కన్నడము వారేనని సమర్థించుకొన్నారు.కొందరు ఇప్పటి కర్నాటక, ఆంధ్ర, తమిళనాడు లోని కొన్ని ప్రదేశాలను మొత్తంగా చేర్చి 'మొరసునాడు' అనియు,దీని ద్వారా వారి రాజ్యము కన్నడము, తెలుగు, తమిళ భాషా ప్రాంతాల యందు వ్యాపించినది తెలియజేస్తున్నారు. వీరిని కేవలం ఒక భాషకే పరిమితము కాకుండ, ఆయా ప్రదేశాల భాషా ప్రాబల్యాన్ని మన్నించి, విలువనిచ్చి నాడ ప్రభువులు పరిపాలన చేసినారు. వీరి మూలాన్ని తెలుగు, తమిళము వారని నిర్ధారించుట సరికాదని చెప్పుచున్నారు. కన్నడమువారు మొదటి నుండి, కన్నడ భాషా స్వాభిమానులు, కానందున అన్ని భాషలను గౌరవించి ప్రోత్సహించడము నాడ ప్రభువుల కాలంలోను కొనసాగిందని వాదించుచున్నారు. కనుక కొన్ని గ్రంథాలు ఇతర భాషలలో రచింపబడవచ్చును. అందువలన వీరు కన్నడమూలం వారేనని వాదించుచున్నారు.

కాని కోలారు, ములబాగిలు, బెంగళూరు యందలి మూల వాసులు ప్రధానంగా తెలుగు మూలాలు కలిగినవారే. మరియు బెంగళూరు పరిసర ప్రాంతముల యందలి పాత భూముల పత్రాలను పరిశీలించిన పిదప వాటి యజమానులు ప్రధానంగా తెలుగువారు, రెడ్డి, కాపు కులస్తులే అని తెలియుచున్నది మరియు నాడ ప్రభువులు శ్రీకృష్ణదేవరాయల సామంత ప్రభువులు. తెలుగు ప్రాంతవాసులు, తెలుగు మూలము కలిగిన ఈ ప్రభువులు కర్నాటక ప్రాంతాన్ని పరిపాలించడములో అనౌచిత్యము లేదు. పై ఆధారాల వలన వీరు తెలుగువారేననియు మరియు కెంపేగౌడ గారు ఇమ్మడి పెద్ద కెంపేగౌడ గారినియు నిర్ధారింపబడుచున్నది.

రచయిత, విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజరు,

జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు)

# ప్రాంతీయ భాషలో వైద్యశాస్త్ర బోధన కష్టం కాదంటున్న వైద్యాచార్యులు

**జాతీయ విద్యావిధానం 2020 ప్రాంతీయ భాషలను ప్రోత్సహించాలని ప్రతిపాదించింది. దీంతో స్థానిక భాషల్లో వైద్యశాస్త్రాన్ని బోధించాలనే విషయం ఇప్పుడు దేశవ్యాప్త చర్చనీయాంశంగా మారింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ఇంజనీరింగ్, న్యాయ శాస్త్రాలు భారతీయ భాషలలో అందుబాటులో ఉండాలని సూచించిన నేపథ్యంలో దీనిపై చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా వైద్యవిద్యకు సంబంధించి ప్రాంతీయ భాషా అవసరం ఎంతవరకూ అనేదానిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఉన్నత చదువులు, వ్యాధి పరిష్కారాలకు వైద్యశాస్త్రంలో ఆంగ్లం ముఖ్యమని కొందరు వాదిస్తుంటే, రోగులతో సరిగా మెలగడానికి, వారికి రోగాన్ని పుర్తి స్థాయిలో వివరించడానికి ప్రాంతీయ భాష అవసరం అనేది కొందరి వాదన. కొన్నిదేశాలలో స్పానిష్, జర్మన్ మొదలైన భాషలలో వైద్యం బోధిస్తున్నారు.**

**వైద్య** కళాశాలలో భారతీయ ప్రాంతీయ భాషలో బోధించేందుకు కూడా కొందరు విశ్వప్రయత్నాలు చేశారు. వాస్తవానికి వైద్య పాఠ్యపుస్తకాలను తమిళంలోకి అనువదించడానికి కొన్ని తొలి ప్రయత్నాలు శ్రీలంకలో గతంలోనే జరిగాయి. అంతేగాక, నాలుగు దశాబ్దాలక్రితం 1980వ దశకంలో తమిళనాడుకు చెందిన డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మొదటి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ లలితా కామేశ్వరన్ ఆధ్వర్యంలో కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఆమె మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు అనేక సభ్యుల బృందం విస్తృత కృషి చేసి ఒక ఉద్యమంలా 12,000-13,000 పదాలను తమిళంలో ఏర్పరిచారు. అవి అనువదించబడ్డాయి, ప్రమాణీకరించబడ్డాయి కూడా. అంతేగాక, అవి సాంకేతిక పదాల సమాహారమైన తమిళనాడు ప్రభుత్వం యొక్క 'సూర్కువై' పథకానికి కూడా అందజేయబడ్డాయి.

దీనిపై వైద్యవిద్య బోధనారంగంలో విశేషానుభవం గడించిన తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధా శేషయ్యన్, ప్రభుత్వ వెల్లూరు వైద్య కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎం. జానకిరామ్‌లు తమ అనుభవాలను కూడా పంచుకున్నారు.

డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధా శేషయ్యన్ మాట్లాడుతూ తాను స్పానిష్, జర్మన్ మొదలైన భాషలలో వైద్యం బోధించే దేశాలకు వెళ్లానని, కొన్ని మార్పులతో ప్రాంతీయ భాష బోధనా మాధ్యమంగా ఉండటం సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి నేషనల్ మెడికల్ కమిషన్ విద్యార్థులకు బోధనా మాధ్యమంగా ఆంగ్లాన్ని సూచించడం వల్ల, ఒక విద్యార్థికి ఇంగ్లీష్ అర్థం కాకపోతే లేదా గతంలో ప్రాంతీయ భాషా మాధ్యమంలో చదివినట్లయితే ప్రాంతీయ భాషలో బోధన అనుబంధంగా ఉపయోగపడుతుందన్నారు. గతంలో వైద్యవిద్యార్థి లాటిన్ నేర్చుకోవడం తప్పనిసరి; కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. ఆయా పదాల స్థానే ఆంగ్ల పదాలను ఉపయోగిస్తున్నారని, కనుక ప్రాంతీయ భాషా బోధన కూడా పెద్ద కష్టం అని తాననుకోవడం లేదన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య చదవాలనే ఉత్సాహం అవసరం, దానికి ప్రాంతీయ



వైస్‌ఛాన్స్‌లర్
ఆచార్య సుధా శేషయ్యన్,

భాష అడ్డుకాదని, దానివల్ల కమ్యూనికేషన్ మెరుగు పడుతుందన్నారు. దాని ద్వారా వైద్యులు చాలా అరుదుగా బోధ పరచగలుగుతారనే (బోధపరిచే శక్తి) ఒక ఫిర్యాదు నుంచి బయట పడవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే సాంకేతికపరంగా ప్రామాణికతని పాటించాల్సిన అవసరాన్ని మరచి పోకూడదన్నారు. ఇతర ప్రాంతాలు, దేశాలకి వెళ్ళిన వారు ఆంగ్లం రాకపోయినా అక్కడ నెగ్గుకొస్తున్నారంటే వారికి ఉన్న నైపుణ్యం మాత్రమే కారణమని, కనుక భాష అనేది ప్రజల అభ్యాసానికి అవరోధం కాదన్నారు. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి, వైద్యులకి ప్రస్తుతం ఇంగ్లీష్ వంటి భాష అవసరం. కనుక ప్రజలకు అర్థమయ్యేలా ప్రాంతీయ భాషలో సమాచారం అందుబాటులో ఉండాలని ఆమె అన్నారు. ప్రాంతీయ భాషలో పరీక్ష రాయనవసరం లేదు, కానీ కనీసం రోగుల జ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి మరియు వ్యాధుల పరిష్కారాన్ని అభివృద్ధి చేయడానికి, తాము సదరు సమాచారాన్ని ప్రాంతీయ భాషలో ఉంచడం రాబోయే తరాలకు అవసరమన్నారు సుధా శేషయ్యన్ .

ఈ సందర్భంగా ఆమె తాను విద్యార్థిగా గడిపిన కాలంలో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకున్నారు. తాను మద్రాసు మెడికల్ కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడు, ప్రభుత్వ ఆసుపత్రులలో చేరే రోగులలో దాదాపు సగంమంది తెలుగు మాట్లాడేవారే. ముఖ్యంగా వారితో మాట్లాడటం, వ్యాధి వివరాల సేకరణ, ఫిర్యాదులు, సమాచారాన్ని పొందుపరచడం మరియు వైద్య పరీక్షల వంటి సమయంలో పెద్ద సవాలుగా ఉండేది. అందుకే విద్యార్థులు తెలుగు మాట్లాడటం కూడా నేర్చుకున్నారు. కనుక **రోగులతో వ్యవహరించాలంటే ప్రాంతీయ భాషలు తెలుసుకోవాలి. ప్రస్తుతానికి అడ్డంకులను ఛేదించడంలో ఆంగ్లం ఒక సాధారణ అంశం కావచ్చు, కానీ ఆ తర్వాత ప్రాంతీయ భాషలు**



సహాయ ఆచార్యులు
ఎం. జానకిరాం

**అమలులోకి వస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు.**

ఇప్పటికే వైద్య అధ్యాపకులకు వైద్య విధానంలో సాంకేతికత పై శిక్షణ ఇస్తున్నామని, కనుక ప్రాంతీయ భాషల్లో బోధించేలా శిక్షణ ఇచ్చేందుకు మరింత సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. కానీ వారికి **శిక్షణ ఇచ్చే ముందు పూర్తిస్థాయిలో పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. తాను 34 నుండి 35 సంవత్సరాలు వైద్య విద్యార్థులకు బోధించిన అనుభవంతో భాష యొక్క ప్రాముఖ్యతను గ్రహించానని, సరైన కమ్యూనికేషన్ మరియు అవగాహన కోసం భాష అవసరమన్నది వాస్తవమన్నారు. మెడిసిన్ లేదా సైన్స్ చదువుతున్న వారికి భాషా అధ్యయనం అవసరం లేదని దయచేసి ఎవరూ అనవద్దని ఆమె అభ్యర్థించారు.**

కాగా, ప్రభుత్వ వెల్లూరు వైద్య కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎం. జానకిరామ్ మాట్లాడుతూ గ్రీకు మరియు లాటిన్ వైద్యులు భాషకు సంబంధించినంతవరకు తొలుత విధివిధానాన్ని రూపొందించారన్నారు. అయితే ప్రాంతీయ భాషలను బోధనా మాధ్యమంగా నిర్ణయించే ముందు ప్రతి కోర్సుకు సంబంధించిన ప్రామాణీకరణ సాధనాలను అభివృద్ధి చేయాలన్నారు.

ఒక విద్యార్థి వైద్య కళాశాలలో ప్రవేశిస్తున్నప్పుడు, భాషా సమస్యలు ఎదుర్కుంటున్నాడని, కొంతమంది విద్యార్థులు వైద్య విషయాలను గ్రహించడానికి కష్టడుతున్నట్లు తాము గుర్తించామన్నారు. ప్రామాణిక పాఠ్యపుస్తకాల భాష అర్థం చేసుకోవడం అంత సులభం కాదని, పరీక్షల సమయంలో వారి ఆలోచనలను ఆంగ్లంలోకి తర్జుమా చేయడం చాలా కష్టమని అన్నారాయన. ప్లస్ టు తరగతి వరకు తమిళంలో చదివిన విద్యార్థుల కోసం మెటీరియల్‌ని తమిళంలో అందించే ప్రయత్నం చేశామన్నారు. ఒక వ్యాధి గురించి బోధించేటప్పుడు విద్యార్థులకి అర్థమవ్వడానికి అప్పటికప్పుడు ప్రాంతీయ భాషలో బోధిస్తాం, కానీ అలాంటి అనేక చర్యలు డాక్యుమెంట్ చేయబడలేదన్నారు.

వైద్యవిద్య అంతా పరిశోధనలకు సంబంధించినది కనుక, వైద్య విద్య అంతా పరిశోధనలకు సంబంధించినదని, యుకె ప్రమాణాల ప్రకారం, వైద్యుడు తప్పనిసరిగా సామాజిక శాస్త్రవేత్త, పండితుడు, పరిశోధకుడు మరియు వైద్యుడు అయి ఉండాలని అందువల్ల, మెడికల్ డిగ్రీని పొందిన తర్వాత ప్రతి ఇతర అంశాలను తప్పనిసరిగా డాక్టర్ నేర్చుకుని తీరాలన్నారు. వృత్తిపరమైన అర్హత కోసం ఇంగ్లీష్ అవసరం. ఇది సైన్స్ మరియు మెడిసిన్ యొక్క అంతర్జాతీయ భాష. వైద్య ప్రయోజనాల కోసం ఇంగ్లీష్ అనే కొత్త కాన్సెప్ట్ కూడా ఉంది. అందువల్ల, ప్రాంతీయ భాషలో వైద్య విద్యను తీసుకోవడం విద్యార్థులకు ఎల్లప్పుడూ సవాలుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

కనుక ప్రస్తుతానికి, వైద్య కళాశాలలు బోధనా మాధ్యమంగా ఇంగ్లీషును అంటిపెట్టుకుని ఉండాలి. అయితే విద్యార్థుల ఆసక్తిని బట్టి, ప్రాంతీయ భాషను మంచి అవగాహన మరియు ఆవిష్కరణకు పరిశీలించవచ్చుని, ఒక వైద్యుడు ప్రాంతీయ భాషలో బాగా చెప్పగలిగితే చేస్తే, అది రోగితో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి వారికి సహాయపడుతుందని జానకిరామ్ అన్నారు.

*–ఆగస్టు 12వ తేదీ 'ది హిందూ' ఆంగ్ల దినపత్రికలో ప్రచురించిన ఒక ముఖాముఖీ సంభాషణ ఆధారంగా*

*-కరణం కళ్యాణ కృష్ణకుమార్* 98484 28978 .

# పూలతేరు...!

డా॥ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493



**రం**గురంగుపూల రాశుల బతుకమ్మ
ఆటపాటలందు నలరు చుండ
అందచందములకు నపురూప దృశ్యంబు
చూసితీరవలయు స్ఫూర్తి ప్రదము!

**ప**దతులంతకూడి బతుకమ్మలాడుతు
కనులపండువుగను కాంతులీన
మోదమలరతిరుగ బొడ్డెమ్మ చుట్టును
కొమ్మలంత నవ్వ కోర్కెలమర!

**తే**జరిల్లుచుండు తెలగాణ మందున
మరువలేరు స్త్రీలు మనసు లోన
రాష్ట్రప్రభుత తీరు రమణీయ భావన
పల్లె పట్న ప్రజల పారవశము!

**ప**సుపుతోడజేసి పసిడి గౌరమ్మకు
తీరుతీరుపూల తీర్చిదిద్ది
భక్తిమీర స్త్రీలు బాగుగా కొలువగ
అభయమివ్వుతల్లి నంజలిడుదు!

**బ్ర**తుకునిచ్చునమ్మ బంగారుబతుకమ్మ
స్ఫూర్తి కీర్తినొసగి శుభము లిచ్చు
పువ్వుపువ్వులోన పుట్టెడు పుణ్యము
కలుగజేయు మనకు కలిమి బలిమి!

**మూ**లకారణంబు ముచ్చట్ల పరువడి
ఆడమగలకిలను హాయి నిచ్చు
మధురమైన గాన మంజుల గీతాల
గౌరిమాత కిచ్చు గౌరవంబు!

**బం**గరు బతుకమ్మ భాతి తెలంగాణ
సాలు సాలు సాగు సంబరమ్ము
జలధి దాటి తాను జగమంత ప్రాకుచు
పూజలందుకొనెడి పూలతేరు!

స్పందన

# "భారతీయ లిపి పరిణామ క్రమం"

**అ**మ్మనుడి సెప్టెంబరు సంచికలో రహ్మానుద్దీన్ షేక్ గారు "భారతీయ లిపి పరిణామ క్రమం " అన్న వ్యాసంలో లిపికి సంబంధించి మంచి సమాచారాన్ని అందించారు. వారి నభినందిస్తూ లిపికి సంబంధించి నాకు తెలిసిన విషయాలను క్లుప్తంగా రాస్తున్నాను.

భావ వ్యక్తీకరణ కోసం మానవుడు ఒక క్రమ పద్ధతిలో ఉపయోగించే ధ్వనుల సముదాయం భాష. భాషలు ఏర్పడ్డ తర్వాత కొన్ని వేల సంవత్సరాలకు లేఖనవిధానం వచ్చింది. భాషకూ లిపికీ సంబంధం లేదు. ఏ భాషనైనా ఏ లిపిలో నైనా రాయవచ్చు. ఒక భాషకి ఒక లిపి పారంపర్యంగా వాడుకలో స్థిరపడిరది.

ఏ భాషకైనా లిపి అసమగ్రమైనది. కొన్ని ధ్వనులకి ప్రత్యేకమైన లిపి లేకపోవడం, ఒక ధ్వనిని రెండు మూడు రకాలుగా సూచిండం, రెండు మూడు ధ్వనులకు ఒకే అక్షర సంకేతం వాడడంవంటి కొన్ని లోపాలు లేఖనంలో ఉన్నాయి.

లిపిలోని ఈ లోపాలను నివారించడంకోసం 1885లో ఫ్రాన్సులో కొద్దిమంది అధ్యాపకులతో అంతర్జాతీయ ధ్వని సంస్థ (International Phonetic Association) ఏర్పడిరది. ఈ సంస్థవారు అన్ని భాషలకూ అన్వయించే విధంగా ఒక లిపిని తయారు చేశారు. ఈ లిపిని అంతర్జాతీయ ధ్వని లిపి (International Phonetic Alphabet) ఐ. పి. ఎ. అంటారు.

ఐ. పి. ఎ. రూపొందించడంలో భాషా శాస్త్రజ్ఞులు పాటించిన నియమాలు. 1. ఒక్కొక్క ధ్వనికి ఒక్కొక్క చిహ్నమే వాడాలి. 2. సాధ్యమైనంత వరకు కొత్త చిహ్నాల్ని కల్పించకుండా యూరోపియన్ భాషలకున్న లిపినే వాడాలి. 3. ఐ. పి. ఎ. చిహ్నాలు రాతకు, ముద్రణకు, టైపు చేయుటకు వీలుగా వుండాలి. 4. దీర్ఘం, మహాప్రాణం, ముక్కుతో పలికే ధ్వనులు మొదలైనవాటికి ఉప చిహ్నాలు వాడవచ్చు.

ఐరోపాలోని చాలా భాషలకు రోమన్‌లిపి వాడుకలో వుంది. అందుచేత ఐ. పి. ఎ. రాయడానికి రోమన్ లిపిని ఉపయోగించారు. రోమన్ (ఇంగ్లీషు) లిపిలో 26 అక్షరాలు మాత్రమే ఉన్నాయి. చిన్న అక్షరాలు పెద్ద అక్షరాలు ఒకే ధ్వనిని సూచిస్తున్న కారణంగా 26 చిన్న అక్షరాలను మాత్రమే గ్రహించారు. రోమన్ వర్ణమాలలో లేని ధ్వనులను సూచించడానికి గ్రీకు వర్ణమాలలోని అక్షరాలు స్వీకరించారు. దీర్ఘానికి రెండు చుక్కలు (:) గాని అక్షరంపైన గీత గాని వాడతారు. మహాప్రాణాలు (ఒత్తక్షరాలు) రాయడానికి హల్లు పక్క **h** చేర్చడం రివాజు. ఒక ధ్వనికి ఏ రకం సంకేతం వాడినా అదే నియతంగా వాడడమూ, ఈ సంకేతం ఈ ధ్వనికి సూచకం అని మొదట్లో నిర్వచించడం అవసరం.

"ధ్వని లిపిని ఉపయోగించుట వలన భారతదేశంలోని విభిన్న భాషలను, మాండలికాలను తొలగించలేకపోయినప్పటికీ విభిన్న లిపులను తొలగించవచ్చు." అని గిడుగు రామమూర్తి గారు1931లోనే అన్నారు.

రామమూర్తిగారి కాలానికి తెలుగు టైపు రైటరు లేదు. ఐ. పి. ఎ. రాయడానికి ఇంగ్లీషు టైపు మిషను గూడ ఉపయోగపడదు. కొన్ని గ్రీకు అక్షరాలు కావాలి. కొన్ని వేరువేరు గుర్తులు కావాలి. కాబట్టి ఐ. పి. ఎ. లో టైపు చెయ్యడానికి ప్రత్యేకమైన టైపు మిషను కావాలి.

ఇండో యూరోపియన్ భాషలలో మూర్థన్యాలు (ట, డ, ణ, ళ ) లేవు. ద్రావిడ భాషలలో" ఉన్నాయి. 'ట, డ, ణ, ళ' లు రాయడానికి భాషా శాస్త్రవేత్తలు **t, d, n, l** అక్షరాల క్రింద చుక్క పెడతారు. సాధారణ టైపు మిషనులో ఇది సాధ్యం కాదు. అందుచేత పెద్ద అక్షరాలు **(T, D, N, L)** వాడుతున్నారు. ఇప్పుడు కంప్యూటర్లు వచ్చిన తరవాత ఏ లిపిలోనైనా సులభంగా టైపు చేసుకోవచ్చు,

తెలుగు లిపి చాలా వరకు ధ్వని విధేయంగా వుంటుంది. తెలుగు భాషకు 56 అక్షరాలు ఉన్నాయి. అంతేగాక దేవనాగరి లిపిలో లేని అక్షరాలు గూడ తెలుగు లిపిలో వున్నాయి. కొత్తగా రెండు, మూడు అక్షరాలు సృష్టించుకొంటే ఈ లిపిలో ఏ భాషనైనా రాసుకోవచ్చు.

**'భారతీయ లిపి పరిణామ క్రమం'**
**అన్న వ్యాసంలోని విషయాల గురించి:**

1. "పురాతన కాలంలో లిపి అవసరం మత పరమైన విషయాలకు, రాచరికపు శాసనాలకు పరిమితమైన అంశంగానే పెరిగింది. సామాన్య ప్రజలు మాట్లాడే భాషలోని అన్ని శబ్దాలకు ఈ లిపులలో అక్షరాలు ఉండకపోవచ్చు. తెలుగు సంగతీ అంతే. రోజూ పలికే మాటలకు తెలుగులో అక్షరాలు లేవు." అని రహ్మానుద్దీన్ షేక్ గారు రాశారు. వారి పరిశీలన ఎన్నదగ్గది.

భాషలో చాలా ధ్వనులుంటాయి. వీటినన్నిటినీ లిపిలో చూపడం సాధ్యపడదు. అందుకే అర్థభేదక సామర్థ్యం లేని ధ్వనులను అన్నిటినీ కలిపి ఒక సరాసరి ధ్వనిగా పరిగణించి దానిని "వర్ణం" అన్నారు. వర్ణాలకు మాత్రమే అక్షర సంకేతం ఇస్తారు. "చలి చీమలు' అన్న పదాలను గట్టిగా చదవండి. మొదటి 'చ' కు రెండవ 'చ' ధ్వనిలో మార్పు కనిపిస్తుంది. మీ నాలిక నోటిలో ఏ భాగాన్ని తాకుతుందో పరిశీలించండి. మొదటి 'చ' దంత్యం. రెండవ 'చ' తాలవ్యం. దంత్యం తాలవ్యంబులగు "చ, జ" లు సవర్ణంబులు. అలాగే 'తాత' అన్న మాటను పలకండి. మీ నాలిక నోటిలో ఏ భాగాన్ని తాకుతుందో పరిశీలించండి. మొదటి 'త' కు రెండవ 'త' కు ధ్వనిలో స్వల్ప మార్పు కనిపిస్తుంది. కాని రెండు 'త' లు రాయడం లేదు కదా? పూర్వులు కొందరు 2 'చ'లు, 2 'జ' లు రాసేవారు. ప్రామాణిక తెలుగు భాషలో ధ్వనులు 56 కంటే ఎక్కువే వుంటాయి. గాని వర్ణములు 56 గానే సూత్రీకరించారు.

**2. ఫొనెటిక్ లిపి:** "ఇంగ్లీషువారు స్పెల్లింగులతో తికమక పడకుండా ఉచ్చారణ నేర్పే సమయంలో ఈ ఫొనెటిక్ లిపినే వాడతారు."

అన్నారు రహ్మానుద్దీన్ షేక్ గారు. ఇంగ్లీషువారు ఇంగ్లీషు ఉచ్చారణ ఎవరికి నేర్పుతారు. ఇంగ్లాండులోని పిల్లలకా? విదేశీయులకా? స్పష్టత లేదు. ఉపాధ్యాయ శిక్షణలో ఇంగ్లీషు బోధనా పద్ధతులు బోధించేటప్పుడు అంతర్జాతీయ ధ్వని లిపి (ఐ. పి. ఎ.) నేర్పుతారు. నేడు తరగతి గదులలో ధ్వనిలిపి ఉపయోగించడం లేదు.

గిడుగు రామమూర్తిగారు 1917లో విజయనగరం మహారాజావారి కుమారులకు ఇంగ్లీషులో సంభాషించడం నేర్పుతూ ధ్వని విధేయంగా రాసుకొనేందుకు వీలుగా ఐ. పి. ఎ. నేర్పేరు. ఈ కొత్త పద్ధతి మహారాణిగారికి నచ్చలేదు. పాత పద్ధతిలో ఇంగ్లీషు బోధించుమన్నారు. శ్రేష్టమైన పద్ధతిని వదులుకోని రామమూర్తిగారు తమ ట్యూటర్ పదవి వదులుకొన్నారు.

**3. లిప్యంతరీకరణ అవసరమా?**

ఇక్కడ మనం గ్రహించవలసినది ఏమిటంటే రోమన్ లిపిలో వున్న దానిని తెలుగు లిపిలోకి మార్చడం. లేదా తెలుగు లిపిలో వున్న దానిని రోమన్ లిపిలోకి మార్చడం. ఏ లిపిలోనైనా రాసిన దానిని చదువుకోడానికి శిక్షణ అవసరం. ఫ్రెంచివారు, జర్మనులు రోమన్ లిపి వాడుతున్నప్పటికీ చదువుతున్నప్పుడు తమ భాషనే చదువుతున్నామనే భావనలో ఉంటారు. కొన్ని కరపత్రాలలో వివిధ ఐరోపా భాషలలో విషయం రాస్తుంటారు. అవి అన్నీ రోమన్ లిపిలోనే వుంటాయి. విషయం ప్రారంభంలో గాని చివరగాని ఫ్రెంచ్ అనో జర్మన్ అనో రాస్తారు. చదివేవారు తాము ఏ భాష చదువుతున్నామో తెలుసుకొని చదవడం ప్రారంభిస్తారు. అక్షరాలు ఇంగ్లీషువే కాని ధ్వనులు వేరు వేరు. తెలుగు భాష వచ్చి తెలుగు అక్షరాలు చదవడం రానివారు రోమన్ లిపిలో రాసుకోవచ్చు. రాతలో ఒక నియతి లేకపోతే ఎవరి రాత వారిదే. తెలుగు భాషను రోమన్ లిపిలో ఎలా రాసుకోవాలో తెలిపే వ్యాసం సెప్టెంబరు 2021 లో వుంది. అక్టోబరు 2021 పట్టిక రూపంలో వుంది. పరిశీలించ గలరు.

**4. వీవెన్ గారు రూపొందించిన లేఖిని** (lekhini.com) **గురించి.**

**మొదటి బాక్సులోని విషయం**

ఎడమవైపు వున్న బాక్సులో విషయం:

mee telugu saMdeSam, iMglish spelluMgulato

కుడివైపు వున్న బాక్సులో విషయం:

మీ తెలుగు సందేశం, ఇంగ్లీషు స్పెల్లింగులో

**మరొక చిన్న బాక్సులోని విషయం**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ |
| a | A, aa, | i | I, ee, ii, | u | U, uu, oo |

ఎ ఏ ఐ ఒ ఓ ఔ

**మరొక పెద్ద బాక్సులోని విషయం**

ప్రపంచవ్యాప్తంగా రోమన్ ఆధారిత

prapaMchavyaaptaMgaa rOman^ aadhaarita

ఫొనెటిక్‌లిపిలో మనిషి చేయగల అన్ని

phoneTik^ LipilO manishi cheeyagala anni

శబ్దాలను పరిగణించి, ప్రతి శబ్దానికి

Sabdaalanu, parigaNiMchi, prati Sabdaaniki

అక్షరం ఉండేలా ఆ ఫొనెటిక్ లిపిని

aksharaM uMdeelaa aa phoneTik^ lipini

రూపొందించారు.

roopoMdiMchaaru

**4. పరీక్ష :- లేఖిని సాఫ్ట్‌వేర్ పనితనాన్ని చూద్దాం**

ఈ క్రింది వాక్యాన్ని **లేఖిని** లో లిప్యంతరీకరణ చేసి చూడండి.

**"చెల్లి పెళ్ళికి మీరూ, మేమూ, మూర్తి, మోహన్, ఓబులేసుగారి ఊరికి ఐదు టాక్సీలలో వెళ్దాం. ఔనా!"**

ధన్యవాదాలు

డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖరరావు
9949605141

గమనిక: ఈ నెల రహ్మానుద్దీన్ షేక్ రచన

భాషకు, లిపికి ఉన్న బంధం ఏమిటి?-3

భారతీయ లిపి పరిణామక్రమం

అనివార్య కారణాల వల్ల ప్రచురించలేకపోతున్నాము.

వచ్చే నెలనుండి కొనసాగించగలము.

**16వ పుట తరువాయి...**

## తెలంగాణ తెలుగు.....

నిధులు, నియామకాలు అనే అంశాలతో పాటుగా తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ భాష కూడా ముఖ్యమైన పాత్రను పోషించినట్లుగా, తెలంగాణ తెలుగులో వచ్చిన సాహిత్యం కూడా అంతే ముఖ్యమైన పాత్రను పోషించింది. ఇలా తెలంగాణ తెలుగులో లేదా తెలంగాణ యాసలో వచ్చిన సాహిత్యం, అది పాటల రూపంలో కావచ్చు, కవిత్వ రూపంలో కావచ్చు, కథల రూపంలో కావచ్చు, అది తెలంగాణలో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇలా తెలంగాణ తెలుగులో వచ్చిన సాహిత్యం అందరి దృష్టిని ఆకర్షించడానికి కారణం అందులో తెలంగాణ జీవన విధానం, తెలంగాణ గోస ఉండటంతో పాటుగా, తెలంగాణ తెలుగులో వచ్చిన సాహిత్యం సాధారణంగా వాడుక భాషలో వచ్చిన సాహిత్యంలా ఉంటుంది కాబట్టి, ఇతర ప్రాంతపు తెలుగు పలుకుబడులలో వచ్చిన సాహిత్యం కంటే తెలంగాణ తెలుగు ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షించింది అని చెప్పవచ్చు. ఒకప్పుడు కొన్ని రాజకీయ, ప్రాంతీయ విభేదాల కారణంగా తెలంగాణ తెలుగు పై కొంత వ్యతిరేకత ఉండేది అనేది వాస్తవం. కానీ ఇప్పుడు అలాంటిది లేదు. మెల్లమెల్లగా తెలంగాణ తెలుగుపై అందరి వైఖరీ మారుతోంది. అందుకే ఇప్పుడు తెలంగాణ తెలుగులో లేదా తెలంగాణ యాసలో వచ్చిన సాహిత్యమూ, పాటలూ తెలంగాణేతర ప్రాంతాలకు కూడా చేరుకుంటున్నాయి. ప్రస్తుతం తెలుగు వాడుకకు మరో కేంద్రంగా కాదు, హైదరాబాదే ప్రధాన కేంద్రంగా మారుతున్న పరిస్థితులు కనబడుతున్నై.

- వ్యాస రచయిత పరిశోధక విద్యార్థి
హైదరాబాదు విశ్వవిద్యాలయం

వావిలాల సుబ్బారావు
98664 02973

# కా.రా. గారి కథాతత్వం



**కాళీపట్నం రామారావు (కా.రా.)**
కనువెలుగు: నవంబరు 9, 1924
కనుమరుగు: జూన్ 4, 2021

"ప్రపంచచరిత్రలో 'బోల్షివిక్' విప్లవం ఎట్లాంటిదో "తెలుగు సాహిత్యంలో 'కారా' కథలు రావటం అట్లాంటిది" అని ఒక పెద్దాయన అన్నారు. నిజంగా అది సరైన ఉపమానమేనని నేటికీ అనుకుంటాను. హింస ఉన్నా సరే, ద్వేషం లేని విప్లవం రావాలని మాస్టారు ఆశించారని గూడ నాకనిపిస్తుంది.

కదిలించే రచయితలు అందరిమీద కాస్తో కూస్తో విమర్శలుంటాయి. వాటికి సమాధానాలు గూడా ఉంటాయి. సమాధానాలు లేని ప్రశ్నలంటూ ఉండవన్నారు కొందరు తాత్వికులు. ముందే సమాధానం ఉంటుంది, అది దొరకకనే ప్రశ్న పుడుతుంది" అన్నారు మరికొందరు. అట్లాగే విమర్శలకూ సమాధానాలుంటాయి. సమాధాన పడటం పడకపోవటం వారి వారి యిష్టాలు.

కా.రా గారి మీద విమర్శలకు ఎందరు సమాధానం చెప్పినా – విమర్శలోను కొంత సమంజసం ఉంటుంది. చెప్పిన సమాధానంలోను కొంత తర్కబద్ధత ఉంటుంది అయినా ఏ పక్షంవాళ్లు ఆ పక్షానే ఉంటారు. అంగుళమయినా కదలరు. ఎందుకంటే మనం ఉన్నచోటనే ఉండదలచుకున్నాము గనుక. సమాజంలోని అసమత్వానికి విషమత్వానికి సర్వామోదమయిన సమాధానం ఎందువల్ల రాదో, అందువల్లనే కారా కథలకుగూడా పరిష్కారం దొరకదు. పరిష్కారాలు ఆచరణ వల్ల వస్తాయిగాని చర్చల వల్ల రావు. ఏది ఆచరణీయమో అదే నాకు సత్యం అన్న గాంధీగారి తీర్మానం నాకు నిజమేననిపిస్తుంది.

బడుగుజీవుల సమాజమంత విస్తృత కథాలోకాన్ని నిర్మించిన సమకాలిక మహా రచయిత కా.రా. మాష్టారు. సామాజిక ధర్మం మారవలసివచ్చినపుడల్లా ఆ అవసరాన్ని నిశ్చయం చేస్తూ, మానవ జీవితాల్లో ఆ అవసరాల అడుగుజాడల్ని 'ఫోరెన్సిక్ వాచ్' తో పరీక్షలు చేసి నిరూపించగలడు మహారచయిత. అతని రచన మహాగ్రంథం. సమాజ అవసరమే మహా రచనలకు పురుడు పోస్తుంది. మానవ అవసరమే మహా రచనలకు పురుడు పోస్తుంది. నూతన అవసరాలకు నూతన గ్రంథాలు వచ్చినా పూర్వ మహాగ్రంథాలకున్న, వాటి గౌరవ స్థానం చెదరరు. – మే నెలలో పూచిన 'మల్లెపూల' గౌరవం డిసెంబరు 'బంతిపూల' వల్ల చెరగదు. సమాజం వేసిన ముందడుగులో అవ్విజయస్థంభాలు.

అందుకనే భారత రామాయణాలను ఉంచే నా పుస్తకాల అల్మైరాలో ఖలీల్ జిబ్రాన్, కన్యాశుల్కం, మహా ప్రస్థానం, కారా కథలు పెద్ద సంపుటి ఉంచుకుంటాను.

భారతం ప్రక్కన వీటికి చోటేమిటి అంటే– అవి ప్రకటించిన ధర్మాలు స్వభావం వేరయినా, యుగ సంధులలోని నూతన ధర్మానికి అవి వేగుచుక్కలు. నిశ్చల నిశ్చితాన్ని యిచ్చిన రచనలు. మారుతుండే సమాజానికి శాశ్వత ధర్మాలంటూ ఉండవు.ఒక్కొక్క కాలానికి ఒక్కొక్క మహారచన అవసరం అవుతుంది. ఆనాటికి భారతంలాగ, ఈ నాటికి వచన సాహిత్యంగా కారా కథలు. 'కారా కథలు' అధోజగజ్జన భారతం.

ఇన్ని వేల సంవత్సరాల భారతీయ జీవనరీతి 20 వ శతాబ్ది ప్రారంభంలో పునరాలోచనలో పడ్డది. అందుకు తొలి ముందడుగులు 'గోదావరి'కి ఉత్తరాన పడ్డాయి. కందుకూరి, గురజాడ, గిడుగులు ముందు నడచి, త్రోవ చూపారు. భాషను సమకాలీనంచేసారు గిడుగు. 'శిష్ట' అనే విశేషణం ఒకటి చేర్చి వ్యావహారిక భాషాప్రామాణికతను ఒక హద్దును సూచించారు కాని అక్కడే ఆగి పోవాలని భావించలేదు. మరికొంత వ్యావహారిక వాసన భాషకు కూర్చిన 'చలం'గా 'శశిరేఖ' నవలకు ముందుమాట వ్రాసి అభినందించారు.

'రెండవ సహస్రాబ్ది ముగింపు కాలంలో 'కాళీపట్నం'వారు భాషను దాని దారిన దానిని పోనిచ్చారు ప్రాంతీయతా లక్షణం, వర్గ లక్షణం గూడా అద్ది సాహిత్యస్థానం యిచ్చారు. కన్యాశుల్కంలో పాత్రోచితంగా ఆగిన మాండలికత 'రా.వి.శాస్త్రీ, 'కారా' గార్లతో ప్రధాన స్థానం ఆక్రమించింది. ఇప్పుడు ఆమోదాన్ని పొంది స్థిరపడ్డది. ఇది గూడ ఉత్తరాంధ్రలోనే జరగటం గుర్తించ దగిన అంశం. గురజాడ గిడుగుల తర్వాతి ముందడుగులు రావి శాస్త్రి, కారా మాష్టారు గార్లని భాషలోనే కాదు – ఆశయంలో గూడ.

'కా.రా' మాష్టారు ఆచి తూచి వ్రాసిన రచయితే గాని వ్రాయటం ఒక అలవాటుగా మారిన రచయిత కాదు. వారి రచనా జీవితంలో వ్రాయని సంవత్సరాలే ఎక్కువ. తన 'ఆర్తి'కి తగిన 'యజ్ఞం'కోసం ఆగేవారు. వారికి ప్రతిష్ట తెచ్చిన కథలు ఒక పాతికకన్నా ఎక్కువ ఉండవనుకుంటాను.

మన పాఠకులుకు, విమర్శకులకు ఒక అలవాటు ఉంది. మీరే ఇంక వ్రాయండి, ఇంకా ముందుకు తీసుకెళ్లండి అని సతాయించటం,

'చలాన్నీ' ఈ మాటే అన్నారు. ఎంతో ఇంకా ఎంతో వ్రాసి ఇంకా ఉద్ధరించవలసిన వాడు కాస్తా ఆశ్రమ వాసంలోకి వెళ్లిపోయాడని. 'కారా' మాష్టార్నీ ఆ మాటే అన్నారు. కథా నిలయంలో కూరుకుపోయినాడు అని, కథలతోనే విప్లవం వచ్చేటట్లయితే ఇప్పటికి వ్రాసిన కథలు చాలు. ఇంకా ఎన్ని కథలు వ్రాస్తే పడక కుర్చీలో నుండి లేచి నడుంకట్టి రోడ్డు మీదకు వస్తారట! చదివే పాఠకులకు వ్యసనం ఉందిగాని – వ్రాసే మాష్టారికి వ్యసనం లేదు.

అంతమాత్రాన ఈ రచయితలు వ్రాసిన దానితో తృప్తిపడ్డారని కాదు. సాఫల్య దిశగా సమాజం ప్రయాణం చేస్తేనే వాళ్లకు తృప్తి. ఎందుకంటే ఇవి కదిలించటం కోసం వ్రాసిన కథలు గనుక.

కా.రా. గారు మినహాయింపులులేని కమిటెడ్ రచయిత– ఆ నిబద్ధత ఎట్లా ఉంటుంది – అంటే స్థిరమయిన ప్రాపంచిక దృక్పథం లేనిదే గొప్ప కథలు రావని 'కా.రా'గారు నమ్ముతారు. అట్లానే శిల్పప్రధానమయిన కథలు మీద తనకు గొప్ప అభిప్రాయం లేదు. భావం సరిగా చెపితే శిల్పం దెబ్బతిన్నా పరవాలేదు. శిల్పంవల్ల పాఠకునికి ఒరిగేదేమి లేదు అని ఖరాఖండీగా చెపుతారు. మరో సంగతి తాజమహల్ కన్నా తనకు ఆనకట్టలే అందంగా కనిపిస్తాయంటారు. ప్రయోజనమే సౌందర్యమని మాస్టారు తెగేసి చెపుతారు.

ఇట్లాంటి వారు రచనలను ఆనందంకోసం కాదు చదవటం. మళ్లీ మళ్లీ ఆందోళన పొందటం కోసం చదువుతాం. నిద్రను వొదిలించుకోవటం కోసం చదువుతాం. అయినా మళ్లీ నిద్రపోవడం మన స్వగుణం . కదలటం ఇష్టంలేని వాళ్లు మళ్లీ చదవక పోవచ్చు, చదవలేక పోవచ్చుకూడ.

కారాగారి కథలనుండి మనకు కలిగే కలవరం ఏదుష్ట పాత్రవల్లనో, దురదృష్ట సంఘటన వల్లనోకాదు. చెడ్డ పాత్రలు వీరి కలం నుండి రాదు అందరూ మంచివాళ్లే. సానుభూతికి పాత్రులే. ప్రతి పాత్ర స్వభావము, మాటలు అన్నీ సమంజసాలే. అయినా ఏమి చెయ్యలేని పీడన, తీర్చలేని దుఃఖం, తిరగబడక తప్పని అనివార్యత, చేతకాకపోతే దొంగతనమో, తరతరాల్ని చంపుకోవటమో ఈ కథల్లో ఆవరించి ఉంటాయి.

తిరగబడ వలసింది వ్యక్తి మీదకాదు. వాళ్లు కూడా దుష్టసమాజంలో ఇరుక్కుపోయిన వాళ్లే. సమాజవ్యవస్తే దుష్టం. దాని నిర్మాణమే వక్రం అని స్ఫురిస్తూ ఉంటుంది. సమాజం ఇట్లానే ఉంటే, మనుషులందరు వ్యక్తిగతంగా మంచివాళ్ళు అయినా సరె, అడుగున ఉన్నవాడి దుఃఖం అట్లాగే ఉండిపోతుంది. బరువులుమోసే గాడిదమీద గంధపు చెక్కలు, బంగారం ఇటుకలు వేసినా. అది మించిన బరువు అయితే నడుము విరిగేది గాడిదకే. అప్పుడు గాడిద ఏంచేస్తుంది ! ఒక గంధపు చెక్కనో, ఒక బంగారు ఇటుకనో కాకుండా మొత్తం బరువును తిరగదోసి పోతుంది. కనుక, 'కా.రా' గారి కథల్లో తిరగదొయ్యవలసిన సమాజామే కనపడుతుంది. కాని, చంపి ప్రతీకారం తీర్చుకొన వలసిన పాత్రలు కనిపించవు.

అన్ని పాత్రలను మంచిగానే చిత్రిస్తాడని కొందరు, ఇలా చేయటంకన్నా తప్పుడు వ్యవహారం ఉండదని ఇంకొందరు అన్నారు. ఎవరి మూస నుండి వారు, ఎవరి స్థిరవాదం నుండి వారు వాదిస్తారేగాని, రచయిత కోణం నుండి సమాజం ఏమిటో అని చూడరు గదా! మన కలతలను రచయితకు పట్టించటం విమర్శలో సరయిన దృష్టికాదేమో. ఎందరి దృష్టులకు మతిపోయేటట్లు రచయిత వ్రాయగలడు. రచయిత తాత్విక వ్యక్తిత్వాన్ని పరామర్శచేయటమే సబబు.

మానవుడు పుట్టుకచేత మంచివాడేగాని పాపికాదు. సమాజ నీతిలోనే పాపం ఉంది. వర్గ నీతినే గాని వర్గంలోని వ్యక్తులను ద్వేషించనక్కర లేదని కా.రా గారిచూపు అయి ఉండవచ్చు.

యజ్ఞ కథ గురించి కొంతయినా, ప్రస్తావించుకోవాలి. 'యజ్ఞం' కథ గురించి విమర్శాయజ్ఞమే జరిగింది. ఎవరికి తోచిన సమిధలు వాళ్లు వేశారు. ఇది అసమర్ధమయిన రచన అన్న బలమయిన వాదం గూడా ఒకటి ఉన్నది. అంతే బలంగా కథను సమర్ధించిన వాళ్లు ఉన్నారు. విమర్శను తట్టుకొని నిలువగల శక్తి కథకు ఉంది. అది సమర్ధనల వల్ల రాలేదు. 'కా.రా' గారు వీటిమీద నోరు విప్పలేదు అనుకుంటాం. 'యజ్ఞం' కథే నోరువిప్పి నిలుచుని తన అస్థిత్వంతో విమర్శకుల్ని గెలిచింది.

చెడ్డ పాత్రలులేని, మంచి పాత్రల సంఘర్షణ నుండి గూడ గొప్పరచనలు పుడతాయి. బహాశా అవే గొప్పరచనలు కావచ్చు. 'ముద్రారాక్షసం' నాటకంలో ఎవరు చెడ్డవారు? 'శాకుంతలం'లో ఎవరు దుష్టుడు. ఉద్దేశ పూర్వక దుర్మార్గం ఎవరిలోనులేదు. ఎవరితో నాశనం చేయాలన్న సంకల్పం ఎవరికీలేదు. ఉత్తర రామాయణంలో ఎవరిని నిందిస్తాం! 'కారాగారి' కథల్లో కూడా అంతే. సమాజాన్ని నడుపుతున్న దుష్టనీతి వైపు, కాలం చెల్లిన విలువలను పట్టుకువ్రేలాడే యధాతథస్థితి స్వభావం వైపు –ఈ కథలు పాఠకుని మనసును మళ్ళిస్తాయి.

మనుషులందరు ఆనాటి నీతి మేరకు మంచివాళ్లే. అయినా అట్టడుగు జగువారి దుఃఖం తీరేది కాదు. కనుక సమాజనీతి మీదనే గురిపెట్టాలి. వ్యక్తుల మీద కాదు. మాష్టారి రచనల్లో కనిపించని కరుణ రాశి ఉంది. పీడిస్తున్న వ్యక్తులు గూడ చెడ్డ సమాజం నుండి తెలియకుండా పుట్టినవాళ్లే. 'అప్పల రావుడి'కి 'శ్రీరాములు నాయుడు' మీద గాని 'గోసన్నా' మీద గాని ద్వేషంలేదు. ద్వేషంలేని తిరుగుబాటును రచనల్లో ప్రేరేపిస్తారు కాళీపట్నంవారు. అది హింసలేని తిరుగుబాటుకాదు. ద్వేషం మాత్రమే లేని తిరుగుబాటు అని గుర్తించాలి.

'అప్పల రాముడు' మాల అతను. 'యజ్ఞం' కథలోని సమస్య అస్పృశ్యతకాదు. అప్పు ఇచ్చిన వాడు పుచ్చుకున్నవాడి మధ్య సమస్య. అయినపుడు కులం ప్రస్తావన ఎందుకు! అంటే – దుష్టనీతికి తోడు వీళ్ల మీద అణగారిన కులం పీడన అదనపు భారం అయింది అనటానికే. పై కులాలకు సాటి వాళ్లను ఆదుకొనే శక్తి ఉంది. వీళ్లకు అదికూడా లేదు అని చెప్పాడు.

గాంధీగారి సిద్ధాంతాలుగూడ నిరుపయోగమని ఇందులో తేల్చారు. ఉన్నవాడిని ఉత్తముడుగా చిత్రించటానికి 'ధర్మకర్తృత్వ' సిద్ధాంతం ఉపకరిస్తుంది. అతని వ్యక్తిత్వ గౌరవాన్ని పెంచుతుంది.

"అమ్మా! నీ భాష కావాలి నిప్పులు చెరగటానికి చెమటను జల్లెడపట్టి సంపదలను తీయటానికి తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి మాతృభాష కావాలి" **–ఛాయరాజ్** ('మాతృభాష'– కవిత)

లేని వాణ్ణి అది ఉద్ధరించకపోగా కృతజ్ఞతా భారం అతణ్ణి కుంగతీస్తుంది. అని 'అప్పల రాముడి పాత్ర భంగ్యంతరంగ చెపుతుంది.

ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూడని తిరుగుబాటు ఒకటే మార్గమని 'కారా'గారి సూచన అనుకుంటాను, పీడితులు తిరుగుబాటు చేయాలి. ప్రత్యామ్నాయాన్ని సమిష్టి సమాజం వెతుక్కుంటుంది. భారంమీద తిరగబడటమే మోసేవాడి కర్తవ్యం. అని కారాగారు తీర్మానించినట్లు నాకు తోస్తుంది.

రచయిత ఎవరి పక్షాన నిలబడ్డాడనేది ప్రధానం అంటున్నారు కొందరు. అంత మాత్రం చాలదు. ఏ కోణం నుండి ఆ పక్షాన్ని ప్రదర్శిస్తున్నాడనేది గూడ ముఖ్యమే. 'చలం'గారు దళిత స్త్రీల పక్షాన నిలచినట్లున్న కథలు కొన్ని ఉన్నాయి. అందులో చలం కోణమే ఉంది.

'కారా' గారి 'నో వెకెన్సీ' కథలో నిమ్న వర్గాలకు కడుపునిండా తిండి లేకుండా చేయటం ఒకటే కాదు. స్త్రీ పురుష సంబంధాలలో మనసయిన అనుభవం గూడా దూరం అవుతుందని, రచయిత చిత్రించి, కొట్టదలచిన దెబ్బలనన్నింటినీ 'దేవుడు' పాత్రకు తగిలించారు.

'కుట్ర' కథలో ఈ వ్యవస్థా నిర్మాణంలోనే కుట్ర ఉంది అని రచయిత అంటారు. కాని ఏ వ్యవస్థ అయినా కుట్రతో నిర్మాణం కాదు. ప్రయోజనాల కోసం నిర్మాణం అవుతుంది. దాన్ని కొందరు శక్తిమంతులు స్వాధీనం చేసుకుంటారు. నిజానికి వ్యవస్థా నిర్మాణం వారికోసం జరగదు. ఏనాటికి వ్యవస్థ అయిన ఉన్న చోటు నుండి కొంత మాత్రమే ముందుకు నడిపిస్తుంది. మరికొంత ముందడుగు కోసం పునర్నిర్మాణమో, సద్దుబాట్లో తప్పవు. ఒకసారి పెద్ద పెద్ద అంగలు వేయటం సాధ్యంకాదు. ఉన్న వ్యవస్థకు కాలం చెల్లించిన తర్వాత దాన్ని వొదిలించుకోకపోతే అది నిరుపయోగం మాత్రమే కాదు. దుర్వినియోగం అవుతుంది. ఆ దశలో అది కుట్రగా కనిపిస్తుంది. కాని అది గత వ్యవస్థకున్న దురుద్దేశం కాదు.

సర్వకాల సదాశయాలు అంటూ ఉండవు. ఒక నాటి సదాశయాలు కాలం పురోగమించి వ్యర్థాశయాలుగానో దురాశయాలుగానో మారవచ్చు 'కుట్ర' కథలో చేసిన ఆలోచనలకన్న 'యజ్ఞం'లో చెప్పినదే ఎక్కువ సమంజసమయిన ప్రతిపాదన అనిపించింది.

'యజ్ఞం' కథ శంకారహితమయినది అని కాదు. మహాభారతంలోని శంకలు ఈ నాటికీ కొనసాగుతున్నా, వాటికి అతీతంగా భారతం చిరంజీవి అయినట్లు 'యజ్ఞం'కథ కూడా చిరంజీవే.

'యజ్ఞం' కథలో గాంధీగారి ధర్మకర్తృత్వ సిద్ధాంతానికి, వ్యక్తిగత ఔదార్యానికి 'శ్రీరాములు నాయుడి' ప్రతినిధి చట్టం అంగీకరించినా వడ్డీ వ్యవస్థకు గోపయ్య దగాపడ్డ దిగువ వర్గాలకు 'అప్పల రాముడు' చిహ్నాలు 'ఔదార్య' స్వభావాన్ని తప్పు పట్టలేదు. అయన గొప్ప యజ్ఞమే చేసాడు. సంకల్పం సరిగానే ఉంది. కాని యజ్ఞఫలం మాత్రం సంకల్పం ప్రకారం క్రింది వాళ్లకు అందలేదు. అది దక్కనివాళ్లు సమిధలయినారు. వారి ఆక్రోశమే 'యజ్ఞం' కథ.

ఈ కథలో ముగింపు చాలా కలవరం రేపింది. నాకు కూడా కడుపులో తిప్పింది. నిదానించి చూస్తేకాని కళ్లు తెరిపిడి పడలేదు.ఇప్పుడు నేను యజ్ఞంలో ప్రతి వాక్యాన్ని సమర్థిస్తాను.

'యజ్ఞం-' 'ఆర్తి'- 'చావు' ఈ మూడు కథలే చాలు. ఏ అవార్డు అయినా ఇవ్వవచ్చు. మహాకథకుడు 'కా.రా' మాష్టారికి ఎన్ని నమస్కారాలు చేస్తే- సాహిత్యం రుణం తీర్చుకోగలం ?! అ

## గ్రంథాలయం



**చేగొండి కథా కదంబం** (2వ భాగం)
రచన:**చేగొండి రామజోగయ్య**
పుటలు:154 వెల:రూ.150

**చేగొండి కథా కదంబం** (3వ భాగం)
రచన:**చేగొండి రామజోగయ్య**
పుటలు:134 వెల:రూ.150



ప్రతులకు: యువభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ, తెలంగాణ సారస్వత పరిషత్ భవనములు తిలక్‌రోడ్, హైదరాబాద్-500 001
ఫోన్: 9849909896, 9391373684



**సుబ్బయ్యగారి మేడ**
రచన:**వీరమాచినేని ప్రమోద్ కుమార్**
పుటలు:214 వెల:రూ.199
ప్రతులకు: వి. శ్రీనివాసరాయ్, బి-3, మూడవ అంతస్తు, డోర్ నెం.40-5-19/4, అన్నపూర్ణ రెసిడెన్సీ, టిక్కిల్‌రోడ్, మొగల్రాజపురం, విజయవాడ-10, ఫోన్: 9177307975,7396764419.

**శ్రీశ్రీ 60**1910గి1970(శ్రీశ్రీ సన్మానసంచిక)



మలి కూర్పు:**సింగంపల్లి అశోక్‌కుమార్**
పుటలు:140 వెల:రూ.200

**శ్రీశ్రీ 70** (అభినందన సంచిక)
మలి కూర్పు:**సింగంపల్లి అశోక్‌కుమార్**
పుటలు:92 వెల:రూ.150




ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతి నగర్, విజయవాడ-04 ఫోన్: 9246277375



**కిష్టడి కతలు**
మలి కూర్పు:**ఆర్.సి.కృష్ణస్వామిరాజు**
పుటలు:127 వెల:రూ.140
ప్రతులకు: ఆర్.సి.కృష్ణస్వామిరాజు 22-4-71,బ్యాంక్ఎంప్లాయీస్,కాలనీ మంగళం రోడ్, తిరుపతి - 517501
ఫోన్: 9393662821

ముకుంద రామారావు
99083 47273,

# భక్తి కవిత్వం–సామాజిక నేపథ్యం




**కర్కశమైన కుల పద్ధతులు, జటిలమైన కర్మకాండలతో విసిగిపోయిన ప్రజలకు ఒక కొత్త ఊపిరిలా భక్తి ఉద్యమం వారి ముందు నిలిచింది. వ్యవస్థీకరించబడిన మతం పట్ల విముఖత, లోతైన ఆత్మసమర్పణ మొదలైనవన్నీ సమసమాజం దిశని తీసుకుంటుందన్న ఆశ మూలంగా, అప్పట్లో సాంప్రదాయక అధికార క్రమ సమాజంలో అట్టడుగు వర్గాలైన స్త్రీలను సైతం భక్తి ఉద్యమం అమితంగా ఆకర్షించింది. అప్పటికే వేళ్లూనుకొని సుస్థాపితమైన మతాలకు విరుద్ధమైన ప్రతిక్రియగా కూడా భక్తి ఉద్యమం వచ్చిందని చెప్పుకోవాలి. అయితే ఈ తిరుగుబాటు అంతర్గతంగానే మొదలయినా, చివరికి జనప్రియమైన ధార్మిక ఉద్యమం అయింది. సామాన్య మానవుని పోరాటాల్ని అవి ప్రతిబింబించాయి.**

**మధ్యయుగంలో భక్తి ఉద్యమం భారతీయ సాంస్కృతిక చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి.** ఒక విధంగా సాహిత్య ఉద్యమం. ఒక సైద్ధాంతిక ఉత్పాతం. ఉన్నత వర్గాలు తమ మార్గాలను మూసివేసినప్పుడు – దైవసాన్నిధ్యం కోసం, సాంసారిక యాతనల నుండి విముక్తి కోసం తపించిన పామర జనాల, జానపదుల సృజనాత్మక హృదయ స్పందన. దైవభక్తి దానికి ప్రేరణగా ఆధారభూతంగా పనిచేసాయి. అది పరివర్తనీయ సమాజానికి దోహదపడింది. భారతదేశపు అనేక ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, ధార్మిక, సాంస్కృతిక అస్తవ్యస్తత మూలంగా, ఆ కాలంలో అశాంతి నెలకొని ఉంది. వాటిని అధిగమించేందుకు భక్తి కూడా తోడ్పడింది. తెలుగు తమిళ కన్నడ ప్రాంతాల్లో అశాంతికి కారణాలు – సమాజంలో బలపడుతున్న సామాజిక ధార్మిక వైరుధ్యాలు, మూఢవిశ్వాసాలు, పురోహితుల దోపిడీ వైఖరి మొదలైనవి. మహారాష్ట్ర ప్రాంతంలో ఉన్నతవర్గాల మూలంగానూ, ఉత్తర భారతదేశంలో 12వ శతాబ్దం నుండి ముస్లిముల మూలంగానూ అశాంతి రాజుకోవడం ఎక్కువయింది.

ఉన్నతకులాలుగా స్థిరపడ్డ వారు, నిమ్న కులాలపట్ల చూపించిన ఆధిక్యం సామాజికంగానూ ఆర్థికంగానూ భారతదేశం అన్ని ప్రాంతాల్లోనూ దాదాపు ఒకే రీతిన కొనసాగింది. సంస్కృతం కొందరికే పరిమితమయిన భాష కావడం రానురాను భరించరానిదిగా అన్ని ప్రాంతాల్లోనూ తయారవుతూ వచ్చింది.

'భజ' నుండి ఉత్పన్నమైన సంస్కృత పదం భక్తి. భక్తి అంటే ఇష్టదేవుని మనఃపూర్వకంగా భజించడం లేదా ఆరాధించడం, భగవంతుని పూజలో పాలుపంచుకోవడం. ఆ ఇష్టదేవుడు విష్ణువు, శివుడు, శక్తి ఎవరైనా కావచ్చు. భక్తి ఉద్యమంలో దేవి, గణపతి, మురుగన్ లాంటి ఇతర దేవుళ్లను కూడా ఆ తరువాత కలుపుకున్నారు. భక్తికవులందరూ వారి స్వీయ దేవుళ్ల మీద (శివుడు, విష్ణువు, కృష్ణుడు, రాముడు, జగన్నాథుడు, దేవి) అనేక కీర్తనలు రాసారు. అయితే ఆయా దేవుళ్లు ఎక్కడో స్వర్గంలోనే ఉంటారని కాకుండా, వారికి తండ్రి, తల్లి, గురువు, స్నేహితుడుగా భావిస్తూ సన్నిహితులై చేసిన గానం, అనేక ప్రార్థనలుగా, భజనలుగా రూపాల్ని తీసుకున్నాయి. భక్తి మూలాలు సంస్కృతంలో అనేకం ఉన్నా, ఒక ఉద్యమంగా మొదలైంది మాత్రం ఆరవ శతాబ్దం ప్రారంభం నుండీ తమిళ ప్రాంతంలోనే. భక్తునికి దేవునికీ మధ్య వ్యక్తిగత సంబంధం ఒక విశిష్టతగా కొనసాగింది. ఆ ఆరాధనంతా దైవానుగ్రహానికి ప్రతిస్పందనగా ఆపేక్షతో కూడిన స్వీయ అనుభవమయింది. దూరంగా భయంతోనో భక్తితోనో చూసిన దేవుడు, మొదటిసారిగా బహిరంగంగా ప్రభువుగా, బిడ్డగా, నేస్తగాడుగా, స్నేహితుడుగా, ప్రేమికుడుగా, తండ్రిగా ప్రేమించబడ్డాడు.

భక్తి ఉద్యమంలో, దైవాన్ని కొందరు ఆకార రూపంలో చూసారు. వారిని సగుణోపాసకులన్నారు. మరికొందరు నిరాకార రూపంలో భావించారు. వారిని నిర్గుణోపాసకులన్నారు. ఈ రెండు విభాగాల్లో భేదాలు ముఖ్యమైనవే అయినా, వాటిమధ్య సారూప్యాల్ని తక్కువ చేయలేము. ఆ రెండూ ముఖ్యంగా కేంద్రీకరించినవి మాత్రం – దైవం పట్ల అద్వితీయమైన భక్తి, మార్మికమైన ప్రేమ, వ్యక్తిగత బాంధవ్యం, ఆచారకాండల్ని, సాంప్రదాయిక ధర్మపరాయణ కుల వ్యవస్థల్ని బలపరిచే వాటి పట్ల వ్యతిరేకత మొదలైనవి. అంతర్గతంగా బౌద్ధాన్ని జైనాన్ని ఎదుర్కొందుకు ఒక సంస్కరణగా కూడా భక్తి ఉద్యమం పనికొచ్చింది. నిమ్న కులాలను అప్పటివరకూ దూరం చేసిన వారితోనే భక్తి ఉద్యమం మొదలయి అభివృద్ధిచెందుతున్న దశలో, నిమ్నకులాల నుండి కూడా భక్తికవుల చేరిక ప్రారంభమయింది. అంతేకాదు ఆ ఉద్యమంలో వారు వాడిన భాషకూడా వారి వారి మాతృభాషే కావడం విశేషం. భక్తి ఉద్యమంలో భక్తి లక్ష్యం, మోక్షం మాత్రమే కాదు. భక్తితో ఇష్ట దైవంతో, ఏకం కావాలన్న తపన, సంపూర్ణ ఆత్మ సమర్పణలో, అహంకారాన్ని ఆ దైవం పాదాలచెంత సమర్పించడం ప్రముఖంగా కనిపిస్తుంది.

కర్కశమైన కుల పద్ధతులు, జటిలమైన కర్మకాండలతో విసిగిపోయిన ప్రజలకు ఒక కొత్త ఊపిరిలా వారి ముందు భక్తి ఉద్యమం నిలిచింది. వ్యవస్థీకరించబడిన మతం పట్ల విముఖత, లోతైన ఆత్మసమర్పణ మొదలైనవన్నీ సమసమాజం దిశని తీసుకుంటుందన్న ఆశ మూలంగా, అప్పట్లో సాంప్రదాయక అధికార క్రమ సమాజంలో

అట్టడుగు వర్గాలైన స్త్రీలను సైతం భక్తి ఉద్యమం అమితంగా ఆకర్షించింది. అప్పటికే వేళ్లూనుకొని సుస్థాపితమైన మతాలకు విరుద్ధమైన ప్రతిక్రియగా కూడా భక్తి ఉద్యమం వచ్చిందని చెప్పుకోవాలి. అయితే ఈ తిరుగుబాటు అంతర్గతంగానే మొదలయినా, చివరికి జనప్రియమైన ధార్మిక ఉద్యమం అయింది. సామాన్య మానవుని పోరాటాల్ని అవి ప్రతిబింబించాయి. పారలౌకిక విషయాల్ని ప్రకటించడం గాని, లేదా దేవుణ్ని పొగడ్తలతో ముంచెత్తడం గానీ ఇందులో ఎక్కువగా కనిపించవు. దానికి బదులుగా ఆ కవి లేదా భక్తుని, మనోద్వేగాల్ని, దేవుని పట్ల కోరికల్ని చెప్పుకుంటూ, అతనితో ఉన్న సంబంధాన్ని ప్రస్తావించడం అందులో ఎక్కువ.

భక్తి ఉద్యమం నిరంతరం సాగే అలలు లాగ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి, దక్షిణ ప్రాంతం నుండి మొదలయి, భారతదేశ ఉపఖండంలోని అన్ని మతాల సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్పుల్లో కీలక పాత్ర పోషించింది. ఎక్కువ తక్కువ వారన్న భేదభావం లేకుండా, దేవుడు అందరిలో ఉన్నాడని, పుస్తక జ్ఞానం దేవుడుని చేరుకుందుకు మార్గం కాదన్న ఎరుక ఈ ఉద్యమం కలగ జేయటంతో, తక్కువ స్థాయి వారు, స్త్రీలు అందులో చేరేందుకు, అన్ని సామాజిక వర్గాలకూ తలుపులు తెరుచుకున్నాయి. భక్తి ప్రకటనకు, ఆరాధనకు ఏ భాష అయినా ఒకటే అన్నది కూడా ఈ ఉద్యమం ఇచ్చిన మరొక అవకాశం కావడంతో, అందరూ అందులో చేరేందుకు మార్గం ఇంకా సుగమం అయింది.

ధార్మిక స్తుతి, అచారాల ఆధ్యాత్మిక పెత్తందారీ పద్ధతుల నుండి భక్తి ఉద్యమం బయటపడి, దేవుడితో ఒక ప్రేమ వ్యవహారం లానే అది సాగింది. భక్తి – హృదయానికి సంబధించినదై, పూర్తిగా వ్యక్తిగతమూ సర్వస్వమూ అయింది. వారి విశ్వాస విధానమే, వారిని ఆ మార్గంలో నడిపించింది. దేవుడు ఎవరి సొత్తూ కాదు. తల్లిగా తండ్రిగా లేదా భర్తగా, ప్రియుడుగా లేదా ప్రేయసిగా, లేదా ఒక స్నేహితుడుగా భావింపబడే సరికి, దేవునితో ఒక వ్యక్తిగత సమీకరణం ఏర్పడింది. దైవానికి వారికీ మధ్య ఆ సాన్నిహిత్యం, ఏ బంధుత్వాన్నైనా సాధ్యం చేసింది. శృంగార పూరిత సంభాషణకు సైతం అది దోహదపడింది. అయితే భక్తి కవిత్వం అంతా దేవునితో సాగే ప్రేమ వ్యవహారం కాదు. గుజరాతీ కవి ఆఖా భగత్ లేదా మరాఠీ కవి తుకారంలు – కటువైన, వ్యంగ్యపూర్వకమైన, తీవ్రమైన భాషను సైతం వాడారు. అయితే అది సమాజంలో అన్యాయాలను కపటత్వాన్ని సాంప్రదాయక ధార్మికవిశ్వాసాలను ఖండించేందుకు ప్రయోజనాత్మకంగా మాత్రమే వాడారు. అణచివేత నుండి, దేవుని పేర ఎవరినైనా ఎదిరించ గలిగి, స్వేచ్ఛ పొందగలిగే ఒక కొత్త మార్గం స్త్రీలు, అణగారినవర్గాలకు ఏర్పడింది. విభిన్నమైన సామాజిక నేపథ్యాలు సైతం వారికి అవరోధాలు కాలేదు. దూరంగా భయంతోనో భక్తితోనో చూసిన దేవుడు, మొదటిసారిగా బహిరంగంగా, తల్లిగా భావించి గారాలు పోవడం, తండ్రి భావనలో కోరికలు కోరడం, స్నేహితుడుగా ఏదైనా చెప్పగలిగి, నిలదేసే హక్కు ఉన్నట్టు భావించడం, కోపాన్ని ప్రదర్శించడం లేదా నిలదీయడం, సామాన్య ప్రజలను సైతం ఆకర్షించింది. **దైవానికి దగ్గరకావడానికి వారికి తెలిసిన వారి**

**భక్తి కవులందరిలోనూ ఉన్న ఏకైక లక్షణం, వారి వారి భాషల అద్దంలో దేవుణ్ని చూపించేందుకు వారు చేసిన ప్రయత్నం. అవి జనప్రియం కూడా కావడంతో, అతి బీదవాళ్లు, అతిగా పీడించబడ్డ కులాలవారు, స్త్రీలు, వాటిలో సాంత్వనం పొందినవారే ఎక్కువ.**

**మాతృభాషే వారికి దగ్గరయింది. మాతృభాషలో సాహిత్యానికి ఆ విధంగా మొదటిసారి ప్రోత్సాహం లభించినట్లయింది. భక్తి ఉద్యమ కాలంలో గాయకుడు–కవి ఇద్దరూ కలిసి ఒకరే కావడం కూడా బహుశా అప్పుడే ఎక్కువయింది.**

తమను తాము తెలుసుకోవాలనే తీవ్రమైన అస్తిత్వ అన్వేషణ దేవునికి దగ్గరయే వారందరిలోనూ మొదలయింది. భక్తులైనవారి మాటలైనా పాటలైనా మరేదైనా దేవుణ్ని తాము స్వాధీనం చేసుకుందుకు, లేదా తామే స్వాధీనమయేందుకు, తమలో అన్నివిధాలా లీనం చేసుకుందుకు లేదా లీనమయేందుకే వాడుకున్నారు. ఏ నియమాలూ వారికి లేవు. వారు అనుసరించినవే నియమాలుగా నిలిచిపోవాలనీ వారికి లేవు. ఎవరికి వారు అనుసరించినవే కొత్తవి మొదటివి. దేవుడు వారికి అధికారి కానే కాదు, వారికి దేవుడు ఒక జన్మహక్కు అని మాత్రమే బలంగా నమ్మారు.

భక్తికి సహజమైన వాహిక పాట, కీర్తన, భజన. హృదయం నుండి జాలువారిన కవిత్వం వాటిని విశ్వవ్యాప్తం చేసి, అందరినీ ఇప్పటికీ ఆకట్టుకుంటున్నాయి. ఆ భక్త కవులు ఎక్కడో ఒకే చోట ఉండక, ఊరూరా తిరుగుతూ, నిత్య నూతనమైన భక్తి కవిత్వాన్ని గానం చేస్తూ, వాటిని ప్రజలకు చేరువ చేస్తూ పోయారు. అడ్డుగోడలుగా ఉన్న తీరంలోని కొండల్ని గుట్టల్ని, ఉప్పొంగే ఉప్పెన దాటుకుంటూ పోయినట్టు, **భక్తి ఉద్యమం – ప్రాంతాల్ని, భాషల్ని, కులాల్నీ దాటుకుంటూ పోగలిగింది. దక్షిణాదిన మొదలయిన ఈ ఉద్యమం సంఘటిత సమసమాజ చైతన్యంతో భారతీయ ఉపఖండమంతా 19వ శతాబ్దం మొదటివరకూ విస్తరించగలిగింది.** వాటి ఛాయలు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. పూజా నియమాలు, భజనలు, కీర్తనలు, నిశ్శబ్దంగా దైవ నామ స్మరణలు, భక్తి పారవశ్యంలో నాట్యం గానం, ఆ తన్మయత్వంలో కన్నీళ్ల పర్యంతం కావడం భారతదేశంలో ఎక్కడకు పోయినా కనిపించేవే. దేవుని ఎడల అంత ప్రబలమైన భక్తి, తరతరాలుగా వస్తూ అనేక మార్పులకు లోనవుతూ ఉంది. దేవుళ్లే కాదు, వారి పట్ల భక్తి మార్గాలు కూడా వేరవుతూ వచ్చాయి. అయినా వాటన్నింటిలో ఒక శ్రద్ధ నిష్ఠ విస్పష్టం. ఆకారుడైనా నిరాకారుడైనా, పేరుతో ఉన్నా లేకపోయినా, చిరునామా తెలుసనుకున్నా తెలియకపోయినా, అంకితభావంలో లోపం లేకపోవడమే కావలసింది అన్నది, ఆచరణలో చూపించగలిగారు. కొందరికి మానసిక రోగంగానో లేదా మౌన రోదనగానో కనిపించిన భక్తి, తొందరలోనే హృదయంలోని తెలియని తెలుసుకోలేని లోతైన విజ్ఞానశాస్త్రంగా మరికొందరికి పరిణామం చెందుతూ వచ్చింది. **భక్తినదికి చోదకశక్తి, ఏ ప్రేమ మార్గాలలో ప్రవహిస్తున్నా, దాని చివరి లక్ష్యం భగవంతుడనే**

**భక్తి ఉద్యమం ఒక విధంగా వ్యవస్థిత ఆచారాల వ్యతిరేకి. ఛాందసత్వ ఆచారాల నిరాకరణ, కవిత్వంలో ఏ విధమైన శిక్షణ లేకపోవడం, శైలీకృత ఛందోబద్ధమైన లేదా అలంకారిక మెరుగుబెట్టిన వర్గానికి చెందిన కవిత్వమైనా కాకపోవడం భక్తి కవిత్వంలో కనిపిస్తుంది. ఆశ్చర్యంగా అందులో అలజడి రేకెత్తించే ఆధునిక ప్రతిబింబాలు, వ్యూహాలు, అభివ్యక్తులు ఉంటాయి. వాడుక భాషలో సామాన్యుల సంఘర్షణ, పెనుగులాట ఉంటాయి**

సముద్రాన్ని చేరడమే.

సర్వసంగ పరిత్యాగులే మోక్షార్హులన్న భావన నుండి బయటపడి, కొందరు గృహస్థులు కూడా భక్తిమార్గంలో చేరారు. అందులో మరీ ముఖ్యంగా సాంప్రదాయక అధికారక్రమం ప్రకారం అట్టడుగు వర్గాలైన స్త్రీలు శూద్రులు కూడా అందులో చేరేందుకు, వారికి వారే బయటకు రాగలిగారు. అందులో ఉన్న స్త్రీలు, పితృస్వామ్య పురుష ప్రపంచంలో అంగీకారానికి ఆమోదయోగ్యానికీ ప్రయాసపడక తప్పలేదు. దైవం పట్ల వారి అంకితభావం, వారి విశిష్ట కవిత్వం, ఆధ్యాత్మిక సమానత్వం కోసం వారి మొండి పట్టుదల, ఆ మార్గంలోనే కొనసాగేందుకు ఎంతగానో వారికి సహకరించాయి. అయిష్టంగా అయినా నెమ్మదిగా వారి మార్గానికి అందరూ తలొగ్గక తప్పలేదు.

అతను స్వర్గంలో ఉన్నాడని కొందరు అంటారు, అలా అననీ వాళ్లని/ అతను ఇంద్రభవనంలో ఉన్నాడని మరికొందరు అంటారు, అలా అననీ వాళ్లని/ ప్రాచీన కాలంలో అతను తాగిన విషంతో/ అతని కంఠం నీలవర్ణమయినా/ దేదీప్యమానంగా అతను నా హృదయంలోనే ఉన్నాడని నేను అంటాను - అని ఆరవ శతాబ్దపు కారైక్కాల్ అమ్మైయ్యార్ అనగలిగింది జీవులందరికీ గతజన్మల ఫలితంగా అసంఖ్యాక పునర్జన్మలుంటాయని, ఆ కారణంగా పుట్టినవారందరి అదృష్టాలూ ఒకటి కావని, అంచాత పుట్టుక నుండే సమాజపరంగా గాని, కులాలపరంగా గాని హెచ్చు తగ్గులు సర్వసామాన్యమని అది వారి విధి రాతగా తీసుకుని జీవితాంతం భరించాల్సిందే అన్నది, భారతదేశంలో అనాదిగా వస్తున్న ఒక నమ్మకం. అది మనుషుల మధ్య విభజనలకు అనేకవిధాలుగా తోడ్పడింది. దీనిని భరించలేక వీటికి అతీతంగా ఉన్న బౌద్ధం, జైనం లాంటి వాటిపట్ల కొందరు ఆకర్షితులయారు. అందులోని విధానాల మూలంగా పునర్జన్మల పరిక్రమణల నుండి తప్పించుకోవచ్చని, భక్తి ద్వారా బంధనాలనుండి విముక్తి పొందొచ్చని వారు భావించారు. భగవద్గీత ఈ మార్గాన్నే సూచించినా, రాను రాను విష్ణువు, శివుడు, దుర్గ సర్వోన్నత దైవాలుగా విస్తృతమైన ఆచారాలతో పూజింపబడ్డారు. అదే సమయంలో ఈ ముగ్గురు దైవాలకు వివిధ ప్రాంతాల్లో వివిధ రూపాలలో ఆరాధనలు మొదలయాయి. స్థానిక కల్పిత గాథలు, ఇతిహాసాలు పురాణ కథల్లోని భాగాలుగా చలామణి అయి, పురాణాల్లోని ఆచారాలను అవలంబించేందుకు దోహదపడ్డాయి. అలా చేయడం మూలంగా భగవత్ కటాక్షం లభిస్తుందని భావించారు. అటువంటి భక్తి బౌద్ధులను జైనులను సైతం కొంత ప్రభావితం చేసింది.

ఈ భక్తి కవులందరిలోనూ ఉన్న ఏకైక లక్షణం, వారి వారి భాషల అద్దంలో దేవుడ్ని చూపించేందుకు వారు చేసిన ప్రయత్నం. అవి జనప్రియం కూడా కావడంతో, అతి బీదవాళ్లు, అతిగా పీడించబడ్డ కులాలవారు, స్త్రీలు, వాటిలో సాంత్వనం పొందినవారే ఎక్కువ. ఇప్పటికీ దూరంకాని ఆ భక్తి గీతాలు, అనేక తరాలుగా అందరూ కాపాడుకుంటూ వచ్చిన అద్భుతమైన వారసత్వ సంపదగా మిగిలింది.

భక్తి అనేది నిశ్చలమైన నిర్భయమైన చాలాలోతైన ప్రేమ సముద్రం కొందరికి. అపరిమితమైన మార్మిక అనుభవాలతోనే అందులో వారు మునిగి తేలుతుంటారు. ఆక్రమిస్తున్న బౌద్ధం, జైన మతాల నుండి హిందూమతాన్ని కాపాడుకుందుకు వచ్చిన పునరుజ్జీవనోద్యమంగా, భక్తి ఉద్యమాన్ని కొందరు భావిస్తారు. అది కొత్త దేవుళ్లను, కొత్త ఆచారాలను, కొత్త ఆచరణలకు మూలమయింది. సాంప్రదాయక వైదిక అచారాలను కొంత వరకైనా అది తగ్గించగలిగింది.

భక్తి ఉద్యమం ఒక విధంగా వ్యవస్థిత ఆచారాల వ్యతిరేకి. ఛాందసత్వ ఆచారాల నిరాకరణ, కవిత్వంలో ఏ విధమైన శిక్షణ లేకపోవడం, శైలీకృత ఛందోబద్ధమైన లేదా అలంకారిక మెరుగుబెట్టిన వర్గానికి చెందిన కవిత్వమైనా కాకపోవడం భక్తి కవిత్వంలో కనిపిస్తుంది. ఆశ్చర్యంగా అందులో అలజడి రేకెత్తించే ఆధునిక ప్రతిబింబాలు, వ్యూహాలు, అభివ్యక్తులు ఉంటాయి. వాడుక భాషలో సామాన్యుల సంఘర్షణ, పెనుగులాట ఉంటాయి. ఇద్దరు మనుషుల మధ్య చుట్టరికం మూలంగా ఏవైనా మాటాడుకోగలిగిన దగ్గరితనం వాటిల్లో ఉంటుంది.

వేకువనే లేచి స్నానించడం ఎందుకు/ ప్రతీ కర్మనీ నియమంగా అభ్యసించడం ఎందుకు/ గొప్ప హోమగుండాల్లో హోమాల్ని ఆచరించడం ఎందుకు / నువ్వు అతని మిత్రుడవు కాకపోతే/ అవి అన్నీ వ్యర్థం- అని ఏడవ శతాబ్దపు అప్పారే చెప్పాడు వారి బోధనలు ఆచరణలతో భక్తికవులు ప్రజల్ని సన్మార్గం వైపు నడపడానికి అన్ని ప్రయత్నాలూ చేసారు. సామాజిక, ధార్మిక, ఆర్థికపరమైన జీవితాల్లోని అన్ని విభాగాల్లోనూ తారతమ్యాలు లేని సమాజం కోసం తపనపడ్డారు. వారి ప్రేమ తన్మయత్వంలో దేవుని పట్ల షరతులు లేని సంపూర్ణ లొంగుబాటు వారిలో అడుగడుగునా కనిపిస్తుంది.

భక్తి కవయిత్రులు, భార్యగా ప్రియురాలుగా స్నేహితురాలుగా సేవకురాలుగా దేవుడుని అరాధించారు. కానీ కొందరు భక్తి కవులు, గుజరాత్‌కి చెందిన నరసింహ మెహతా, తమిళప్రాంతపు నమ్మాల్వార్‌లా, దేవుడికి తాము, స్త్రీగా ప్రియురాలుగా అరాధించారు, దేవుడి ముందు వారు పురుషులే అయినా, పురుషులా స్త్రీలా అన్న భేద భావం వారు చూపించలేదు.

భక్తి ఉద్యమంలో లీనమయిన వారిలో పురుషులు, వారు ఎంచుకున్న మార్గాల్లో, ఏవిధమైన అవరోధాలూ కుటుంబపరంగా లేకుండా అందులో ముందుకు పోగలిగారు. స్త్రీలకు సమాజపరంగానే కాకుండా, కుటుంబ పరంగా కూడా ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదుర్కోవలసి వచ్చేది. అయినా అవేవీ వారి మార్గానికి అడ్డుగా,

భావించక భక్తి మార్గంలో స్థిరపడి ప్రపంచవ్యాప్తంగా వారు గుర్తింపుపొందారు.

భక్తి ఉద్యమ కాలంలో మూడు ఆస్తిక ఉద్యమాలు – శైవం, వైష్ణవం, శాక్తేయం పేర బయటపడటమే కాకుండా వేటికవే స్వతంత్రంగా బలపడ్డాయి. అవి వాటికే పరిమితమయిన సాహిత్యాన్ని – శైవ ఆగమాలు, వైష్ణవ సంహితలు, శక్తి తంత్రాలు మొదలైన వాటిని సృష్టించుకోగలిగాయి. తమిళ తెలుగు ప్రాంతాల్లో శైవం, వైష్ణవం, కన్నడ ప్రాంతంలో వీర శైవం అభివృద్ధి చెందింది. దానికి నాయనార్లు, ఆళ్వార్లు, వీరశైవులు బలమైన పునాదులు వేసారు. ఎనిమిదవ శతాబ్దపు శంకరాచార్యుని అద్వైతం, 11వ శతాబ్దపు రామానుజాచార్యుని విశిష్టాద్వైతం, 14వ శతాబ్దపు మాధవాచార్యుని ద్వైతం – హిందూ వేదాంతాన్ని మరింత ముందుకు తీసుకుపోయింది. అరబ్బుల దాడుల్ని (1030–1772) తట్టుకుందుకు నైతిక బలాన్ని కూడా చేకూర్చింది. శివాజీ లాంటి యోధుల్ని సైతం సమకూర్చింది. 13వ శతాబ్దం నుండి మరాఠీ ప్రాంతంలో విఠలుని భక్తి ఉద్యమం చాలా ఉధృతంగా కొనసాగింది. అనేకమంది సంత్ కవులు సంత్ జ్ఞానేశ్వర్, సంత్ నామదేవ్ లాంటివారు దానిని ముందుకు తీసుకుపోయారు. మిగతా భారత దేశంలో గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, ఆసాం, బెంగాల్, ఒడిస్సా ప్రాంతాల్లో, రాముడు, కృష్ణుడు, దుర్గ కాళికాంబ దేవతల ఆరాధన అభివృద్ధిచెందింది. సంత్ కబీర్, సంత్ నానక్, దాదూ దయాల్, రవిదాస్, మీరాబాయి, శంకరదేవ, ఛండీదాస, సారళాదాస్ లాంటి వారెందరో అందుకు తోడ్పడ్డారు. వీరంతా కుల వ్యవస్థకి విరుద్ధంగా, సర్వశ్రేష్ఠ దేవుడు వారి వారి వ్యక్తిగత దేవుళ్లుగా, ఆ దేవుళ్లతో వారి అనుభవాలను సరళమైన స్థానిక భాషలో అందరితో పంచుకుని, అందరినీ అందులో భాగం చేసారు. **ఒక్క గురునానక్ మాత్రం తాను అనుసరించిన భక్తి పద్ధతుల్ని సిక్కు మతంగా మార్చగలిగారు. మధ్య యుగంలో భారత దేశంలో ఒక మతం పురుడుపోసుకుని ఇప్పటికి ఒక శక్తివంతమైన మతంగా అలరారుతున్న మతం అదొక్కటే.**

ద్రావిడ నేలలో పుట్టిన భక్తి/ కర్ణాటకలో పరిపక్వమయి/ మహారాష్ట్రలో స్త్రీత్వాన్ని పొంది/ గుజరాత్‌లో ముదివగ్గయి/ బృందావనం చేరుకున్నాక తిరిగి ఉద్భవించింది/ మళ్లీ పెళ్లికి ఎదిగిన పిల్లలా భక్తి ఉద్యమంలో యోగుల కవుల పనిలేని తత్వవేత్తలు కారు, లేదా పీఠాధిపతులైన సంస్కర్తలూ కారు. అందులోవారు ఎక్కువగా నిమ్న సామాజిక వర్గాలనుండే కాక, బతుకుదెరువు కోసం తక్కువ వృత్తులలో పనిచేస్తున్నవారు కూడా ఉన్నారు. ఉదాహరణకు – రవిదాసు చర్మకారుడు, కబీరు సాలెవాడు, దాదూ వడికేవాడు, నానక్ చిన్న వ్యాపారి, నామదేవ్ కుట్టుపనివాడు, తుకారాం వ్యాపారి. వివిధ సంప్రదాయాలను దూరం పెట్టడం ద్వారా, కులపరంగా జరిగిన అన్యాయాలను ఎదిరించడంగానే వారంతా భావించారు. అధిక సంఖ్యలో ఉన్నా, నిశ్శబ్దంగా అణకువగా అభ్యంతరపెట్టని నమ్మేవారిమీదనే, అదనపు హక్కులున్న వర్గం అధికారం చెలాయించే పద్ధతిని వారు నిరసించారు. కొంతవరకు ఈ భక్తి యోగుల కవుల బోధనలు, కీర్తనలు, సమసమాజాన్ని దోహదం చేసే దిశగా పనిచేసాయి.

దేవాలయాల్లో కీర్తనలు, మసీదుల్లో ఖవ్వాలీ, గురుద్వారాల్లో గురుబాణీ, ఇతర భక్తి శ్లోకాలు పాటలు అన్నీ భక్తి ఉద్యమ ఫలితాలే. భగవంతుని పట్ల అచంచల భక్తి, ప్రేమ తప్ప తతిమావి అన్నీ నిరర్ధకాలని కృత్రిమ నమ్మకాలని ప్రజలకు వారు చెప్పగలిగారు. భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మికం వీటన్నిటి కలయికతో గొప్ప మౌలిక సాహిత్య సృష్టి జరిగింది.

ఎన్ని భక్తి మార్గాలు ఉన్నా, ఎన్ని స్వరాలలో గానం చేసినా సరే – పదాల రత్నాలు మాత్రమే నా దగ్గర ఉన్నవి/ పదాల దుస్తులు మాత్రమే నేను ధరించేవి/ పదాల సంపద మాత్రమే ప్రజలకు నేను పంచేది – అని మరాఠీ ప్రముఖ సంత్ తుకారం అందుకే చెప్పుకున్నాడు.

ఇప్పటి భారతీయ సంస్కృతి మీద భక్తి ఉద్యమానిది ముఖ్యమైన పాత్ర అనే చెప్పుకోవాలి. భక్తి ఉద్యమం మూలంగా ఒనగూడిన శాశ్వతమైన పరిణామం ఏమిటంటే అందులో మన గత నాగరికత జ్ఞాపకాలున్నాయి, సమకాలీన సామాజిక సాంస్కృతిక అవగాహన ఉంది, భవిష్యత్ పట్ల ఆందోళనా ఉంది. ఒక సమగ్రమైన సామాజిక సాంస్కృతిక ఉద్యమం అది. అణగారిన వర్గాల అభిలాషల్ని స్వప్నాల్ని కొంతవరకైనా సాకారం చేసింది అది. భక్తి హృదయానికి చెందిన మతం నిజానికి ప్రేమ మతం.

అయితే ఈ ఉద్యమం ఎప్పటినుండి మొదలయింది, ఎప్పటివరకు కొనసాగింది అన్నదానిమీద అనేక వాద వివాదాలు ఉన్నాయి. దాదాపు వెయ్యేళ్లుకంటే ఎక్కువగా కొనసాగిందన్న ప్రాతిపదిక మీద ఆరవ శతాబ్దం నుండి 19వ శతాబ్దం ప్రథమార్థం వరకూ ఇందులో తీసుకున్నాను.

భక్తికవులు ఎక్కువగా చదువుకున్న వారు కాదు. పండితులూ కాదు. అంతేకాదు దేవుని గుర్తించడంలో పాండిత్యం ఆటంకాన్ని కలిగిస్తుందని కూడా వారు భావించారు. సర్వజ్ఞుడు సర్వశక్తిమంతుడు దేవునికి ఆకారాన్ని అపాదించడం లేదా ఏదో ఆకారంలో బంధించడాన్ని సైతం నిర్గుణోపాసకులైన కబీరు వేమనలు ప్రశ్నించారు. అతని ఆకారం అతనికే తప్ప మరెవరికీ తెలియదంటాడు కబీరు. భగవదనుభవం పదాల్లో వర్ణించలేనిదని, భక్తికవులు చాలామంది అభిప్రాయపడ్డారు. **విశ్వాసంతో కూడుకున్న ప్రక్రియ కాబట్టి ఎవరి భక్తి వారిదే, ఎవరి దేవుళ్లు వారివే, ఎవరికి వారు స్వచ్ఛందంగా అంగీకరిస్తే తప్ప మరొకరికి యదాతథంగా బదిలీకానివి.**

భక్తి కవులే అయినా సాహిత్యపరంగా ఆయా భాషల్లో శైలీపరంగా ప్రక్రియల పరంగా కూడా వారిలో ఎందరో ప్రథములు, మార్గదర్శకులూ ఉన్నారు. పంజాబీలో గురునానక్, హిందీలో తులసీదాస్, మరాఠీలో జ్ఞానదేవ్, ఒడియాలో సరలాదాస్, గుజరాతీలో నరసింహ మెహతా, అసోమియాలో శంకరదేవ మొదలైన వారు అన్ని భాషలలోనూ కనిపిస్తారు. ఇరుగుపొరుగు భాషల్లో ఆదానప్రదానాలూ ఉన్నాయి. కొందరు కవులు స్థానిక భాషలే కాకుండా ఇరుగుపొరుగు భాషల్లోనూ నిష్ణాతులు కావడంతో ఒకే కవి అనేక భాషల్లో రాయడమే కాదు, రాసిన ఆయా భాషలన్నింటా బావుటా ఎగరేసినవారూ ఉన్నారు. దానికి కారణం అప్పట్లో, అసోమియా బెంగాలీ ఒడియా మైథిలీ భాషల్లో ఉన్నప్పటి దగ్గరితనం (ఆ కారణంగానే 9–10 శతాబ్దాల మధ్య చర్యాపదాలు అన్న కావ్యం, ఆ నాలుగు భాషలవారూ వారి ప్రథమ కావ్యంగా ప్రకటించుకుంటారు); అలాగే గుజరాతీ హిందీ రాజస్థానీ భాషల మధ్య, మలయాళం తమిళం, తెలుగు కన్నడం భాషల మధ్య

కూడానూ. పంజాబీ ఆదిగ్రంథ్ అనేక భాషల భక్తి కవుల సారాంశం.

కవులు పురాణగాథలు చారిత్రక ఉదంతాలను సృజనాత్మకంగా ఆయా భాషల్లో స్వేచ్ఛగా మార్పులూ చేర్పులూ చేసుకోగలిగారు. ఇతర భాషా గ్రంథాలను అభిమానంతో ఆకర్షణతో అనుసరించినా, వారి వారి ప్రత్యేకతని విలక్షతని నిలుపుకున్నారు. భక్తి కవిత్వంలో మహిళా కవయిత్రుల పాత్ర అన్ని భాషల లోనూ అమోఘంగా కనిపిస్తుంది. తమిళంలో ఆండాళ్ అవ్వయ్యార్, కన్నడంలో అక్కమహాదేవి, మరాఠీలో ముక్తాబాయి బహిణాబాయి, కాశ్మీర్‌లో లల్లాదేవి లాంటి వారిని తెలియని వారు ఉండరు. సంఖ్యాపరంగా కన్నడ మరాఠీ భాషలలో చాలా ఎక్కువగా వీరు ఉన్నారు. రాజస్తాన్‌కి చెందిన మీరాబాయిని, అనేక ఉత్తర భారతీయ భాషలు తమ కవయిత్రిగానే భావించుకుంటాయి. జీవితాన్ని కవిత్వాన్ని వారు ఎవరూ వేరు చేయలేదు. అలా అని వారి స్వీయ యాతనల్ని అందులో భాగమూ చేయలేదు. వారి మార్మికత్వం తత్వజ్ఞానం ఒక దైవిక దుఃఖంగా, దైవం తప్ప ఎవరినో ఉద్దేశించినవి కావు.

అంతర్గతంగా ధార్మిక సామాజిక సంస్కరణ కోసం పనికొస్తుందనుకున్న స్వదేశీ భక్తి ఉద్యమ ప్రయత్నం, సామాజిక న్యాయం కోసం, స్త్రీల సమానత్వం కోసం ప్రశ్నలు లేవనెత్తినా, అప్పటి రాజకీయ ఆర్థిక వ్యవస్థ భారతీయుల దినవారీ జీవితంలో మార్పుకు అంతగా సహకరించలేదు. **అనాదిగా పాతుకుపోయిన కులాలు, స్త్రీ పురుషుల అసమానతలతో నిలువుగా చీలిన భారతీయ సమాజంలో, దేవుడు ఒక్కడే అందరికీ, అందరూ ఒకటే అతనికి అని, భజనలు శ్లోకాలు కీర్తనలు బోధనలతో సమాజంలో కదలిక మాత్రం కొంత తీసుకు రాగలిగింది. ఒక జాగృతికి మానసిక మార్పుకు అది తప్పకుండా దోహదపడింది. ఆ ఉద్యమమే లేకపోతే ఈ మాత్రమైనా మార్పు సుగమం అయేది కాదని ఓదార్పుగా చెప్పుకోవచ్చేమో.** భక్తికవులు ఆ కాలంలో ఆచారాల్ని గుడ్డినమ్మకాల్ని విమర్శించడమే కాదు, ఆదర్శ సమాజం కోసం ప్రత్యామ్నాయ మార్గాల్ని సైతం సూచించారు. వాటి ప్రభావం అంతకు ముందరి ప్రభావాల్ని అంతగా ఛేదించ లేకపోయింది. **భక్తి ఉద్యమం సుదూర గతానికి తక్షణ భవిష్యత్తుకి మధ్య వారధిలా పనిచేసింది. ఆ వారధిమీద అందరూ పయనించాలన్న విశ్వాసంతో ఉండింది. భక్తి మూలంగా అందరినీ కలిపి ఉంచాలనే ఆకాంక్షను వ్యక్తం చేసింది. మధ్యయుగపు భారతదేశం పునాదుల మీదనే ఆధునిక భారతదేశం నిలదొక్కుకుని నిలుచుంది.**

భక్తి కవిత్వంలో కనిపించే ప్రధానమైన అంశాలు తప్పకుండా కొన్ని ఉన్నాయి – 1. ఆత్మార్పణతో తాము నమ్మిన దేవున్ని కీర్తించటం. 2. మాతృభాష పట్ల బలీయమైన అనుబంధం 3. ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రజా ఉద్యమం ద్వారా పరివ్యాప్తం చేయటం 4. కుటుంబ జీవితానికి దూరం కాకపోవటం 5. సంగీతం నృత్యం లాంటి లలితకళల్ని ప్రోత్సహించటం 6. అన్ని కులాల సంప్రదాయాల ప్రజల్ని లింగ భేదం లేకుండా చేర్చుకోవటం.

అలాగే భక్తి కవిత్వాల్లో కొన్ని ప్రత్యేకతలూ ఉన్నాయి –1. భక్తి కవిత్వంలో సృష్టికర్త ప్రచారకర్త ఒకరే. అలవోకగా మౌఖికంగా వచ్చిన పాట, ఈనోటా ఆనోటా అనేక సంవత్సరాలు బ్రతికి, ఆ తరువాత ఎపుడో అక్షర రూపాన్ని సంతరించుకున్నవే. అలా అవి బ్రతకడానికి

**బోధనలు ఆచరణలతో భక్తికవులు ప్రజల్ని సన్మార్గం వైపు నడపడానికి అన్ని ప్రయత్నాలూ చేసారు. సామాజిక, ధార్మిక, ఆర్థిక పరమైన జీవితాల్లోని అన్ని విభాగాల్లోనూ తారతమ్యాలు లేని సమాజం కోసం తపనపడ్డారు. వారి ప్రేమ తన్మయత్వంలో దేవుని పట్ల షరతులు లేని సంపూర్ణ లొంగుబాటు వారిలో అడుగడుగునా కనిపిస్తుంది.**

కారణం, మనస్సుని హత్తుకున్న అందులోని పదాలకు, అక్కడి జానపద సంగీతం తోడయి, సామాన్యుల పాటలుగా మారిపోవడమే. అవి తరచుగా సంగీతపరికరాలతో ఉదాత్తంగా పఠించడానికి జపించడానికి పాడుకోడానికి ఉద్దేశించబడ్డవే. 2. వాటిల్లో ఒక వస్తువు గాని, కథా సంవిధానం గాని ఉండక, మెరిసే ప్రతీకలు వ్యక్తిగత ప్రశ్నలుంటాయి. కల, అచేతనావస్థ, లోకాతీత, వింతైనవి వగైరా అన్నీ లోతైన ఆలోచనలకు దారితీసి వచ్చినవిగానే ఉంటాయి. 3. వాటిల్లో మాటకారితనం గాని, కవిత్వ నియమాలు గాని, తెలిసిన వస్తువుని సవరించుకోవడం గాని పెద్దగా కనపడవు. అందులోని అర్థాలు ఆ భక్తకవి ఉద్వేగం, తీవ్రత, నిజాయితీతో సత్యాన్వేషణలోని స్వీయ అనుభవాన్ని సరళమైన స్థానిక భాష సంగీతంతో చెప్పగలగడంలోనే కనిపిస్తుంది. 4. అవి నీతిబోధలు గానో వివరిస్తున్నట్టుగానో కూడా ఉండవు. ఒకవిధమైన పవిత్రతని వారితో పాల్గొనేవారిలో కలిగించ గలగటం వాటిలో అంతర్లీనంగా ఉంటుంది. 5. మధ్యయుగంలో భక్తి కవులు, వారు ఎంత దీన స్థితిలో ఉన్నా వారిని ఆ స్థితి నుండి ఉద్ధరించమని ఎవరూ కోరుకోలేదు, అంతే కాదు ఏ మాంత్రిక శక్తుల్నీ వారు ఆశించనూ లేదు.

ఆరవ శతాబ్దం నుండి 19వ శతాబ్దం ప్రథమ భాగం (1850) వరకూ దాదాపు 1250 సంవత్సరాల వరకూ భారతదేశంలో కొనసాగిన భక్తి కాలాన్ని, ఆ సమయంలో సామాజికంగా జరిగిన మార్పుల్ని, ఆ మార్పులకు కవిత్వం కవులు అందించిన తోడ్పాటును తెలుసుకునే చిన్న ప్రయత్నమే నేను చేసింది. ప్రత్యేకంగా చెప్పదలుచుకున్న వాటిని అనుబంధంలో చేర్చాను. ఆ ప్రయత్నంలో నా అవగాహనకొచ్చినవి నాతోపాటే పోకుండా రాసుకున్నవే ఇందులో ఉన్నవన్నీ. ఇది ఒక విధంగా గతాన్ని వర్తమానంతోను, వర్తమానాన్ని గతం మీద ఆధారపడి, కొనసాగింపుగా తిరిగి సృష్టించుకుంటున్న అనువాదం లాంటిది.

విశ్వాసం ఏర్పడ్డాక కట్టుకథ అయినా, కట్టుకథలా అనిపించనే అనిపించదు. ఒక్కమారు వారి విశ్వాసాన్ని అవి మరింత పెంచుతాయి. అవి నిజం కావు అన్న వారి పట్ల ద్వేషాన్ని సైతం పెంచుతాయి. మంచీ చెడులకు, నిజానిజాలకు దేవుడు అతీతుడు కదా. ఎందుకో ఏమిటో అతనికే తెలుసు. భక్తులతో ఆడుకోవడం అతనికి సరదా. అది భక్తులకూ తెలుసు. భగవంతునిపై భక్తి విశ్వాసాలతో దేనినైనా భక్తులూ స్వీకరిస్తారు. భక్తి సంప్రదాయంలో ఎక్కడైనా అంగీకరింపబడిన సత్యం ఇది.

భారతదేశపు మధ్యయుగంలో అనేక మతాలు వాటి వాటి

**తరువాయి 45వ పుటలో....**

పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'సదసద్వివేకం' లోపించిన 'చతురత'

**గత యాభై ఏళ్ళు గిరిజనులను త్రిశంకుస్వర్గంలోకి నెట్టాయి. ప్రభుత్వ అధికారుల ప్రయోగశాలలుగా మారాయి. వనవాసి అస్మితను కాలరాసాయి. కాని తొక్కిన కొద్దీ, కాలికింద దుమ్ము రేగుతోంది. నేలకుకొట్టినకొద్దీ బంతి ఎగురుతుంది. ఓడిపోయిన కొద్దీ కురుక్షేత్రం దగ్గరౌతుంది. అభివృద్ధి విషప్రయోగానికి చిరకాలంగా బలియై, ఇప్పుడు పురిటినొప్పులు పడుతున్న అడవితల్లికేక పిల్లదా, తల్లిదా? తల్లీ, పిల్లలలో ఎవరు దక్కుతారో... కాలమే చెప్పాలి.**

**ఆ**మధ్య విభూతిభూషణ్ బందోపాధ్యాయ 'వనవాసి' బెంగాలీ నవల అనువాదం పునర్ముద్రణ వచ్చింది. ఒక జమిందారు కొలువులో చేరి, ఆయన భూములు వ్యవసాయంలోకి తెచ్చి పన్ను ఇవ్వగలిగిన వాళ్ళకు కట్టబెడుతుంటే, అంతవరకూ ఆ భూములలో అటవీఫలసాయం, దుంపలు పండ్లు సేకరించుకుంటూ, చేతనైన సాగు చేసుకుంటూ, పన్ను ఇచ్చుకోలేక, కొత్త కామందుల రాకతో, జీవనాధారం కోల్పోతున్న అభాగ్యుల అసహాయతను, రచయిత, హృదయ విదారకంగా వర్ణిస్తాడు. వాళ్ళలో కొంతమందికి భూములిచ్చి, వాళ్లు పన్ను కట్టలేకపోతే, తాను అప్పు చేసి ఆ సొమ్ము కడతాడు. ప్రసిద్ధమైన ఇటువంటి కొన్ని 'భారతీయ నవల'లను వాగ్దేవు వీరలక్ష్మీదేవి పరిచయం చేశారు. ఈ వనవాసి నవలలో వెన్నెలవంటి అష్టాదశ వర్ణనలను, పాత్ర చిత్రణను రసవత్తరంగా లక్ష్మీదేవి కొనియాడారు. కాని అది రాజవొమ్మంగి మండలం శరభవరం కరణంగా పనిచేసిన తన నాన్న విశ్వేశ్వర చలపతి గారి జీవితం అని గుర్తు పట్టలేక పోయారు.

1900లోనే కరణీకం కోసం వారి కుటుంబం అక్కడికి వెళ్ళింది. అప్పుడు భూమిశిస్తు ఎక్కువగా ఉండేది. పైగా, పంట అయినకాడికి తక్కువ ధరకు అమ్ముకుని రొక్కంలో కట్టాలి. చాలామంది పేదవాళ్ళు తాము సాగు చేస్తున్నట్లు లెక్కలలో చూపవద్దని బతిమాలుకునే వారట. సాగు చూపకపోతే, సాగు ఎందుకు తగ్గిందని పై అధికారులు నిలదీస్తారు. సాగుచూపిస్తే, పన్ను వసూలు చేసి కట్టాలి..చివరకు ఏ గ్రామపెద్ద/మునసబు దగ్గరో డబ్బు తీసుకుని సర్దుబాటు చేసి, సాగుదారుగా ఆయన్నే నమోదు చేయాల్సి వచ్చేది. ఆ పెద్ద, అప్పో సప్పో ఇచ్చి, నయాన్నో భయాన్నో అసలు సాగుదార్లను వదిలించుకునే వాడు. లేదా, పాలేరులుగా కొనసాగనిచ్చేవాడు.. ఆ పెద్దకూడా తనలాగా గ్రామమునసబుగా వచ్చాడు. 1917 నుండి గిరిజనుల రుణవిముక్తి కోసం ప్రభుత్వం చట్టాలు చేస్తూ వచ్చింది. గిరిజన తెగలేమిటో ప్రకటించింది. తాను సంపాదించిన పొలాలన్నీ దక్కించుకోటం కోసం, ఆ మునసబు, తాను గిరిజనుడుగా సర్టిఫికేట్ సంపాదించుకున్నాడు. అలా సంపాదించుకోటం కుదరలేదేమో, ఒక రాజుగారు ఎక్కడో అశ్వారావుపేటలో నాయకపోరు తెగకు చెందిన గిరిజనుడు గడ్డం రాఘవ పేరున బినామిగా పెట్టాడు.

1985లో శక్తి ప్రారంభించిన కొత్తలో వీరలక్ష్మిగారి తమ్ముడు చినవీరభద్రుడుద్వారా పరిచయమైన కరణంగారు, ఇటువంటి అనుభవాలు ఎన్నో చెప్పారు. అటువంటి సంఘటలన్నీ పోగుచేసి మేం 'భూములుకోల్పోతున్న గిరిజనులు' అని ఒక పుస్తకం వేశాం. ఈ పుస్తకం రాజవొమ్మంగిలో ఒకమిత్రుడు చూపించాడని వీరభద్రుడు చెప్పారు. అప్పటికే యన్.టీ రామారావు కరణాలను తీసేసారు. అయినా, ఏదో పనిచేసిపెట్టమని జనం కరణాల దగ్గరకు వస్తూనే ఉండేవారు. జనాన్ని తనమీదకు తోస్తున్నాడనే నేరం మోపి, అప్పటి యమ్మార్వో జితేంద్ర ఆయన మీద కేసు పెట్టాడు. అప్పటికే వీరభద్రుడు పార్వతీపురంలో గిరిజన సంక్షేమాధికారిగా చేరారు. ఎంతో ఆందోళన చెందారు. అప్పుడు ఆయన సహవిద్యార్థి, జీవన్, రంపచోడవరంలో సమాచారశాఖలో కొత్తగా చేరారు...ఆ కేసు అప్పటి సబ్ కలెక్టర్/సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నీరబ్ కొట్టేసారు.

వీరలక్ష్మి పరిచయం చేసిన మరోనవల 'మట్టిమనిషి' ( కాళింది పాణిగ్రాహి ఒరియా నవల అనువాదం)లో, నిజాయతీగా పనిచేసే భూముల సర్వేయర్, ఉద్యోగుల ఆర్భాటం మీద విరక్తిచెంది, ఆ ఉద్యోగం వదులుకుంటాడు. గాంధేయ పద్ధతిలో ప్రభుత్వం అంటే ఉద్యోగుల ప్రమేయంలేకుండా ప్రజలసమస్యలు/తగువులు తీర్చటానికి ప్రయత్నం ఇంటినుంచే మొదలుపెడతాడు. అటువంటి వీలులేని, కరణం చలపతిగారు అలాగే బాధలు/ క్షోభను భరిస్తూ వచ్చారు. వనవాసి, మట్టిమనిషి లో సాహిత్యవిలువలు ప్రశంసించి, ఈ నేపథ్యం తెలుసుకోలేని వీరలక్ష్మి 'కొండఫలం' కథలలో తన గందరగోళం వెళ్లగక్కారు. ఆమె మరోతమ్ముడు సుందరరావు, బడి రోజులనుండి గాంధీగారి కథను ప్రచారం చేయటంలో మునిగి పోయాడు. ఈ మట్టిమనిషి కథ, ఆయన ఈ కోణంలో చూస్తే, గాంధీ తత్వాన్ని ఆచరణలో పెట్టటానికి ఎటువంటి ఆలోచన, తెగింపు అవసరమో తెలియచెప్పే ఆ నవలను, ఆయనకు ఇష్టమైన ఏకాంకికగా మలిచేవారేమో!

ఈ మధ్య గోపీనాథ మొహంతి నవల 'అమృతసంతానం'ను వీరు ఆకాశానికెత్తేశారు. చనిపోయిన గిరిజన సంప్రదాయ గ్రామపెద్ద/సావోతా, గుణగణాలు గుర్తుచేస్తూ ఈ నవల మొదలౌతుంది.. గ్రామ బారిక/నౌకరులు 'అంటరాని' వారు. ఆ కుటుంబాలు సారాకాస్తూ, దొంగతనాలు చేస్తూ ఉంటారు..వారి స్త్రీలమీద అధికారులు అత్యాచారం చేస్తారు దొంగతనాలు మరిగి ఆ నౌకరు కోడలు సోనాదేయిని, కొడుకు

పట్టించుకోదు. ఆమె పొందుకోసం చనిపోయిన పెద్దస్థానంలోకి కొత్తగా వచ్చిన ఆయన కొడుకు- గ్రామ పెద్ద, అతడి బాబాయి లొట్టలేస్తుంటారు. సారాకోసం ఆమె ఇంటికి పోతారు కాని, కులం అడ్డుపడుతుంటే, ఆమెతో కలిసే చొరవ చేయలేకపోతారు. ఆ ఊళ్ళో బారికది ఒకటే కుటుంబం. ఆమె పుట్టింట్లో తండ్రి, కిరస్తానీ మతంలోకి మారటంతో ఊరికి దూరమౌతాడు. అతడిమీద దొంగతనం నేరం మోపి జైలులోకి తోస్తారు. ఇలా రెండు చోట్లా తోడుదొరకని ఆమె జీవితం మోడువారిపోతుంది. ఇది ఆ నవలలో కథ. ఇటువంటి బారికల కుటుంబాలు గిరిజన సర్టిఫికేట్ కోసం పడుతున్న బాధలు, తిరకాసులు 'కొండఫలం' లో ఒక కథలో వీరలక్ష్మి ఏకరువు పెట్టారు.

అయితే, మంచి గ్రామపెద్ద ఉన్నప్పుడు, మంచి గ్రామనౌకరు ఉండడా? అటువంటి అంటరానికులం ఆడపడుచు గంగ/ గంగాలమ్మను, విశాఖ మన్యం ఇష్టదైవం, మన్యం మహారాణి మోదకొండమ్మ కొడుకు/ యువరాజు ప్రేమిస్తాడు. వారి ఇద్దరికీ పెళ్లి జరిపించటానికి రైతు రాణువ పడిన అంతర్మథనమే మోదకొండమ్మ సంప్రదాయ గేయ గాథ. ఈ మోదమ్మ జాతరను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనోత్సవంగా జరుపుతుంది. అమృత సంతానం రచయితకు గిరిజన హృదయంలో ఈ లోతులు, వారి ఆదర్శాలు తెలియవు. చూసింది చూసినట్లు రాసాడు. ఈ ముందువెనుకలు గమనించకుండా, మునసబు కరణం, గ్రామనౌకరు సంబంధాలు తెలిసినప్పటికీ వీళ్ళు, ఆ నవల అద్భుతం అమోఘం అంటూ ఎలా ప్రశంసించారో!

'శక్తి' పెట్టాక కరణం చలపతిగారి ద్వారా తెలుసుకున్న సమస్యలు కొన్ని పట్టించుకున్నాం, పట్టించుకున్నా కొన్నిటి వెంటపడలేకపోయాం వాటి మూలాలు తెలియాలంటే నాకు తెలిసిన యాభైయేళ్ళ చరిత్ర ఏకరువు పెట్టాలి.

71లో నేను గిరిజనప్రాంతంలో అడుగుపెట్టేసరికి, ఒకనాటి గణరాజ్య అవశేషం ముఠాదారి వ్యవస్థ స్థానంలో భూమి తగవులకు నాందిపలికిన రివిన్యూ పాలన రైత్వారీ పద్ధతి వచ్చింది.దానికి నాయకత్వం వహించిన అధికారి ఎక్కిరాల వేదవ్యాస రాజమహేంద్రవరం, ఇన్నీస్ పేట హిందూసమాజంలో మహాభారతం కాలనిర్ణయం మీద ఉపన్యాసాలిస్తుండేవాడు.

జిల్లా గిరిజన సంక్షేమ ప్రాజెక్ట్ అధికారిగా వచ్చిన సి.వి.కృష్ణారావు. మారేడుమిల్లిలో. పద్యాలు గేయాలు రాసే వాల్మీకి గిరిజనుడు చిన్నం శాంతయ్య, కొండ మామిడి చెట్ల నరికి వేతకు తన మెడను అడ్డం పెట్టాడని, చిప్కో ఉద్యమం గుర్తుకు వచ్చేట్టు కవిత రాసాడు. కాని , ఆయన నుండి గిరిజనుల సాహిత్యం తెలుసుకోలేకపోయారు.. అప్పుడే, నేను, అదే శాంతయ్య వగైరాల దగ్గర గిరిజన సాహిత్యం సేకరించటం మొదలుపెట్టి పిహె.డి లో ప్రవేశం సంపాదించాను.రాజవొమ్మంగి దగ్గర కింద్ర కాలనీ, గాంధీనగరంలో క్షీరాబ్ధి పథకం, నా గెడ్డవాడ బడిలో అప్పుడే వచ్చిన గిరిజన విద్యార్థుల భోజన వసతి వంటివి, ఆయన చూస్తుండేవాడు..అప్పుడే నేను గిరిజన విద్యావిధానంలో లోపాలమీద రాసిన వ్యాసం 'కొండకోనలలో బడిగంటలు' ఆంధ్రప్రభ దినపత్రిక ప్రచురించింది. ఆయన 'నెలనెలా వెన్నెల' కవితాగోష్ఠి నిర్వహిస్తూ, గిరిజనులమీద తనకు తెలిసిన కబుర్లు/ శుష్కప్రియాలు వల్లిస్తుండేవారు.


అప్పుడే ప్రపంచ తెలుగుమహాసభల సందర్భంగా గిరిజన



సాంస్కృతిక సంస్థ సంచాలకుడు ప్రతాప్ ట్రైబల్ అఫ్ ఆంధ్రప్రదేశ్ అనే చిన్నపుస్తకం తెచ్చారు.అప్పుడే డాక్టరేట్ కోసం గిరిజనుల సాహిత్యం పోగుచేయటం మొదలుపెట్టిన నేను, ప్రతాప్ రచనకు సాహిత్య గంధం అద్ది రాసినవ్యాసం 2010లో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జానపదవిజ్ఞానంలో కోర్స్ మెటిరియల్‌లో చేర్చింది. 1985లో శక్తి ప్రారంభించాక ఈ కొండమామిడి చెట్లు నరికే ఫ్యాక్టరీని ప్రజాహిత వ్యాజ్యం ద్వారా మూయించాము.

వీరభద్రుడు 85లో పరిచయమైనప్పుడు, గిరిజనుల తాత్విక చింతనను, నిర్మితిని నిరూపించిన మానవ శాస్త్రవేత్త లేవిస్ట్రాస్, సాంఖ్య దర్శనాలతో సమన్వయిస్తూ రాసిన వ్యాసం 'వార్త యందు జగము వర్ధిలుచున్నది' ఇచ్చాను.అప్పట్లో రాజమహేంద్రవరంలో అర్.యస్.సుదర్శనం, గోపీచంద్ వగైరాలు జీన్‌పాల్ సార్త్రే అస్తిత్వవాదంమీద చర్చిస్తూ 'సాహిత్య వేదిక' నడిపేవారు. సార్త్రే బహిర్ముఖుడు-స్ట్రాస్ అంతర్ముఖుడు. ఇద్దరు సమకాలికులైన ఫ్రెంచ్ తాత్వికులు. ఈ విశేషాలు వాళ్లతో చర్చిద్దామనుకున్నాను. కాని వాళ్ళదంతా సాహిత్యం పిచ్చి, కాలక్షేపం కబుర్లు. సుదర్శనంగారు ఆంగ్ల సాహిత్యోపన్యాసకులు. అప్పటికే ఆంగ్లంలో రాసే కవి, చికాగోలో ఆచార్యుడు ఏ.కే.రామానుజన్, జానపద దార్శనికుడుగా పేరుపొందాడు. కాని వీళ్లెవరికీ నగరంలో నేదునూరి గంగాధరం గారి జానపద సాహిత్యం మీద, తూర్పుకనుమల పాలకుల ఖ్యాతిని గుర్తుచేసే, విక్రమదేవవర్మ పేరిటి విక్రమహాల్ చరిత్రకోసం, అక్కడే ఉన్న రాళ్లబండి సుబ్బారావు మ్యూజియంలో కళింగ సంచికలు తిరగేయాలనే ఆసక్తి లేకపోవటం గమనించాను.

85 నుండి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు బలపడటం, సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు జరిగింది. ఈ ఉన్నతాదికారులందరూ












ఫారెస్ట్ వాళ్ళు యూకలిప్టస్, టేకు తోటలు పెంచినట్లు , 'గిరిజనులచేత వ్యాపార పంటలు వేయించి లక్షాధికారులను చేస్తాం, నాణ్యమైన విద్యనందించి, మాలాగా ప్రయోజకులను చేస్తాం' అనే పూనకంతో పనిచేస్తుండేవారు. నా గిరిజన విద్యార్థి బలగాన్ని చూసి, గెడ్డవాడ–కొండమొదలుదారిలో చీమగండి మీది గ్రామాలలో 'ఏజెన్సీ భూములసర్వే/ తెలుగు గిరిజన మాగాణి సమారాధన' ప్రణాళిక ద్వారా రిజర్వ్ అడవి సరిహద్దులు గుర్తించి రెవిన్యూకింద ఉన్న పోడు భూములలో జీడిమామిడి తోటలు పెంచే కార్యక్రమం 'శక్తి'కి అప్పగించారు. అప్పటికే ఆ గండిమొదట్లో ఆనేంపల్లిలో కొండకమ్మరి కానెం లింగయ్య 500 మొక్కల జీడితోట పెంచిన ఆదాయంతో పెంకుటిల్లు కట్టుకున్నాడు. చిప్కో ఉద్యమ నాయకుడు చండీప్రసాద్ భట్ 86లో ఉధృతంగా వచ్చిన గోదావరివరదలకు కారణాలను తెలుసుకోగోరుతూ, నాకు అతిధిగా వచ్చారు. ప్రాజెక్ట్ అధికారి మనోహర్ ప్రసాద్ వేయిస్తున్న ఈ జీడితోటలు చూసి, ఆయనకు వృక్షమిత్ర అవార్డ్ ఇప్పించారు. అదేవిధంగా కానెం లింగయ్యకు, కృషి పండిట్ అవార్డ్ వంటిది ఇప్పిస్తే బాగుండేది. జీడిమొక్కలతోపాటు కొన్ని పండ్ల మొక్కలు ఇస్తే బాగుంటుందని, జనం తింటారుగదా అని పోరుపెట్టాను కాని ఆయన బుర్రకెక్కలేదు. భూముల సర్వేకింద గిరిజనుల సాగులో ఉన్న అన్ని భూములకు, భూమిలేని గిరిజనులకు పట్టాలిచ్చేది బదులు ఈ తోటలు వేసినంతవరకే పట్టాలిచ్చి సరిపెట్టారు.

నిధులు వరదలా వచ్చేవి. ఎద్దీనిందిఅంటే, గుంజకు కట్టేయమంటూ, తలలో నాలుకలా పనిచేసే సిబ్బంది చుట్టూ ఎప్పుడూ ఉంటారు. మారేడుమిల్లి మండలంలో భీమవరం చుట్టూ నిమ్మగడ్డి, వేటుకూరు చుట్టూ తస్సార్ పెంపకం. బోదులూరులో కాఫీ వేయించారు. రంపచోడవరం మండలంలో గండికింద వేసిన జీడి తోటలకు తడుపుకోసం, బోరుబావులు తవ్వించి హ్యాండ్ పంపులు పెట్టారు. గెడ్డవాడలో మల్బరీ, ఫోక్స్ పేటలో తస్సర్ పురుగుల క్షేత్రం ఇవ్వన్నీ 90కల్లా పెట్టటం, మూతపడటం అయ్యింది. ఒక్కచీమ గండిమీద తోటలు మాత్రం తరువాత ఎటువంటి ప్రోత్సాహం దొరకక పోయినా, గిరిజనులు వృద్ధి చేసుకున్నారు. ఇప్పుడు భద్రాచలం పేపర్ బోర్డ్ వారు, గిరిజనులతో ముమ్మరంగా జామాయిల్ తోటలు వేయిస్తున్నారు.

ఇలాగే పాడేరులో కాఫీతోటలు పెంచుతూ మధ్యలో పనస, మామిడి, జీలుగు స్థానంలో, సిల్వర్ ఒక్ వేయిస్తూ ఉండేవారు. కొంతకాలం ఏక్షన్ ఎయిడ్ సంస్థలో పనిచేసిన నేటి తెలంగాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, రాబర్ట్ చాంబర్స్, జనం నుంచి త్వరితగతిని సమాచారం రాబట్టే పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ పద్ధతులు పాటిస్తూ, అభివృద్ధి అవసరాలకు తగ్గట్టు సేకరించటం మీద పుస్తకం రాసారు. అయితే రైతుల సంప్రదాయజ్ఞానం, ముందు తెలుసుకుని అది పునాదిగా విస్తరణ చేపట్టాలని, రాబర్ట్, సోదాహరణంగా కూర్చిన కృషి (Farmers First ) విస్మరించారు. మరో అధికారి విజయ కుమార్ పాలేకర్ సహజ వ్యవసాయ పద్ధతులు శ్రద్ధగా అమలు చేస్తున్నారు. పాలేకర్, సరాసరి అడవినుంచి నేర్చుకున్నాను అంటారు. అడవి జంతువులను, పంటలను మలుచుకున్న గిరిజనుల వారసత్వం పేర్కొనరు. పైగా ఆయనవి మరాఠీ ఉదాహరణలు. దాన్ని 'సాక్షి' పంతంగి రాంబాబు మక్కికి మక్కీ అనువాదం చేస్తే, పాలేకర్ ప్రచారకుడు, సాధకుడు ఎమేరాల్డ్ విజయరాం అమ్ముతున్నారు.

ఇప్పుడు మన రాష్ట్రంలో ఉన్న అరకులోయ, ఒకనాడు ఒడిసా జేపోర్ సంస్థానంలో ఉండేది. అక్కడ వ్యవసాయ వారసత్వాన్ని ప్రపంచ ఆహారసంస్థ గుర్తించి పోషిస్తుంటే, ఆ వారసత్వం పైపైన తప్ప, లోతులు తెలియని, అరకులోయలో ఈ సహజ వ్యవసాయం (ప్రాలేకర్ వ్యవసాయంపై) మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలు, విజయకుమార్ సన్నిహితులైనా, ఆయన దృష్టికి తేలేక పోతున్నారు. పొరుగున ఉన్న ఒడిసా స్థాయికి పోలేకపోతున్నారు. అధికారులందరూ అంతర్జాతీయ వ్యవసాయాభివృద్ధి సంస్థ(IFAD) అప్పుతో విద్యారంగంలో అనేక ప్రయోగాలు చేసారు. కాని సైన్స్ ఫెయిర్‌లలో ఉత్సవాలలో గిరిజనపిల్లల పరిసరవిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం చాటుకోగల అవకాశాలు కల్పించలేదు.

87లో ఏజెన్సీ ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెంచారు. గిరిజనాభివృద్ధి సంస్థ నియామకాలు పూర్తిగా గిరిజనులకే. ఆ తరుణంలో వీరభద్రుడు పార్వతీపురంలో గిరిజన సంక్షేమ అధికారిగా చేరారు. తను చదివిన తాటికొండ గురుకుల పాఠశాల నమూనాగా ఆశ్రమ పాఠశాలకు

'సంతోషచంద్రశాలలు' అని పేరు పెట్టి, 'కొన్ని కలలు– మెలకువల' అన్వేషణ ప్రారంభించారు. మార్గరెట్ మీడ్ వంటి ప్రముఖ మానవశాస్త్రజ్ఞుల కృషి తనకు 'యకాయకి' వనికి రావని తెలుసుకున్నారుగాని, గిడుగురామమూర్తి గారి 'సవరకథలు' ఆయనకు గుర్తు రాలేదు. పాడేరులో పనిచేసేటప్పుడుకూడా, ఆయన, జీవితకాలం గిరిజనుల కోసం పనిచేసిన కెనడా దేశీయుడు గుస్తాఫ్ బహూకరించిన ఒడియా కోటియా తెలుగు పండుగలు– కథలను పట్టించుకోలేదు.' మాడెముల గెల్చె వడ్డాది మసియొనర్చే'నని మనుచరిత్రలో పేర్కొన్న, నేటికీ సజీవంగా ఉన్న, రాయలవారి కళింగ దండయాత్ర తాలూకు ఆనవాళ్ళు; గుళ్ళు గోపురాలు, స్థల పురాణాలు తను 'నడిచిన దారులలో' ఆయనకు తగలలేదు. అప్పటికి నా 'తెలుగు గిరిజనుల గీతాలు' ఆయన చేతిలో ఉంది. దాంట్లో, ఏదో ఒక పాట, పిల్లల నోట విందామని ఆయనకు తోచలేదు. కాబట్టి అటువంటి సలహాలేవీ తను రాసిన ముందుమాటల సంకలనం 'సహృదయునికి ప్రేమలేఖలు'లో గిరిజనరచయితలకు ఇవ్వలేదు. మహాయాత్రికుడు రాహుల్ సాంకృత్యాయన్,' ఋగ్వేదఆర్యులు కవితాభినివేశం కలవారు. వారి ఋక్కులను కొండప్రాంతాల పల్లెపాటలతో పోల్చి చూస్తే వాస్తవాలకు దగ్గరగా రాగలం'. అని ఉద్బోధించారు. అయితే ఈయన యత్రాసాహిత్యం పేర సొంత రచనలకు ప్రోత్సహించారు ఆయన ప్రపంచ సాహిత్యం అరచేతిలో చూపిస్తారు గాని ఆ అరచేతి కింద ఉన్న జానపద, గిరిజన సాహిత్యం జోలికి మాత్రం పోరు.. ఇప్పుడు ఆయనతో పనిచేసిన ఉపాధ్యాయుడు గెంటేడ గౌరినాయుడు 'సంతోష చంద్రశాల'లో చదివిన సవర రచయిత మల్లిపురం జగదీశ్‌కు మూలాలు తెలుసుకుని రాయాలని సలహా ఇస్తున్నారు. మల్లిపురం, ఈ ఆ చదువులు ఉద్యోగానికి క్యూ కట్టడానికి తప్ప, ఎందుకు పనికి రావని, ఊరూకు రోడ్లు పడ్డాయి. ఒకనాటి వారపు సంతలు రోజువారీ మార్కెట్లుగా మారి, గిరిజనేతరుల వశమైనాయి. గిరిజనుల పరాయీకరణ పెంచాయని, ఒక్క పేరుమోసిన గిరిజన రచయిత రాలేదని వాపోతున్నాడు.

గిరిజనుల వారసత్వం వైపు ఆయన దృష్టి మళ్ళించాలని 'తెలుగు గిరిజన గీతాలు' పరివర్ధిత ముద్రణ 'కొండకోనలలో తెలుగుగిరిజనులు' ఆవిష్కరణకు ప్రధానవక్తగా ఆహ్వానించాను. తన సహజధోరణిలో జనరంజకంగా మాట్లాడారుగాని లోతులకు పోలేదు..అలాగే చెంచులు రాసుకున్న 'నల్లమలలో చెంచుప్రపంచం', 'ప్రభుత్వానికి చెలగాటం –చెంచులకు ప్రాణసంకటం' ఆవిష్కరణలలో, గిరిజన సాంస్కృతిక శాఖలో పనిచేసిన తన అనుభవాలను ఒక దశాబ్దంపైగా 'అత్మగానం' వగైరాలుగా తెస్తున్న వి.ఎన్.వి.కె శాస్త్రి, వీరభద్రుడు వక్తలు.

విశాఖలో గిరిజన సాంస్కృతికశాఖ వారు నిర్వహించిన నిపుణుల సమావేశంలో వీరభద్రుడు 'చెంచు ప్రపంచం'లో ఇచ్చిన చెంచు గ్రామాల సాంస్కృతిక పటం గూర్చి వివరించారు. అప్పుడు ఆయన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్‌కి చెందిన 'సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ పబ్లిక్ సిస్టమ్స్(సిప్స్)లో డెప్యుటేషన్ మీద పనిచేస్తున్నారు. అప్పుడు అడవిలో గిరిజనులమీదతోపాటు, తీరప్రాంత మత్స్యకారులకు మా పని విస్తరించాము. NRSAలో ఒషనోగ్రఫి నిపుణుడు హనుమంతరావుగారి దగ్గరకు వెళ్ళుతూ 'సిప్స్'కు వెళ్ళాను. వీరభద్రుడు వెంటనే వారి డైరెక్టర్ నివేదితా హరన్‌ను పరిచయం చేశారు. నేనిచ్చిన సమాచారంతో జాలరుల జ్ఞానాన్ని ఉపగ్రహసమాచారంతో అనుసంధానం చేయవలసిన అవసరం మీద 'సిప్స్' ఒక జాతీయ సదస్సు నిర్వహించింది. తరువాత గిరిజన ప్రాంతానికి వర్తించే పంచాయత్ రాజ్ చట్టాన్ని సంవాదరూపంలోకి తెచ్చే పనితోపాటు, ప్రధానోపాధ్యాయుల కరదీపికలలో చివరిదిగా, గిరిజన సంస్కృతి వాచకాలు మాచేత తయారు చేయించారు. తరువాత వీరభద్రుడు సర్వశిక్షా అభియాన్‌కు, మాతృశాఖ గిరిజన సంక్షేమానికి సంచాలకులుగా వెళ్లారు. కాని 'సిప్స్'లో చేయించిన ఈ కృషి అచ్చులోకి, వ్యాప్తిలోకి రాలేదు, కాని మోదకొండమ్మ కథను వారి పనుపున శిష్టా చలపతి పాఠంగా పెట్టటానికి, చెంచుల కథలు పరిచయం చేయటానికి శాకమూరి శ్రీనివాస్ ఇటీవల నన్ను సంప్రదించారు.

రంపచోడవరం ప్రాజెక్ట్ అధికారిగా ఉన్న పి.వి.రమేశ్ ను కలవటానికి వచ్చినపుడు వి.ఎన్.వి.కె శాస్త్రిగారు పరిచయం. కుమరం భీం నుండి ఇంద్రవెల్లి మారణకాండదాకా జరిగిన పరిణామాలను 'ఉద్యమాలనుంచి ఉద్యమాలదాకా'గా ఆయన రాసారు.. రమేశ్, ఉట్నూరు సబ్ కలెక్టర్‌గా 'ఏజెన్సీ భూముల సర్వే' చేయించారు. ఆయన తన అనుభవాలతో రాసిన వ్యాసానికి నా అనువాదం దున్నేవాడికి భూమి భూమిలోకి దున్నేవాడు 'నడుస్తున్న చరిత్ర' ప్రచురించింది. పశ్చిమ గోదావరి ఖమ్మం, గిరిజనుల భూపోరాటం, ప్రభుత్వం భూమి రికార్డులు పంచటం, తరువాత వెలుగు/ఇందిరా క్రాంతిపథం వారు, గిరిజనులకు భూమి సర్వే నేర్పి కమ్యూనిటీ సర్వేయర్లుగా నియమించిన, తరువాతి పరిణామాలు 'అత్మగానం' వగైరాలుగా రాస్తూ, తన అనుభవాలకే పరిమితమైన శాస్త్రి గారు ముట్టుకోలేదు. రమేశ్ రంపచోడవరంలో మిగిలిన భూముల సర్వే పట్టించుకోలేదు. కనీసం కనీస వేతనాలు అమలు చేయటం తమ పనికాదని తప్పించుకున్నారు. ప్రజల వద్దకు పోయి తగువులు పరిష్కరించేది బదులు, ఉచిత న్యాయసహాయం కేంద్రం పెట్టి గిరిజనులను న్యాయవాదులబారిన పడేసారు.

1980లో వచ్చిన అటవీ సంరక్షణ చట్టానికి, 90లో తెచ్చిన ఆరు మార్గదర్శకసూత్రాలలో ఉమ్మడి అటవీ యాజమాన్యం (జాయింట్ ఫారెస్ట్ మానేజ్మెంట్) ఒకటి. గిరిజనులకు ఆటవిశాఖ మధ్యన సమస్యలన్నిటిని, ఆ ఆరు సూత్రాల అమలు పరిష్కరించి ఉండేది. కాని కేవలం ఉమ్మడి యాజమాన్యం ఒకటే పట్టుకు వేలాడినందువల్ల ఈ పథకం విఫలమైంది. ఆ సమస్యలు అటవీ గుర్తింపు చట్టం వచ్చాకకూడా ఒక కొలిక్కి రాకపోవటానికి, ఆ చట్టం రుజువులుగా పేర్కొన్న, జనగణన వారి, విలెజ్ మోనోగ్రాఫ్ (గ్రామచరిత్ర) వగైరాలు తమ పరిశోధనలలో సెంటర్ ఫర్ ఎకానోమిక్ సోషల్ స్టడీస్ లాంటి పరిశోధక సంస్థలు ఉపయోగించుకోకపోవటమేనని, శాస్త్రిగారు గమనించలేదు.ఇక శాస్త్రిగారు ప్రశంసించిన నాటి పార్లమెంట్ సభ్యుడు మిడియం బాబురావు నాయకత్వంలో ఏర్పడ్డ పోలవరం పునరావాస కమిటీ, గ్రామసభల తీర్మానాలతో ఒకేచోట అగ్గిపెట్టెలవంటి వేలాదిఇళ్ళతో కాలనీల నిర్మాణానికి ఆమోదం తెలిపిన విషయం

**40వ పుట తరువాయి...**

## భక్తి కవిత్వం–సామాజిక నేపథ్యం

ఆధిక్యాన్ని చూపించుకునే ప్రయత్నాలు చేసాయి. మొదట్లో హైందవం, బౌద్ధం, జైనం ఆ ప్రయత్నాలు చేయగా, బౌద్ధం జైనం ప్రాబల్యాన్ని హైందవం కొంతమేర తగ్గించగలిగినా, పూర్తిగా శాంతియుతంగా కొన్నిచోట్ల అది జరగలేదు. ఆ క్రమంలో దేవుని పేరనే హింస, దౌర్జన్యం, రక్తపాతం చోటుచేసుకోకుండా పోలేదు. ధార్మిక మూఢవిశ్వాసాలు, మరో ప్రపంచం అన్వేషణలో, తోటి మనుషుల బాధలకు దయాహీనులుగా ప్రవర్తించిన సన్నివేశాలు ఎన్నో కనిపిస్తాయి, అప్పుడే కాదు, ఇప్పుడూనూ.

ఏ దేవుడు అయితేనేమి, అతని అద్దంలో అందరూ ఇమిడిపోతారని, ఆ అద్దంలో ఎవరిని వారు చూసుకోవచ్చని, వారికి తెలియకుండా వారందరినీ అతను చూస్తూనే ఉంటాడన్న బలమైన నమ్మకమే అన్ని భక్తి ఉద్యమాలకూ దృఢమైన పునాది. మానవ చరిత్రలో ఫలవంతం కాబోతుందన్న కలకోసం, కలనుండి మేల్కొలిపే బలమైన శక్తిగా, భక్తి రూపుదిద్దుకుంది.

దేవుళ్లను కూడా అనువదించారు. నాయనార్లు శివుడ్ని తేవారంగా అనువదిస్తే, వీరశైవులు అదే శివుడ్ని మరోలా అనువదించుకున్నారు. అదే శివుడు వారికి ఒక్కోమారు విటుడు, ఒక్కోమారు, భర్త, ఒక్కోమారు తండ్రి, ఒక్కోమారు గురువు, ఒక్కోమారు దేవుడు. అనివార్యాలు నిరర్థకతలు ఒక అనంత అనువాదపు గొలుసులాగ వచనాల్లో అంతర్లిఖితంగా ఉంటాయి. ఆండాళ్ విష్ణువుని కృష్ణుడుగా భావించుకున్నపుడు తాను గోపికగా మారినపుడు ఆమె సమస్త సమాజానికి చెందినదిగా కృష్ణుని కరుణను కోరుకుంటుంది, కానీ వధువుగా అతనిమీద తనదే సర్వహక్కులంటుంది.

దేవుడ్ని అప్పటికప్పుడు వారి భాషల అద్దంలో చూపించేందుకు భక్తికవులు ప్రయత్నం చేసారు. మొదట వారి అలోచనలతో వారి భాషా పదాలతో అతనిని దృశ్యమానం చేసి, తరువాత అతనికోసం కృశించి, చివరికి అతనికి స్వాధీనమయిపోయిన వారే అందులో ఎక్కువ. ఎంతగా అంటే వారి భాషలో వారే దేవుడు అయిపోయినంత. భక్తిలో కవిత్వం అప్పటి సంస్కృతి నిర్దిష్టం కాకూండా కూడా లేదు. వారి కవిత్వంలో భక్తి, మార్మికత, మోక్ష కాంక్ష ఎక్కువ. వారి వ్యక్తిగత అనుభవాలు అప్పటి సామాజిక ఆర్థిక పరిస్థితుల్ని తెలియజేస్తాయి. అవి కొత్త సామాజిక ధార్మిక వాస్తవికతకు అద్దం పడతాయి. ప్రాచీన భక్తి సాహిత్యంలో, పురాణగాథలు, సమకాలీన లౌకిక సంప్రదాయాలు, ఆచారాలు, జానపదాల నుండి వారు గ్రహించిన వాస్తవాలు కనపడతాయి. అయితే ఇవి వారి కవిత్వంలోనే కొన్ని ఉంటే, ఆ తరువాత వాటిని తిరగరాసి వ్యాఖ్యానించిన వాటిలో జోడించినవి మరి కొన్ని ఉండొచ్చు.

మధ్యయుగపు భక్తికవుల జీవితకాలం విషయాల్లో అనేక తేడాలు గ్రంథస్థం చేసినవాటిల్లో కనిపించాయి. దేనిని ప్రామాణికంగా తీసుకోవాలోనన్న సందేహం నన్ను అనేక ఇబ్బందులకు గురిచేసేది. అయినా వారి జీవితం పూర్వాపరాల ఆధారంగా కొన్నింటిని తీసుకున్నాను. ఆయా కవుల భక్తి, అప్పటి సామాజిక నేపథ్యమే నాకు మార్గనిర్దేశం చేసేవి.

“అదే నేల – భారతీయ భాషల కవిత్వం, సామాజిక నేపథ్యం” రాస్తున్న క్రమంలో మధ్యయుగంలో భక్తి కవిత్వం నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఆ గ్రంథానికి ఉన్న పరిమితుల మూలంగా ఎక్కువగా భక్తి కవిత్వాన్ని అందులో చేర్చలేకపోయాను. అది ఎప్పటికప్పుడు నన్ను వెంటాడుతూనే ఉండింది. అందుకని భక్తి కవిత్వాన్ని చదువుకుంటూ నేర్చుకుంటూ ఆనందిస్తూపోయాను. నాకు అమితానందాన్ని ఇచ్చిన అన్నింటినీ, నాతోనే పోకుండా ఒక దగ్గర పెట్టి అందరికీ చేర్చాలన్న ప్రయత్నమే నేను చేశాను. అప్పటి సంపూర్ణ భారతదేశంలో అలా అది రెండు వందలకు పైగా కవులు, పన్నెండు వందలకు పైగా కవితలు ఇందులో రావడానికి కారణమయింది. ఎన్నో పుస్తకాల మిత్రులు, ఎందరో పుస్తకాలలాంటి మిత్రులు, అన్ని విధాలా సహకరించే నా శ్రీమతి, పిల్లలు, పిల్లల పిల్లలు, గురువులు, గురువుల లాంటి స్నేహితులు వారందరి సహకారం నాకు కొండంత అండగా అందుకు సాయపడింది. ఇందులో ఇంకా ఎందరినో గొప్ప కవుల్ని చేర్చలేక పోయినా నాకున్న పరిమితుల దృష్ట్యా నా సంతృప్తి మేరా చాలావరకూ చేర్చేందుకే ప్రయత్నమే చేసాను. నాకు ఇంత గొప్ప కవిత్వాన్ని చదువుకునే అదృష్టాన్ని కలగజేసిన ఆయా భక్తి కవులందరికీ శతకోటి వందనాలు.

అలాగే ఎంతో ప్రేమతో ఆదరంతో నన్ను ప్రోత్సహించే వెల్చేరు నారాయణరావు గారు, ఈ పుస్తకానికి ముందుమాట రాయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. వారికి ఎన్నెన్ని హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పుకున్నా తక్కువే.

---

మరిచిపోకూడదు. ఇక శాస్త్రి, వీరభద్రులకు ఇష్టమైన విద్యారంగంలో, శాస్త్రి గారు చెప్పినట్లు భంగ్యా, రుపావత్, శ్రీనివాసరావు, జర్ర అప్పారావు వగైరా గిరిజనులెందరో ఆచార్య స్థానంలో ఉన్నారు. వివిధ తెలుగేతర, తెలుగుతెగలకు చెందిన వీరు, శాస్త్రి గారి హయాంలో రూపుదిద్దుకున్న మాతృభాష వాచకాలలో తమ తెగల మౌఖిక సంప్రదాయాల మీద దృష్టి పెట్టలేదు. ఫలితంగా బంజారా విద్యార్థులు అధికంగా గల మహబూబాబాద్ దగ్గర కారేపల్లి. జూనియర్ కాలేజి ఉపాధ్యాయుడు ‘పిల్లల మెదళ్ళు మూసుకుపోయాయి’ తెలుగు–మాతృభాషల మధ్య వాళ్ళు నలిగిపోతున్నారు అని బాధ పడ్డారు. శాస్త్రిగారు పేర్కొన్న విశ్రాంత ఉన్నతాధికారి సీతారాం నాయక్ అక్కడివాడే.

**గత యాభై ఏళ్ళు గిరిజనులను త్రిశంకుస్వర్గంలోకి నెట్టాయి.ప్రభుత్వ అధికారుల ప్రయోగశాలలుగా మారాయి. వనవాసి అస్మితను కాలరాసాయి. కాని తొక్కిన కొద్దీ, కాలికింద దుమ్ము రేగుతుంది.నేలకుకొట్టినకొద్దీ బంతి, ఎగురుతుంది. ఓడిపోయిన కొద్దీ,. కురుక్షేత్రం దగ్గరౌతుంది. అభివృద్ధి విషప్రయోగానికి చిరకాలంగా బలియై, ఇప్పుడు పురిటినొప్పులు పడుతున్న అడవితల్లి కేక పిల్లదా, తల్లిదా?తల్లీ, పిల్లలలో ఎవరు దక్కుతారో – కాలమే చెప్పాలి.**

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (18)

తెలుగువారి వెలుగు సంపద సాహిత్యం. ఏ జాతి కయినా భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు చరిత్ర సంస్కృతి సంప్రదాయాలను అందించేది సాహిత్యమే.సాహిత్యాన్ని సృష్టించేది కవులు, రచయితలు. సాహితీ స్రష్టలను పదిల పరచుకోవడం ఆ జాతికి లభించే ఎనలేని సంపద. అటువంటి విలువైన సంపదను తెలుగువారికి భవిష్యత్తరానికి భద్రం చేసినవాడు సి.పి.బ్రౌన్ మహాశయుడు. దక్షిణాది భాషలకు ప్రాణం పోసిన వారందరూ పాశ్చాత్యులే. తెలుగులో సి.పి.బ్రౌన్, కన్నడంలో కిట్టెల్, మలయాళంలో గుండర్ట్, తమిళంలో బిషప్ కాల్వెల్ లాంటి మహామహులు భాష సాహిత్యానికి దోహదపడినవారే.దీనికి తోడు ప్రాంతీయ భాషలను అభివృద్ధిచేయడానికి అందరూ స్థానిక పాఠశాలలను నెలకొల్పిదేశీయ భాషాభివృద్ధికి సేవచేసినవారే. తెలుగు వారి జీవన నాడి పద్యం. నన్నయ పూర్వం నుంచి పద్యం ఉన్నా 'గాసట బీసటల్ చదివి గాథలు తవ్వు రోజుల' నుంచి భాషను సంస్కరించినవాడు నన్నయ అని మన నమ్మకం. ఆనాటి నుంచి పద్యం తెలుగువారిని అలరిస్తూ ఉంది.అలాంటి తెలుగువారి పద్య నాడిని ప్రజా పరంచేసిన వాడు వేమన. ఆయన పద్యం తరతరాలకు తరగని గని.అటువంటి ప్రజా కవిని గుర్తించి పాశ్చాత్యులకు పరిచయం చేసి తెలుగువారికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాడు బ్రౌన్ మహాశయుడు.వేమన అనే తెలుగు కవిని గూర్చిన ప్రస్తావన ఫాదర్ లీగాక్ అనే ఫ్రెంచ్ మిషనరీ తన గ్రంథంలో రాసి Library of LOUSIS XU అనే సంస్థకు 1731 జులై 30వ తేదిన పంపించాడు.అది చదివిన అబేదు బాయ్ Hindu manners, customs and cermonies, Abbe J.A.Dubois అనే పుస్తకంలో వేమనను గూర్చి రాశాడు.అబేదు బాయ్ (1765-1848) అనే ఫ్రెంచ్ మిషనరీ దక్షిణాది వారి ఆచారాలలో తెలుగువారి ప్రస్తావన ఎక్కువగా రాశాడు. అది చదివిన బ్రౌన్ వేమన పద్యాలను సేకరించాడు. ఆయన సేకరణలో తొలిగా 2500ల పద్యాలు వాటిని పరిష్కరించి 2000లు చేశాడు. వాటిని మరల సంస్కరించి 1820 నాటికి 693 మాత్రమే స్వీకరించి వేమన పద్యాలుగా నిర్ధారించి ఇంగ్లీషు అనువాదం చేశాడు. తొలి ప్రచురణ 500 ప్రతులు మద్రాసు కాలేజి ప్రెస్‌లో ముద్రించాడు. తొలి పుట ప్రథమ భాగంలో'వేమన' (నగ) యోగి వెలసె లోకములోన। పూజలిడుడు పుణ్యపురుషులారా। పూజలిడిన యంత భుక్తి ముక్తులనిచ్చు। విశ్వదాభిరామ వినుర వేమ। అని ప్రారంభించాడు. The yogi named Vemana Hath Shone forth in the world; Bow to him yemen of virtuel while Yereverence him; he will bestow on You sustenance andperfection, listen o Vemeana, dear to the Lord of all సేకరించిన పద్యాలను ఐదు విభాగాలు చేశాడు. మతం-నైతికం-వ్యంగ్యం- నిగూఢం-ఇతరాలు (కలగూర గంప)గా విభజించాడు. అనంతరం వావిళ్ళవారి ప్రచురణలో భాగాలకు బదులు ఆశ్వాసాలు అని ముద్రించారు. బ్రౌన్ సేకరించి ప్రచురించిన వేమన పద్యాలను ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆచార్యుడు డాక్టర్ ఈశ్వర్ టోపా 1950లో ఉర్దూలోకి అనువాదం చేసి ప్రచురించాడు. దీనికి రాయప్రోలు సుబ్బారావుగారు పీఠికరాశారు. పీఠికలో బ్రౌన్ దొర వేమన కాలం, కులం ప్రాంతాన్ని గురించి చర్చించాడు.భాషా విషయకంగా మాండలిక పద ప్రయోగ ప్రస్తావన కూడా చేశాడు. వాడుక భాషను గూర్చిన వివరణ కూడా ఉంది.విపుల వ్యాఖ్యానం వల్ల వేమన గూర్చిన పరిచయం, పద్య పరిచయం, ఇంగ్లీషు వ్యాఖ్యానం గమనిస్తే తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనూదితమైన తొలి కవి వేమన కావచ్చు. తెల్లవాళ్ళలో సంస్కృతం నేర్చిన తొలివ్యక్తి రాబర్ట్ డినోబిలి (1577-1660) ఈయన చతుర్వేదాలను ఫ్రెంచ్ భాషలోకి అనువదించాడు. భారతీయ వేద సాహిత్యం తొలిగా పాశ్చాత్యులకు పరిచయం చేసినవాడు నొబిలి. ఈయన్ని జగద్గురు తత్త్వ బోధక స్వామి అని పిలిచేవారు.

బ్రౌన్ భాషా సంస్కరణలను గూర్చి రేఖామాత్రంగా చర్చించవలసిన అవసరం ఉంది. బ్రౌన్‌కి పూర్వం ఉన్న తెలుగువారి రచనా పద్ధతులను అవసరం మేర సంస్కరించాడు.గొలుసు కట్టు రచనా విధానం నుంచి విడివిడిగా రాసే పద్ధతి ప్రవేశపెట్టాడు. పుస్తక రచనలో పేరాలుగా విభజనం చేశాడు. అంతకు ముందు పుటల సంఖ్య ఉండేది కాదు.బ్రౌన్ పుటల సంఖ్యను ప్రవేశ పెట్టాడు.రచనలో విరామ చిహ్నాలైన ఫుల్‌స్టాప్, కామా, సెమికోలన్, ప్రశ్నార్థకం, కుండలీకరణం లాంటి వాటిని బ్రౌన్ పరిచయం చేశాడు.

పాఠాంతరాలను గుర్తించి, శోధించి లిఖిత ప్రతిని తయారు చేసి ముద్రించాడు. రామ రాజ స్తవము మల్లనార్యుని రచనను సంస్కరించేటపుడు పండితులు ఒక సందర్భంలో కొరకు రాని కొయ్య అని విడువమని సలహా ఇచ్చారు. కాని బ్రౌన్ కొన్నాళ్ళాగి మళ్ళీ ప్రయత్నించమని కోరినప్పుడు దానికి సరైన అర్థ వ్యాఖ్యానాలు వచ్చాయని వివరించాడు. కవి రచించిన మూల విషయంలోని అర్థాలను విశదం చేసే విధంగా ప్రయత్నించి భాషను, భావాన్ని పదిల పరిచాడు. బ్రౌన్ సేకరణలో తెలుగు, సంస్కృతము, కన్నడము, తమిళము, ఒరియా, ఉర్దూ, మహారాష్ట్రము మొదలయిన భాషా గ్రంథాలను తెప్పించాడు. ఆయా ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రతులను తన సొంత డబ్బు వెచ్చించి కొన్నాడు. ఒకే కావ్యం, కథ పలు ప్రతులున్నప్పుడు వాటి పాఠాంతరాలు, మార్పులు చేర్పులున్న వాటికి శుద్ధ ప్రతి తయారు చేయించాడు. ప్రతి పుట ప్రతి అక్షరం స్వయంగా పర్యవేక్షించాడు. గ్రామగ్రామాలలో పండితుల వద్ద ఉన్నప్రతులు తెప్పించే యత్నంలో కొందరు అమ్మటానికి, ఇవ్వడానికి వెనుకడుగు వేసిన ప్రయత్నాల్లో వారికి స్వయంగా నచ్చ జెప్పి గ్రంథావశ్యకతను వివరించి తెప్పించాడే తప్ప అధికారం పలుకుబడి, డబ్బు మాత్రం పనిచేయవని గుర్తించాడు.గ్రంథ పర్యవేక్షణకు జూలూరి అప్పయ్య పంతులు, వర్యం

అద్వైత బ్రహ్మ శాస్త్రులు, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, తిరుపతి తాతాచార్యులు, కంభంపాటి నరసింహాచార్యులు, చిలక మర్తి నరసింహాచార్యులు, సముద్రాల నరసింహాచార్యులు, గరిమెళ్ళ వెంకయ్య, పెడిపాటి వెంకట నరసయ్య, పురాణం హయగ్రీవ శాస్త్రి, పువ్వాడ వెంకట్రావు, లక్ష్మణకవి, పరవస్తు చిన్నయ సూరి, బేతపూడి సుందరరాయుడు, ముదుంబి కృష్ణమాచార్యులు, గంజాం పెదఅప్పయ్య మొదలయినవారి సహాయం ఎంతైనా ఉందని తెలియజేశాడు. ముఖ్యంగా బ్రౌన్ సాహితీ పరిష్కరణను గూర్చి వివరించవలసి వస్తే కడప ప్రస్తావనే ముఖ్యమనే చెప్పాలి. ఆనాటి బ్రౌన్ కళాశాలగా పేరొందిన కడప బంగ్లా నేడు సి.పి.బ్రౌన్ సాహిత్య పరిశోధన కేంద్రంగా పునర్నిర్మాణమై విరాజిల్లుతుంది. ఈ బంగ్లాలోనే అపురూప సాహిత్య సంపద పునర్జీవమై నేడు మనకులభిస్తుంది.

బ్రౌన్ పరిష్కరించిన తెలుగు సాహిత్యమంతా కాలానుక్రమంలో గమనిస్తే

1825– ఆంధ్ర శబ్ద చింతామణి, ఆంగ్లానువాదం.
1825– జిల్లా నిఘంటువు
1827– ఆంధ్ర గీర్వాణ ఛందము– శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం 1977లో పునర్ముద్రించింది.
1827– Notice regarding the names used in the Indian Zodiac MJLS (వ్యాసం)
1828– Hindu Sculpture - Asiatic Journal (వ్యాసం)
1828– Suttee prevented Asiatic Journal - London, Vol. V
1829– Verses of Vemana, Moral religious and satirical Madras
1830– Essays on trade
1837 A Familier Analysis of Sanscrit Prosody, London ఛందోగ్రంధం
1838– లూకా సువార్త – తెలుగు అనువాదం
1839–40 Essay on Language and literature of the Telugus– 2 భాగాలు– జులై– 1839, అక్టోబర్– 1840 –Madras - Journal of literature and science.
1840– A Grammar of Telugu Language Madras 1857లో పునర్ముద్రణ
1840– Essay on the creed and customs and literature of Jangams-Journal of Royal Asiatic Society - January 1840
1840– Notice regarding the sects of Hindu called Tengala and Vadagala -వ్యాసం April.
1840– Notice of some Roman catholic Books existing in Telugu language వ్యాసం–July
1840– Account of Basavapurana వ్యాసం–Oct
1840– కుచేలోపాఖ్యానం – మద్రాసు
1841– నల చక్రవర్తి కథ– రాఘవాచారికృత ద్విపద కావ్యం
1841– Dialogues in Telugu and English for the use of leaners withagrammatical analysis - Madras. వాచకం
1841– సీతా కళ్యాణం– గరుడాచలము తెలుగు యక్షగానము మద్రాసు హరిశ్చంద్ర కావ్యము (ద్విపద) గౌరనకృతి, నవనాధ చరిత్ర నుంచి కొంత భాగం దీనితో ముద్రణ జరిగింది.
1843– ఆదిపర్వము – నన్నయ భారతము
1844– వసుచరిత్ర – జూలూరి అప్పయ్య వ్యాఖ్యానం – మద్రాసు
1844– హైదరు చరిత్ర – మరాఠి గ్రంధానికి తెలుగు అనువాదం – పరిష్కర్త వేటూరి ప్రభాకరశాస్త్రి – 1956లో నిడదవోలు వెంకట్రావు – పున: పరిష్కరించారు.
1844– Accounts of tribes of Maharatt Bramhins; a translation of Maharatta Documents of Mackanzie
1847– On the Numeralof Balooms name - christian observer - London వ్యాసం
1849– వైజయంతి విలాసం – సారంగు తమ్మయ్య
1849– Memories of Hyder Ali and Tippu Sultan - Madras – మరాఠి నుంచి ఇంగ్లీషులోకి అనువాదం.
1850– కవి రత్నాకరము (సంస్కృతము తెలుగు లిపిలో)
1850– Cycle of table of Hindu and Mohommedan chronology –
1851– ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు
1851– మనుచరిత్ర – అల్లసాని పెద్దన – జూలూరి అప్పయ్య వ్యాఖ్యానం
1852– జిల్లా నిఘంటువు
1852– బ్రౌణ్య ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు
1852– బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు(1903లో ఎం వెంకటరత్నం,H.H. campbell, కందుకూరి వారి సంపాద కత్వంలో పున: ప్రచురణ
1852– నిస్తర రత్నాకరము The Jewel Mine of salvation, పద్య కావ్యం – అజ్ఞాత కవి. తమిళ అనువాదం కూడా ఉంది.
1852– A catalogue of Irregular Verbs in English Language – వ్యాకరణం
1852– The Telugu Reader ఆంధ్ర మార్గదర్శి– తెలుగు రీడర్
1852– Three teatises on mirasi Right by F.W. Ellis, Lt. col. Blackburme, sir Thomas Munroe
1852– Vakyavali or Exercises in Idioms - English and Telugu సంస్కృత ఛందస్సులో ఉంది. – తెలుగు లిపిలో ప్రచురణ
1853– The wars of RaJas అనంతపురం రాజుల చరిత్ర

**తరువాయి 50వ పుటలో....**

## మన చదువుల కథలు

సి.వి.క్రిష్ణయ్య
93965 14554



# ఎవరు తెలివి గలవారు?! 11

**జరిగిన కథ:**

కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకొన్నారు జంతుపక్షిజనాలు. ఆడవిలో పిల్లలకు అనేక మానసిక శారీరక అనారోగ్య సమస్యలు వచ్చాయి. తొలకరి వానలు కురవడంతో అడవిలో మొలకల పండుగ వచ్చింది. ఈ పండుగ సందర్భంగా అడవిలో ఆనందంగా ఆటల ప్రదర్శనలు జరిగాయి. బడిలో పరీక్షలూ, మార్కులు నిషేధించారు. శిక్షలు బహుమతులు కూడా నిషేధించారు. పిల్లలు ఎలా నేర్చుకుంటారో, ఎలా నేర్చుకోరో తెలుసుకున్నారు. మనిషి దుర్బలుడు కావడానికి కారణాలు తెలుసుకున్నారు.

# అద్భుతమైన మనిషి మెదడు

**మనిషి మెదడు కథ చెప్పిన నీలికళ్ల కుక్క**


**గో**మాత వేదిక మీదకి నీలికళ్ల కుక్కను పిలిచింది. నీలికళ్లకుక్క వేదికమీదకి నెమ్మదిగా నడిచివచ్చింది. దాని శరీరమంతా తెల్లని పొడవైన వెంట్రుకలు వేలాడుతూ ఉన్నాయి. కళ్లు నీలిరంగు కలిగి చాలా అందంగా రత్నాల్లా మెరిసిపోతున్నాయి. అంతా ఆసక్తిగా చూస్తూ ఉండగా నోరు విప్పింది.

“సభాసదులారా! నేనొక శాస్త్రవేత్తల కుటుంబంలో ప్రవేశించాను. అది మూడు తరాల మనుషులు నివశిస్తున్న కుటుంబం. ఆ కుటుంబంలో మొదటితరం పెద్దమనిషి శరీర నిర్మాణ శాస్త్రంలోనూ కొడుకు జీవ సాంకేతిక శాస్త్రంలోనూ, మనవుడు అణుజన్యుశాస్త్రంలోనూ పరిశోధనలు చేస్తున్నారు. ఇంట్లో ఆడవాళ్లు కూడా జీవ శాస్త్రాలకు సంబంధించిన ఏదో ఒకదాంట్లో పరిశోధకులు. వారు ప్రతిరోజు సాయంకాలం పెందలకడనే భోజనాల బల్ల దగ్గర కూర్చుని తింటూ మాట్లాడుకొనేవారు. వారు వాదోపవాదాలు చేసుకొనేవారు. వారు నాకు కూడా ఒక గిన్నెలో రుచికరమైన ఆహార పదార్థాలు పెట్టి తినమని చెప్పేవారు. నేను ఆ పదార్థాలు తింటూ విశ్వ ఆవిర్భావం నుండి జీవం పుట్టుక, మానవ పరిణామం, అద్భుతమైన ఈ నాటి నాగరిక మానవుడి మెదడు వరకు ఎన్నో విషయాలు వారు చెర్చించుకొంటూ ఉంటే ఆశ్చర్యంగా ఆనందంగా వినేదాన్ని”.

“నా ప్రియమైన జంతు పక్షిజనులారా! ఈ సృష్టిలో ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఒక్కో అద్భుతాన్ని తెలుసుకొంటూ నేను, ఎంతో ఆనందాన్ని పొందాను. సృష్టి రహస్యాలు తెలుసుకొన్నందుకు నా జన్మ ధన్యమైంది. ఇంత విజ్ఞానాన్ని సంపాదించిన మానవుడుఎంత గొప్పవాడో కదా! మీరు కూడా నేను చెబుతున్న విషయాలు సావధానంగా విని ఆనందించండి అంటూ సగం మూసిన కళ్లతో తన్మయంగా జనాలను చూసింది నీలికళ్లపిల్లి. తన్మయత్వంతో కూడిన ఆ కన్నులను చూసిన పక్షిజంతుజనాల మనస్సుల్లో ప్రశాంతత ఏర్పడి మరింత సావధానులై వినడానికి సిద్ధపడ్డారు.

“మహాజనులారా ! ఈ సృష్టి మొత్తం అనుకోని సంఘటనల పరంపరే. సృష్టి వేరు సృష్టికర్త వేరు కాదు. అంతా ఒక్కటే. మనం సృష్టిగర్భంలో ఉన్నాము. అది ఎలా సంభవించిందో వివరిస్తాను. మొదట విశ్వ విస్ఫోటనం జరిగింది. బ్రహ్మాండం బద్దలైంది. నక్షత్రాలతో కూడిన పాలపుంతలు నలుదిశలా వెదజల్లబడ్డాయి. అందులో ఒకానొక నక్షత్రం సూర్యుడు. ఆ సూర్యుడు చుట్టూ గ్రహాలు ఏర్పడి తిరగసాగాయి. అందులో భూమి ఒకటి. భూమి ఒక వాయు అగ్ని గోళం- అది మెల్లగా చల్లబడుతూ నేలా నీళ్లు వేరు పడ్డాయి. ఇందుకు కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. ఇదొక ఘట్టం. భూమి ఒక గుడ్డు అనుకొంటే సూర్యుడి వేడికి నీటి అడుగున బురద నీటిలో ఒక కదలిక ఏర్పడింది. అదే మొదటి జీవం. మొదట ఏకకణ జీవులు ఏర్పడ్డాయి. ఈ ఏకకణ జీవులు మట్టినుండి పుడతాయి చస్తాయి. ఈ జీవులకు తలాతోకా ఉండదు. పొట్టలేదు. గుండెలేదు. ఏ అవయవమూలేదు. శరీరమంతా నోరే. శరీరమంతా మెదడే. వీటికి సంతానం లేదు. క్రమంగా బహుకణ జీవులు పుట్టాయి. ఈ బహుకణ జీవుల్లో కణవిభజనతోపాటు పని విభజన కూడా జరిగింది. కొన్ని కణాలు పొట్టగాను, కొన్ని కణాలు గుండెగాను, కొన్ని కణాలు కాళ్లు చేతులుగాను, వివిధ రకాల అవయవాలుగా ఏర్పడ్డాయి. ఈ అవయవాలన్నింటిని అనుసంధానం చేసి పనిచేయించడానికి మెత్తటి మెదడు ఏర్పడి తల అనే భద్రమైన పెట్టెలాంటి పుర్రెలో చేరింది. ఈ మెదడు ప్రత్యేకమైన పురుగులాంటిది- ఇంత వరకు ఒక ఘట్టం. ఇది జంతుపక్షిజనాల లోను మానవులలోను ఒకే విధంగా జరిగింది.

ఇక్కడి నుండి మానవుడు మన పక్షిజంతు జాతుల నుండి వేరుపడి నరమానవుడిగా అవతరించిన ఘట్టం ప్రత్యేకమైనది. ఇందులో మానవుడి స్వయం కృషికూడా దాగి వుంది. నాలుగు కాళ్లతో నడిచే



మీట నొక్కగానే కావలసిన సమాచారం చూడగల్గితే. వినగల్గితే. ఈ ఆలోచనల నుండి పుట్టిందే కంప్యూటర్. ఎంతగొప్ప సాధనం. కొన్ని వందల మెదళ్లు సంవత్సరాల తరబడి చేసేపని సెకన్లలో చేస్తుంది. అంతా బాగుంది. కాని నా కంప్యూటర్‌నీ నీ కంప్యూటర్‌నీ కలిపి కంప్యూటర్ల ద్వారా మాట్లాడుకొంటే. ఈ ఆలోచనల నుండి పుట్టిందే అంతర్జాలం, ఇంటర్నెట్ – వీటికి మరో రూపాలు టీవి, సెల్‌ఫోన్లు. మానవుల మెదళ్లు బయట పెట్టెల్లోకి వచ్చాయి. అంతా బాగుంది గాని, ఆ కంప్యూటర్లలోకి సమాచారన్ని ఎక్కించి మనుషులు దాని చేత పనిచేయించాలి. కాని కంప్యూటర్ తనకు తాను నేర్చుకొని తనకు తాను పనిచేస్తే. ఇప్పుడు ఇలాంటి కృషే చేస్తున్నాడు

మనిషి ముందు రెండు కాళ్లను నడక నుండి విముక్తి చేసుకొని వెనకకాళ్లతో నడవడం ప్రారంభించాడు. నిటారుగా నిలబడడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పట్టింది. ముందుకాళ్లు చేతులుగా మారాయి. ఈ చేతులే మనిషిని మహామనిషిగా చేసాయి. మనిషి మెదడు చేసే ఆలోచనలను చేతులు భౌతిక రూపంలోకి తేవడంతో భూగోళం మీద మనిషి ఆధిక్యత మొదలైంది. చేతులు, చేతి వ్రేళ్లు మనిషి ఆలోచనలను పదును పెట్టాయి. మెదడులో అదనపు పొరలు ఏర్పడి పెద్దది కాసాగింది. రోజు రోజుకు తెలివి తేటలు పెరిగాయి. తన భావాలను పక్క వారికి చెప్పడానికి సైగలు, శబ్దాలు సరిపోలేదు. గొంతులో నుండి నాలుక సహాయంతో రకరకాల శబ్దాలు చేయసాగాడు. ఈ శబ్దాలే మాటలుగా భాషగా అభివృద్ధి చెందింది. ఈ భాషతో అతని జ్ఞాపక శక్తి పెరిగింది. ఈ జ్ఞాపకశక్తి జ్ఞానం రూపంలో మెదడులో అదనపు పొరలను అరలను సృష్టించుకొని నిల్వచేసుకోనే సామర్థ్యం పెరిగింది. మెదడు మరింత పెద్దదయింది. భాష మహావిప్లవం సృష్టించిన మాట నిజమేగాని తన మాటలు సజీవ రూపం పొందాలి. ఎక్కడో ఉన్న వారికి చెప్పాలి. తాను మరణించినా రాబోయే తరాల వారికి చెప్పాలి? ఎలా ? అప్పుడు పుట్టిందే లిపి. అక్షరాలు. మాటకు ప్రాణంపోసి అక్షరరూపం ఇచ్చాడు. తన అనుభవాలు జ్ఞాపకాలు పుస్తకాల రూపంలో మానవులందరికి అందాయి. ఈ పుస్తకాలే మానవ వికాసానికి వేల సంవత్సరాలు సాయపడ్డాయి.

కథలు, గాథలు, పురాణాలు, మత గ్రంథాలు, శాస్త్రలు, చట్టాలు రాసుకొని ఒక క్రమజీవితాన్ని ఏర్పరచుకొన్నాడు. ఇదంతా భాష, లిపి వల్లనే సాధ్యమయింది. రోజువారి వినియోగం, వినోదం, విజ్ఞానం, మూడు విధాల మానవ వికాసం భాషవల్లనే సాధ్యం అయింది. మెదడు బయట మెదడులోని ఆలోచనలు పుస్తకరూపంలోకి వచ్చాయి. మెదడు భారం తగ్గింది. అయితే పుస్తకాలు భారంగా ఉన్నాయి. శిథిలమవుతున్నాయి. వేలాది లక్షలాది పుస్తకాల్లో ఏవిషయం ఎక్కడ ఉందో ఎలా తెలుసుకోవడం? ఎంత కష్టం? బయట మెదడునే సృష్టిస్తే. మానవుడు. కృత్రిమ మేధను సృష్టిస్తున్నాడు. తనలా నేర్చుకొనే మరో మెదడు తయారీలో ఉన్నాడు.

మెదడు ఒక పువ్వులాంటిది. పువ్వువికసించి పుప్పొడి రేణువులు నలువైపులా విదజల్లబడినట్లు మెదడులో పుట్టే కొత్త కొత్త ఆలోచలను ఇతర మెదళ్లకు అందాలి. మరింతగా కొత్త ఆలోచనలు రూపుదిద్దుకొని కొత్త ఆవిష్కరణలు జరగాలి. జరుగుతున్నాయి. ఈ అంతర్జాలం వలన మనుషులందరి మెదళ్లు ఒక్కటై మానవులు విజ్ఞానవంతమైన విచక్షణతో కూడిన జీవనం సాగించాలి అని కోరుకొందాం.

భవిష్యత్తులో ఏమి జరగబోతుందో నేను విన్న మరికొన్ని విషయాలు చెబుతాను. విజ్ఞానంతో నింపుకొన్న ఈ కంప్యూటర్లు వివిధ రకాల యంత్రాలు మరింత సూక్ష్మరూపంలోకి రాబోతున్నాయి. బఠాణీ గింజ, బియ్యపు గింజ అంత చిన్న రూపాలలోకి మారి మానవ శరీరంలో అంతర్భాగాలు కాబోతున్నాయి. ఇంతకాలం పుస్తకాల రూపంలో కంప్యూటర్ రూపంలో బయట ఉన్న మెదళ్లు మళ్లీ మనిషి తలలోకి చేరి మెదడుకు అదనపు పొరలుగా పనిచేయబోతున్నాయి. టీవీలు, కంప్యూటర్లు చూడనవసరం లేదు. కళ్లు మూసుకొని తలచుకోగానే అన్నీ కనిపిస్తాయి. మహా అద్భుతంగా ఉంది కదా! మరో అద్భుతం రాబోతున్నది. అదేమిటంటే తాత ముత్తాతలు సజీవులై ఇళ్లల్లో మన కళ్లముందే తిరుగుతూ ఉంటారు. కాకపోతే రోబోల రూపంలో. బ్రతికి ఉన్నప్పుడు మనిషి మెదడులో ఉన్న ఆలోచనలన్నింటిని అనుభవాలను కృత్రిమ మెదడులో నిల్వ చేసుకొని రోబోటులోకి చొప్పిస్తారు. అవి చనిపోయిన వారిలా ప్రవర్తిస్తాయి మాట్లాడతాయి. గతంలో ఏం జరిగిందో చెబుతాయి. శరీరం ముఖ్య కాదుకదా 'నేను' అనేది మెదడుకదా? ఆలోచనలు సజీవంగా ఉంటే మనిషి ఉన్నట్లేకదా!

ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాను. మానవుడు ఇంతమేధస్సు సంపాదించడానికి కారణం ఏమిటి? ఆ మెదడులో పుట్టే ప్రశ్న. ఎందుకు? ఏమిటి? ఎలా? మనిషి తెలుసుకోడానికి అన్వేషించడానికి

**47వ పుట తరువాయి...**

## పడమటి గాలితో నివురు తొలగిన...

– తెలుగు నుంచి ఇంగ్లీషులోకి గురజాడ అప్పారావు గారిచే పునర్ముద్రించబడినది.

1853– పాల్ చరిత్ర – తెలుగు లిపిలో ఉన్న సంస్కృత పద్య కావ్యం

1854– బ్రౌణ్య మిశ్ర భాషా నిఘంటువు

1855– తాతాచారి కథలు– తెలుగులో గురజాడ అప్పారావు – పరిష్కర్త – 1926లో 1974లో బంగోరే సంపాదకుడిగా పునర్ముద్రణ.

1855– మిరాశీ వాదము – తెలుగు నుంచి ఇంగ్లీషులోకి

1855– English and Hindustani phrasealogy or excercises in Ideoms ofEnglish and Dakshini - Hindustani – వ్యాకరణం

1859– The experience of A Nicholas - London

1861– Carnatic chronology, London చారిత్రకం

1864– Telugu Spells - MJLS, కడప క్రిమినల్ డాక్యుమెంట్ – తెలుగు నుంచి ఇంగ్లీషు – జులై

1866– Some account of the Literary life of charles philip Brown, London. స్వీయ చరిత్ర నిడదవోలు వెంకట్రావుగారు అనువదించారు–1963 మే– భారతి

1871– on Malabar, coramandal quillon - London.

1871– Essays on thecreed and customs of Jangams - London

1909– Popular Telugu tales by Tatachani - Madras తాతాచారి కథలకు తెలుగు అనువాదం.

వీటితో పాటు అప్పకవీయం, అమరకోశం, అహల్యకథ, అహల్యా వృత్తాంతం, కవిజనాశ్రయము, కవి శిరోభూషణము, పదనిధి, ప్రభు లింగలీల (ద్విపద), బాలసరస్వతీయ, భగవద్గీత, Common Prayer Book వందల సంఖ్యలో ఉన్న శతకాలు, ప్రాంతీయ చరిత్రలు విష్ణుపురాణం, స్కాందపురాణం, హరివంశం, కాశీఖండం, శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీ పర్వత పురాణం, అంబరీష చరితం, అనిరుద్ధ చరిత్ర, అహల్యా చరిత్ర, ఆముక్త మాల్యద, ఆముక్త మాల్యద శబ్ద సూచి, కవికర్ణ రసాయనము, కుచేలోపాఖ్యానము, చమత్కార మంజరి, మను చరిత్ర, మనుచరిత్ర శబ్ద సూచి, మొల్ల రామాయణము, యయాతి చరిత్ర, రఘువంశము, రాధామాధవ సంవాదము, రాధికా స్వాంతనము, రామాభ్యుదయము, వసుచరిత్ర, విక్రమార్క చరిత్ర, విజయ విలాసము, శశాంక విజయము, శుక సప్తతి, శృంగారనైషదము, సత్యభామా స్వాంతనము, హంసవిశతి, హంసవిశతి దాదాపు 42 ద్విపద కావ్యాలు, 16 వేదాంత గ్రంధాలు మరెన్నో కథా కావ్యాలున్నాయి. మరిన్ని వివరాలకు ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం మూడవ సంపుటి (అకాడమీ ప్రచురణలో చూడవచ్చు)

– తరువాత భాగం వచ్చే సంచికలో

---

మూలం ఈ ప్రశ్నే – ఇది సహజంగా పుడుతుంది. పసిపిల్లల్లో మరీ ఎక్కువగా ఈ ప్రశ్నించే గుణం ఉంటుంది. ఎందుకుంటే వాళ్లు ఈ భూమిమీదికి కొత్తగావచ్చారు గదా! ఏమి తెలియదు కదా! అందుకే ప్రతిదీ తెలుసుకోవాలనే కుతూహలంతో అడుగుతారు.

కాని మనుషులు బడి అనే నిర్బంధ జైలులో పిల్లల్ని తోసి ఏమీ ప్రశ్నించనీయకుండా తమ బిడ్డల్ని పెంచుకొంటున్నారు. చదువు పేరుతో ఆలోచనలను అణగతొక్కుతున్నారు. పిల్లలు విసిగిపోయి, కోపం పెంచుకొని పెరిగి పెద్దవారై విధ్వంసకులుగామారుతున్నారు. ఈ సంగతి మనుషులు గ్రహించలేకున్నారు. సరైన పద్ధతిలో ఆలోచించే శక్తిని కోల్పోయేటట్లు చేసే ఈ బడులను మూసేస్తే గాని ఈ ప్రపంచం సక్రమంగా నడవదు. ఈ విషయాలు ఆ శాస్త్రవేత్తల కుటుంబలోని వ్యక్తులు మాట్లాడుకొంటూ చాలా బాధపడ్డారు. 'మహా జనులారా నేను తెలుసుకొన్న విషయాలు మీకు చెప్పే అవకాశం గల్పించిన అందరికీ నమస్సులు' అంటూ తన మాటలు ముగించింది నీలికళ్ల కుక్క.

చివరిగా సామాజిక శాస్త్రవేత్త వృద్ధుడైన నక్కగారు వేదికమీదికి వచ్చారు. 'సభా సదులారా! నేను రెండు మాటలు మాట్లాడాలని వచ్చాను. తెల్లపావురం మనిషిసంతోషంగా లేకపోవడమే అతని అనారోగ్యానికి దుర్బలత్వానికి కారణం అని చెప్పారు. ఆ సంతోషంలేకపోవడానికి కారణం ఏమిటో తెలుసుకోవాలన్నారు. నేను అనేక సంగతులను తర్కించిచూసాను. మనిషి ఆలోచనలు హేతుబద్ధంగా ఉంటాయి. – ఏ ప్రశ్నకు ఏ తర్కానికి అందని సామాజిక పరిస్థితులే అతని అశాంతికి అనారోగ్యానికి మూలం అని నా అభిప్రాయం. కోర్టులు, పోలీసు స్టేషన్లు, అధికారులు రాజకీయ నాయకులు, చట్టాలు, ఏవీ సవ్యంగా లేవు. నేరంచేసినవాడు రొమ్ము విరుచుకొని బయట స్వేచ్ఛగా తిరుగుతుంటాడు. అహంకారులు, అవివేకులు పరిపాలిస్తుంటే మేథావులు విజ్ఞులు అధికారం లేక వాళ్ల కింద బానిసల్లా బ్రతుకుతుంటారు. నిరంతరం శ్రమ చేసేవాళ్లు కడు బీదలుగా ఉంటారు– తెల్ల వారేసరికి కొందరు వేల కోట్లకు అధిపతులు అవుతారు– అక్రమంగా సంపాదించిన అవినీతి సొమ్ము భగవంతుడికే కానుకల రూపంలో ఇచ్చి మొక్కులు చెల్లించుకొంటారు. అద్భుతమైన చట్టాలుంటాయి. అవి అమలు జరుగవు. ఎక్కడ చూసినా విశాలమైన భూములుంటాయి. కాని ఉండడానికి చోటు లేని వారు కోట్లాదిగా ఉంటారు. పరిస్థితులు ఇలా ఎందుకున్నాయి అని ప్రశ్నించుకొంటే సమాధానం దొరకదు. సమాధానం దొరకని సామాజిక అస్తవ్యస్త పరిస్థితులే మనిషి సంతోషంగా లేకపోవడానికి కారణం అని తెలియాజేసుకొంటున్నాను. అందరికీ వందనాలు' అంటూ ముసలి నక్కగారు తన మాటలు ముగించారు.

అంతా నిజమే గదా అనుకొన్నారు. చుట్టూ అపరిశుభ్రంగా ఉంటే రోగాలు వచ్చినట్లే – సామాజికంగా పరిస్థితులు గందరగోళంగా ఉంటే మనస్సులు కూడా గందరగోళంగా ఉంటాయి. శరీర ఆరోగ్యాలు కూడా చెడిపోతాయి కదా అనుకొన్నారు.

*వచ్చె సంచిక :కొత్తరకపు బడులు*

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

**నడుస్తున్న చరిత్ర అమ్మనుడి** మాస పత్రికలలో ఇరవై ఏళ్లుగా ప్రముఖ కార్టూనిస్టు

సరసి





తెలుగు భాషోద్యమంలో భాగంగా రచించిన వ్యంగ్యరేఖాచిత్రాలను ఒక పుస్తకంగా వెలువరిస్తున్నాం.

నవంబరు 5వ తేదీన విడుదల

వెల: 200/-

**అమ్మనుడి**లో ధారావాహికగా ప్రచురించిన నవల

**జగమునేలిన తెలుగు,** పుస్తక రూపంలో వెలువడింది. వెల: రూ. 200/-




మగాడు, ఒకలప్ప, చామదేవి, నూకరాజు, సన్నరాజు, వెంకటరంగమ్మ... సాధారణమైన పేర్లు కావు. మయన్మార్, థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియా, శ్రీలంకలను ఒకప్పుడు ఏలిన రాజులు, రాణులు. ఈ పేర్లు ఆయా దేశాలలో ప్రాచీన రాజ్యాలకు తెలుగునేలతో దగ్గరి సంబంధం ఉందనడానికి గట్టి సాక్ష్యాలు. శ్రీలంకలో తొలి, మలి రాజ్యాలూ తెలుగువారివే. మయన్మార్‌లో తటోను, హంసావతి, మర్తబాన్ రాజ్యాలు; థాయిలాండ్‌లో ద్వారావతి, హరిపుంజాయి; వియత్నాంలోని చంపారాజ్యం; ఇండోనేషియాలోని తరుమ నగరం, శైలేంద్ర, మాతరం రాజ్యాలలో తెలుగువారి ఆనవాళ్లు నేటికి స్పష్టంగా ఉన్నాయి. అక్కడ ప్రాచీన లిపికి మూలం మన తెలుగు నేలే. శిల్పానికి ప్రేరణ అమరావతి. కాంబోడియాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన అంగ్‌కార్‌వాట్ ఆలయంలో అమరావతి శిల్పానికి విస్తృతరూపం కనిపిస్తుంది. ఈ విషయాల్ని తెలియచేసే పరిశోధనాత్మక నవల ఇది. వేల యేళ్ళనాడు ఆగ్నేయాసియాలో అజరామరమైన తెలుగు ఖ్యాతికి అక్షరరూపం.

ప్రతులకు: తెలుగుజాతి (ట్రస్ట్) 8-386, జీవక భవనం,
అంగలకుదురు(పోస్టు) తెనాలి-522 211, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ammanudi@gmail.com, ఫోన్: 98480 16136 / 94404 48244

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
October 2022 Vol :8, Issue 7

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

Bommidala
International



దసరా
మరియు
దీపావళి
శుభాకాంక్షలు



# బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244